ప్రభాత

# వెలుగు

23.03.2020

సోమవారం | హైదరాబాద్

సంపుటి: 6 సంచిక: 38 పేజీలు: 12+12 | ₹ 5

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, WARANGAL, JAGTIAL




ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

## కరోనా అప్‌డేట్స్

**మన దేశంలో**

| పాజిటివ్ | క్యూర్ | డెత్ |
|---|---|---|
| 396 | 23 | 07 |

**తెలంగాణలో**

| | |
|---|---|
| పాజిటివ్ | 27 |
| క్యూర్ | 01 |

**పలు దేశాల్లో**

| | కేసులు | మృతులు |
|---|---|---|
| ఇటలీ | 59,138 | 5,476 |
| చైనా | 81,054 | 3,261 |
| స్పెయిన్ | 28,603 | 1,756 |
| ఇరాన్ | 21,638 | 1,685 |
| ఫ్రాన్స్ | 14,459 | 562 |
| అమెరికా | 36,756 | 396 |
| బ్రిటన్ | 5,683 | 281 |
| నెదర్లాండ్స్ | 4,204 | 179 |

జనం లేక వెలవెలపోతున్న హైదరాబాద్‌లోని పంజాగుట్ట నాగార్జున సర్కిల్



# దేశమంతా ఇంట్లనే

## జనతా కర్ఫ్యూ సక్సెస్

**ప్రధాని మోడీ పిలుపునకు అనూహ్య స్పందన**

- కరోనా నియంత్రణకు ఒక్కటైన దేశ ప్రజలు
- ఢిల్లీ నుంచి గల్లీ వరకూ స్వచ్ఛందంగా కర్ఫ్యూ
- ఇంటికే పరిమితమైన కోట్లాది మంది జనం
- మూతపడిన షాపులు, మార్కెట్లు, కంపెనీలు, ఆఫీసులు
- రైళ్లు, బస్సులు, విమానాలు, మెట్రో సర్వీసులు బంద్
- ఎమర్జెన్సీ సేవల్లో ఉన్న వారికి చప్పట్లతో సంఘీభావం

03



**ఇది తొలి అడుగు**

కరోనా వైరస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ దేశం తరఫున కృతజ్ఞతలు కలిసిముందుకు నడిస్తే ఎటువంటి చాలెంజ్ నైనా ఓడిస్తామని దేశ ప్రజలు నిరూపించారు. కర్ఫ్యూ ముగిసినా.. ఇది మనం సంబరాలు చేసుకునే సమయం కాదు. ఇది సక్సెస్‌గా భావించవద్దు. సుదీర్ఘ పోరాటంలో తొలి అడుగు మాత్రమే. ఇదే పోరాటం కొనసాగిద్దాం.

**- ట్విట్టర్‌లో ప్రధాని మోడీ**

## ఈ నెల 31 దాకా

# లాక్‌డౌన్

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ సర్వీసులు తప్ప అన్నీ బంద్

### అందరూ ఇండ్లకే పరిమితం కావాలి

### రేషన్ కార్డున్న ఫ్యామిలీలో ఒక్కొక్కరికీ ఫ్రీగా 12 కిలోల బియ్యం, కార్డుకు రూ. 1,500 ఇస్తం: సీఎం

- పాలు, కూరగాయలు, కిరాణా షాపులు, గ్యాస్, పెట్రోల్ బంక్‌లు తెరిచే ఉంటయ్
- బస్సులు, రైళ్లు, ఆటోలు, వైన్స్‌లు కూడా బంద్
- ఇంటర్ స్టేట్ బోర్డర్లు మూసేస్తున్నం
- ఐదుగురికి మించి బయట గుమిగూడొద్దు
- ప్రభుత్వ ఉద్యోగులకు రొటేషన్ పద్ధతిలో డ్యూటీ
- ప్రైవేట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, కార్మికులకు జీతాలివ్వాల్సిందే: కేసీఆర్

02



మన కోసం మనం, జనం కోసం జనం, అందరి కోసం అందరం పరితపించి పనిచేయాల్సిన సిచ్చువేషన్ ఇది. జనతాకర్ఫ్యూలో చూపిన క్రమశిక్షణ, పట్టుదల కొనసాగించాలి. మార్చి 31 దాకా రాష్ట్రం లాక్‌డౌన్‌లో ఉంటది. ప్రజలు గుమిగూడొద్దన్నదే దీని ఉద్దేశం. కరోనా వైరస్‌తో భయంకరంగా దెబ్బతింటున్న దేశం ఇటలీ. అక్కడ పరిస్థితిని అక్కడివాళ్లే చెడగొట్టుకున్నరు. ఇటలీలో రోజుకు ఐదారు వందల మంది చనిపోతున్నరు. ఆ దుర్గతి మనకు రావొద్దంటే వందకు వంద శాతం స్వయం నియంత్రణ పాటించాలి.

**- సీఎం కేసీఆర్**



నల్గొండలో ఆదివారం సాయంత్రం డాక్టర్లకు థ్యాంక్స్ చెప్తూ చప్పట్లు కొడుతున్న జనం

**ఒక్కరోజే ఆరుగురికి పాజిటివ్**

## ఇప్పటివరకు రాష్ట్రంలో 27 కేసులు

- విదేశాల నుంచి వచ్చిన మరో ఐదుగురికి పాజిటివ్
- కరోనా పాజిటివ్ తేలిన భర్త నుంచి భార్యకు వైరస్
- పెరుగుతున్న ప్రైమరీ కాంటాక్ట్స్
- వైరస్ ముప్పు పెరుగుతుందనే ఆందోళన
- కింగ్ కోఠిలో స్పెషల్ ఆస్పత్రి

02

## 13 రాష్ట్రాలు బంద్

- కరోనా ఎఫెక్ట్‌తో లాక్‌డౌన్‌కు ప్రభుత్వాల నిర్ణయం
- వైరస్ ప్రభావమున్న 75 జిల్లాలూ షట్‌డౌన్
- అత్యవసర, నిత్యావసర సర్వీసులే అందుబాటులో
- కొన్ని రాష్ట్రాల్లో ఇంటికే రేషన్

వివరాలు 5లో

**పాఠకులకు విజ్ఞప్తి**

కరోనా ముప్పుపై చేస్తున్న యుద్ధంలో అందరం సైనికులమే. ఇటువంటి అత్యవసర సమయంలో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలతో పాటు పౌరులుగా అంతా బాధ్యతగా వ్యవహరించవలసిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే సామాజిక బాధ్యతగా వీలైనంతమంది తక్కువ సిబ్బందితో వెలుగు పత్రికను అందించాలని భావిస్తున్నాం. అందువల్ల జిల్లా టాబ్లాయిడ్స్ అందించ లేకపోతున్నాం. ముఖ్యమైన జిల్లా వార్తలేవీ మిస్ కాకుండా మెయిన్‌లో అందిస్తాం. సమాచారంతో పాటు మీకు నచ్చే విశేషాలతో "లైఫ్" అనుబంధం ఉంటుంది. ఈ నిర్ణయం తాత్కాలికమే. సహృదయంతో పాఠకులు అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం.

**- ఎడిటర్**

## దేశంలో ఒక్కరోజే ముగ్గురు బలి

- 7కు చేరిన కరోనా మృతులు
- మొత్తం 396 మందికి సోకిన వైరస్
- ఆదివారం 75 మందికి పాజిటివ్

## ప్రపంచం విలవిల

- కరోనాకు 14,441 మంది బలి
- వరల్డ్ వైడ్‌గా 3,37,679 కేసులు
- ఇటలీలో 5,476 మంది మృతి

05



ఇది హాస్పిటల్ కాదు.. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కరోనా స్క్రీనింగ్ సెంటర్

సిరలు వాపుతో ఇబ్బంది పడుతున్నారా

FOR APPOINTMENTS
9100779498
9959033037

Before Laser After Laser

డాక్టర్ అభిలాష్ సంధ్యాల హైదరాబాద్‌లోనే విశిష్టమైన ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్, అనారోగ్య సిరలు (varicose veins) నిపుణులు 6 సంవత్సరాల వ్యవధిలో 6500 మంది రోగులకు కొన్సలింగ్ జరిపారు 2017లో వైద్య రత్న పురస్కారం అందుకున్నారు

Flow VASCULAR CLINIC
H.No: 2-22-298/2/A, Near Kalamandir, KPHB Main Road, Kukatpally, Hyderabad-72. Cell: 9989649498, 9959033037, Contact@drabhilash.com | www.drabhilash.com

**వెన్‌కాబ్ (ఫారం గేట్ ధర)**

| హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ |
|---|---|---|
| 33.00 | 33.00 | 33.00 |
| **కరీంనగర్** | **నిజామాబాద్** | **ఖమ్మం** |
| 35.00 | 33.00 | 33.00 |

# అమెరికాలో కల్లోలం

## కేసుల్లో టాప్ 3 అగ్రరాజ్యానిదే.. రెండు రోజుల్లోనే ఆ ప్లేస్‌కు

అమెరికా.. మరో ఇటలీ కాబోతోందా? ఇటలీ చేసిన నిర్లక్ష్యమే అమెరికా చేస్తోందా? అంటే అవుననే హెచ్చరిస్తున్నారు సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) మాజీ చీఫ్ డాక్టర్ టామ్ ఫ్రీడన్. ప్రస్తుతం అమెరికాలో ఉన్న వైద్య వసతులకు మించి కరోనా కేసులు నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. కేసుల పట్ల అమెరికా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. మరో వారం లేదా కొన్ని రోజుల్లోనే అమెరికాకూ ఇటలీ పరిస్థితే వస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఆ దేశ పరిస్థితి ఆయన చెప్పిన దానికి చాలా దగ్గరగానే ఉంది. దేశంలో కేసుల సంఖ్య 36,756కి పెరిగింది. ఒక్కరోజే 12,549 కొత్త కేసులు రికార్డయ్యాయి. 396 మంది వైరస్‌కు బలయ్యారు. ఒక్కరోజులో రికార్డ్ స్థాయిలో 94 మంది చనిపోయారు. కేసుల లిస్టులో ఇటలీ తర్వాతి ప్లేస్ అమెరికాదే. అంటే ప్రపంచంలో టాప్ 3 అమెరికానే. ఒక్క న్యూయార్క్‌లోనే 21,381 కేసులు నమోదు కాగా, ఒక్కరోజులోనే 11,009 కొత్త కేసులు రిపోర్ట్ అయ్యాయి.



జనాలు బయట తిరగొద్దని చెబుతూ కాలిఫోర్నియాలో లాక్‌డౌన్ విధించారు. కానీ, లాస్‌ఏంజిలిస్‌లోని వెనిస్ బీచ్‌లో ఇలా కొంతమంది సైకిళ్లు తొక్కుతూ టైంపాస్ చేశారు.

04

# ఛత్తీస్ గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

## 17 మంది జవాన్లు మృతి

ఛత్తీస్‌గఢ్ లోని దండకారణ్యంలో జరిగిన భారీ ఎన్ కౌంటర్‌లో 17 మంది జవాన్లు చనిపోయారు. మరో 15 మంది గాయపడగా.. అందులో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉంది. మావోయిస్టులు భద్రతా బలగాలను దారి మళ్లించారని.. చుట్టుముట్టి కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు.

09



☰ క్విక్ బైట్స్



## వీడియో కాన్ఫరెన్స్‌లో కేసుల విచారణ

- సుప్రీం కోర్టు కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, వెలుగు: కరోనా వ్యాపిస్తున్న నేపథ్యంలో కేసుల విచారణపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమైన కేసుల విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు ఢిల్లీలో ఈ నెల 31 వరకు లాక్ డౌన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేసు విచారణ నేరుగా చేపట్టరాదని కోర్టు రిజిస్ట్రీ డిసైడ్ చేసింది.

## అదుపులో కరోనా అనుమానితుడు

**నాంపల్లి - వెలుగు:** హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్ లో కరోనా అనుమానితుడు ఆదివారం ఉదయం కంటపడ్డాడు. అతడిని నాంపల్లి రైల్వే పోలీసులు గాంధీకి తరలించారు. మంగళహాట్ కి చెందిన మోసిన్ అలీ... నైజీరియా, లాగోస్ నుండి అబుదాబి మీదుగా ఫ్లైట్ లో ముంబైకి వచ్చాడు. ముంబై నుండి ముంబై ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం ఉదయం నాంపల్లి రైల్వే స్టేషన్ కి చేరుకున్నాడు. మోసిన్ చేతి పై హోమ్ క్వారంటైన్ స్టాంప్ ఉండడంతో... తోటి ప్రయాణికుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు.



## లాక్‌డౌన్ మాత్రమే సరిపోదు

- డబ్ల్యూహెచ్‌ఓ నిపుణుడు మైక్ ర్యాన్ హెచ్చరిక

**న్యూయార్క్ :** కరోనా వైరస్ ను అంతం చేయాలంటే దేశాలు ఎక్కడికక్కడ లాక్ డౌన్ చేసుకున్నంత మాత్రాన సరిపోదని డబ్ల్యూహెచ్‌ఓ టాప్ ఎమర్జెన్సీ నిపుణుడు మైక్ ర్యాన్ హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిపై ఆయన ఆదివారం మాట్లాడుతూ.. వైరస్ మళ్లీ విజృంభించకుండా పూర్తిస్థాయి పబ్లిక్ హెల్త్ చర్యలు తీసుకోవడమే సరైనదన్నారు. 'ముందుగా వైరస్ బారిన పడ్డ వాళ్లందరినీ గుర్తించడంపై ఫోకస్ పెట్టాలి. తర్వాత వాళ్లను ఐసోలేట్ చేయాలి. ఆ తర్వాత వాళ్లతో కాంటాక్ట్ అయిన వాళ్లనూ గుర్తించి ఐసోలేట్ చేయాలి" అని చెప్పారు. 'వైరస్ ను అంతం చేసేందుకు ఎక్కడికక్కడ లాక్ డౌన్స్ చేసుకుంటున్నారు. కానీ.. లాక్ డౌన్స్ ఎత్తేసిన తర్వాత వైరస్ మళ్లీ విజృంభించే ప్రమాదం ఉంటుంది. అందుకే లాక్ డౌన్స్ చేయడమే కాదు.. వైరస్ మళ్లీ చెలరేగిపోకుండా ఇప్పుడే పబ్లిక్ హెల్త్ పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి" అని ర్యాన్ సూచించారు.

## తిథి- నక్షత్రం

శ్రీ వికారినామ సంవత్సరం
ఉత్తరాయణం, శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం, సోమవారం
**తిథి:** బ.చతుర్దశి ఉ.11.48 వరకు.. తదుపరి అమావాస్య
**నక్షత్రం:** పూర్వాభాద్ర రా.12.40 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర
**వర్జ్యం:** లేదు
**దుర్ముహూర్తం:** ప.12.30 నుంచి 1.18 వరకు
తదుపరి ప.2.54 - 3.41 వరకు
**రాహుకాలం:** ఉ.7.30 నుంచి 9.00 వరకు
**యమగండం:** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**శుభసమయాలు:** లేవు

## ఈ నెల 31 దాకా

# రాష్ట్రం లాక్ డౌన్



ప్రగతిభవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రులు ఈటల, తలసాని

**హైదరాబాద్, వెలుగు:**

కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ఈ నెల 31 వరకు రాష్ట్రం లాక్‌డౌన్‌లో ఉంటుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. అప్పటివరకు ఎమర్జెన్సీ సర్వీసులు తప్ప అన్నిటినీ బంద్ చేస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, తాను ఇచ్చిన పిలుపునందుకొని ఆదివారం జనతా కర్ఫ్యూను రాష్ట్ర ప్రజలు అద్భుతంగా నిర్వహించారని, ఇదే స్ఫూర్తిని మరో తొమ్మిదిరోజుల పాటు కొనసాగించి ఎవరి ఇండ్లకు వాళ్లు పరిమితం కావాలని సూచించారు. కరోనా నుంచి రక్షించుకోవాలంటే స్వీయ నియంత్రణే ముఖ్యమని, అదే శ్రీరామ రక్ష అని ఆయన తెలిపారు. ఐదుగురికి మించి జనం గుమిగూడొద్దని, సీరియస్‌గా దీన్ని ఫాలో కావాలన్నారు. కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం ప్రగతిభవన్‌లో హైలెవల్ కమిటీతో సీఎం కేసీఆర్ సమీక్షించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు.

**ఈ స్ఫూర్తి కొనసాగాలి**

"కరోనా వైరస్ ప్రపంచాన్ని చుట్టిముట్టి భయకంపితం చేస్తున్నది. ప్రధానమంత్రి పిలుపుతో పాటు రాష్ట్ర ప్రభుత్వంగా మనం దీన్ని రూపుమాపేందుకు జనతా కర్ఫ్యూ పాటించాలని పిలుపునిచ్చినం. అందరం కలిసి అద్భుతమైన దృశ్యం ఆవిష్కరించినం. ప్రజలు ఆ పిలుపును గౌరవించి బయటికి రాకుండా ఇండ్లకే పరిమితమైండ్రు. ప్రపంచ మానవాళి కోసం ఎంతో కంట్రిబ్యూట్ చేసినం. సాయంత్రం ఐదుగంటలకు సంఘీభావ సంకేతంగా ఎవరి ఇండ్లల్లోంచి వాళ్లు చప్పట్లు కొట్టి థ్యాంక్స్ చెప్పారు. ఐక్యతను, విజ్ఞతను చాటిచెప్పిన ప్రతి తెలంగాణ బిడ్డకు, నా తరపున, ప్రభుత్వం తరపున శిరస్సు వంచి నమస్కారాలు చెప్తున్న." అని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు.

**తాజాగా ఐదు పాజిటివ్ కేసులు**

ఆదివారం రాష్ట్రంలో ఐదు కరోనా పాజిటివ్‌కేసులు నమోదైనట్లు సీఎం తెలిపారు. ఈ ఐదుగురు కూడా విదేశాల నుంచి వచ్చినవాళ్లేనని, ఇందులో ఇద్దరు లండన్ నుంచి, ఇద్దరు దుబాయ్‌నుంచి, ఒకరు స్కాట్‌లాండ్ నుంచి వచ్చినవాళ్లని వివరించారు. "దేశానికి బయటి నుంచి వస్తున్న వ్యక్తులు బంద్ అవుతున్నారు.. ఫారిన్ నుంచి దిగుమతి అయ్యే బీమారీ అవస్థ ఈ రోజు నుంచి బంద్ అయితది.. విదేశాల నుంచి వచ్చిన వారు క్వారంటైన్‌లో, పాజిటివ్ వచ్చిన వారంతా ట్రీట్‌మెంట్లో ఉన్నరు. దుబాయ్ రిటర్నీ నుంచి పేరెంట్స్ ద్వారా వాళ్ల కొడుక్కు పాజిటివ్ వచ్చింది. లోకల్‌గా ఈ ఒక్కరికే వ్యాధి సంక్రమించింది. ఫారిన్ నుంచి వచ్చే వారి సంఖ్య అరెస్ట్ అయింది. కాబట్టి ఇక్కడ స్ప్రెడ్ కాకుండా అరెస్ట్ చేసే బాధ్యత మనమీద ఉంటది. అందరి కోసం అందరం పరితపించి పనిచేయాలి.. అందుకే లాక్‌డౌన్ చేస్తున్నం.." అని సీఎం అన్నారు. "ఆదివారం రాత్రి నుంచి పోర్ట్స్, ఎయిర్‌పోర్ట్స్ బంద్ అయి పోయినయి. దేశానికి బయటినుంచి వస్తున్న వ్యక్తులు ఆగిపోతున్నరు. షికాగో నుంచి ఒక్క ఫ్లైట్ శంషాబాద్‌కు వచ్చేది ఉంది. అది ఢిల్లీలో ల్యాండ్ అయింది. మనకు ఫారిన్ నుంచి వచ్చే బీమార్ అవస్త బంద్ అయినట్లే" అని తెలిపారు.

**31 దాకా ఇంటిని దాటొద్దు**

"మన కోసం మనం, జనం కోసం జనం, అందరి కోసం అందరం పరితపించి పనిచేయాల్సిన సిచ్చువేషన్ ఇది. ఆదివారం జనతాకర్ఫ్యూలో చూపిన క్రమశిక్షణ, పట్టుదల ఖచ్చితంగా మార్చి 31 వరకు చూపించాలి. ఇలా చేస్తే కరోనాపై అద్భుతంగా విజయం సాధించొచ్చు" అని సీఎం అన్నారు. మార్చి 31 వరకు తెలంగాణ లాక్‌డౌన్‌లో ఉంటుందని తెలిపారు. అప్పటివరకు ఎవరి ఇండ్లకు వాళ్లు పరిమితం కావాలని, సూచా తప్పకుండా పాటించాలన్నారు. సర్వజనుల హితం కోరి లాక్‌డౌన్ ప్రకటిస్తున్నామని చెప్పారు. 1897 ఎసెన్షియల్ ఎపిడమిక్ యాక్ట్ ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నామన్నారు. "ఈ నెల 31దాకా ఎవరు ఇంటిని దాటొద్దు. ఐదుగురికి మించి ఎవరూ గుమిగూడొద్దు. ఇది ఖచ్చితంగా ఫాలో కావాలి. సీరియస్‌గా ఉంటది. బయటకు వచ్చినా కూడా 3 ఫీట్ల డిస్టెన్స్ పైనే మెయింటేన్స్ చేసుకోవాలి. ఇంటి కోసం కావాల్సిన మందులు, పాలు, కూరగాయలు, నిత్యావసరాల సేకరణ కోసం కుటుంబానికి ఒకరిని మాత్రమే పర్మిట్ చేస్తం. ఇట్ల ఇంట్లో నుంచి ఒక్కరు మాత్రమే బయటకు వచ్చి ఆ వస్తువులు తెచ్చికోవాలి. వీలైతే రెండుమూడు రోజులకు సరిపోయేన్ని తెచ్చుకోవాలి. మనను కాపాడుకోవాలనే సోయిలో ఉండాలి" అని సీఎం పేర్కొన్నారు.

**నిత్యావసరాలు దొరుకుతయ్**

నిత్యావసరాలైన పాలు, కూరగాయలు, పండ్లు, ఇతర సరుకులు అమ్మే దుకాణాలు తెరిచే ఉంటాయని సీఎం తెలిపారు. ఎల్పీజీ సిలిండర్లు సరఫరా ఉంటుందని, పెట్రోల్ బంకులు తెరిచే ఉంటాయని చెప్పారు. "ఇంటికి ఒక్కరిని పోయి పాలు, కూరగాయలు తెచ్చుకోమన్నమని.. సందు దొరికింది కాబట్టి బయటికి పోవద్దు. నా అసుంటోడు మ్యాడ్‌గా పోతే ఇంకెవ్వళ్లో అంటిస్తే కరోనా వస్తది.. జాగ్రత్తగా ఉండాలే" అని సీఎం సూచించారు. అత్యవసర సర్వీసులు మినహా అన్ని బంద్ చేస్తామని, వైన్స్ కూడా బంద్ చేస్తామని తెలిపారు.

**అంగన్‌వాడీ సెంటర్లు క్లోజ్**

అంగన్ వాడీ సెంటర్లను మూసేస్తున్నామని సీఎం తెలిపారు. అక్కడ ఉండే మహిళలు, పిల్లలకు ఇబ్బందులు రాకుండా వాళ్లకే సరుకులు అందించేలా చూస్తున్నామని చెప్పారు. ప్రసవాలకు సిద్ధంగా ఉన్న గర్భిణుల లిస్టు రెడీ చేస్తున్నామని, వాళ్లకు ఎలాంటి ఇబ్బంది రానివ్వకుండా చూస్తామన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో, ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యవసరం లేని సర్జరీలను పోస్ట్‌పోన్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కరోనా వైరస్‌పై ప్రతి రోజూ ఆరోగ్య మంత్రి బులెటిన్ విడుదల చేస్తారని తెలిపారు.

**బస్సులు, రైళ్లు నడువవ్**

ఈ నెల 31 వరకు రాష్ట్రంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, రైళ్లు, ఆటోలు, ట్యాక్సీలు నడువవని, అనుమతించబోమని సీఎం స్పష్టం చేశారు. "ప్రజలు గుమిగూడొద్దన్నదే దీని ఉద్దేశం. మన ఇంట్ల మనమే ఉంటే బస్సులెందుకు, ఆటోలెందుకు..? పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ క్లోజ్ చేస్తం.. ఎవరినీ రానియ్యం.. చీమను, దోమను కూడా స్టేట్‌లోకి రానియ్యం. ఆటోలు, ట్యాక్సీలు రోడ్ల మీదికి రావొద్దు.. ఆల్ స్టేట్ బార్డర్స్ క్లోజ్ చేస్తున్నం. మందులు, రైస్, కూరగాయలు తెచ్చే లారీలను మాత్రమే అనుమతిస్తం. ఇంకా అంతా ఏడెనిమిదిరోజులే.. సంయమనం పాటించుకోవాలె" అని అన్నారు. ఆల్ ఇంటర్‌స్టేట్ బార్డర్స్‌క్లోజ్ చేస్తున్నామని చెప్పారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు వార్తల సేకరణ కోసం బయట తిరగవచ్చని, గుంపులు, గుంపులుగా కాకుండా పద్ధతి ప్రకారం పనిచేసుకోవాలని ఆయన సూచించారు. కరోనా వైరస్‌తో భయంకరంగా దెబ్బతింటున్న దేశం ఇటలీ అని, అక్కడివాళ్లే చెడగొట్టుకున్నారని సీఎం అన్నారు. అక్కడ రోజుకు ఐదారు వందల మంది చనిపోతున్నారని, ఆ దుర్గతి మనకు రావొద్దంటే వందకు వంద శాతం స్వయం నియంత్రణ పాటించాలని సూచించారు. "కుక్కలు మాట్లాడుకుంటున్నట్లు ఓ జోక్ తిరుగుతున్నది. రోడ్ల మీద మనుషులు కనపడ్తలేరు.. బల్దియా వాళ్లు పట్టుకపోయిండ్రా అని కుక్కలు అనుకుంటున్నయట" అని సీఎం తెలిపారు. విదేశాలకు వెళ్లి వచ్చినవాళ్లు వెంటనే తమ వివరాలు అధికారుల వద్ద రిపోర్టు చేయాలన్నారు. "ఇది దు:ఖ సమయం..ఇంత పెద్ద మానవ జాతి ఫైట్ చేస్తున్న సమయంలో ఆషామాషిగా తీసుకోవద్దు. ఒక వారం నియంత్రణ.. ఒక జీవిత కాలాన్ని కాపాడుతుంది. మన భవిష్యత్ తరాలను కాపాడుతుంది" అని తెలిపారు.

### ప్రభుత్వ ఉద్యోగులకు రొటేషన్ పద్ధతి

"ప్రభుత్వ ఉద్యోగులు అందరు కూడా ఆఫీసులకు రావాల్సిన అవసరం లేదు. 20 శాతం రొటేషన్ పద్ధతిలో రావాలి. దీనికి సంబంధించిన వివరాలు జీవో ద్వారా సీఎస్ విడుదల చేస్తరు. ఎమర్జెన్సీ సర్వీసులైన కరెంట్, వాటర్ సప్లయ్, సీవరేజీ, మున్సిపల్ సిబ్బందికి ఇది వర్తించదు. వీళ్లు 100 శాతం రావాల్సిందే" అని సీఎం తెలిపారు. ఎడ్యుకేషన్‌డిపార్ట్‌మెంట్ పనులు అన్నీ మూసేస్తున్నామని చెప్పారు. పేపర్ వాల్యుయేషన్ వంటివి ఏవీ ఉండవని, ఈ నెల 31 తర్వాత రివ్యూ చేసి నిర్ణయం తీసుకుంటామని, అప్పటి వరకు ఎవరి ఎక్కడోళ్లకక్కడ ఇండ్లల్లో ఉండొచ్చని సూచించారు. "1897 యాక్ట్.. బిల్డింగ్ కాంట్రాక్ట్, కాంట్రాక్ట్ వర్కర్లకు కూడా వర్తిస్తది. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఇతర ఉద్యోగులకు విధిగా ఎంప్లాయర్ వేతనం చెల్లించాల్సిందే.. ప్రభుత్వం కూడా చెల్లిస్తది. లాభాలు వస్తనే తీసుకుంటమని కాదు.. క్రైసిస్ సిచువేషన్ ఉన్నప్పుడు అందరు ఫాలో చెయ్యాలె.. లాక్‌డౌన్ కాలంలో ప్రైవేట్ ఉద్యోగులకు ఈ వారం రోజుల శాలరీ చెల్లించాలి. ఈ యాక్ట్ ప్రకారం ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉంది.." అని ఆయన చెప్పారు

### 1897 యాక్ట్ పవర్‌ఫుల్

1897 యాక్ట్ చాలా పవర్‌ఫుల్ అని, దాని ప్రకారం ప్రభుత్వానికి ఏ పవర్ అయినా ఉంటుందని సీఎం తెలిపారు. జిల్లా కలెక్టర్లు, సబ్ డివిజన్ మేజిస్ట్రేట్లకు జ్యుడిషియరీ అధికారాలు ఉంటాయని చెప్పారు. సీఎస్ ఆధ్వర్యంలో 33 జిల్లాల కలెక్టర్లు, డీజీపీ ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్లు ఎస్పీలు పని చేస్తారన్నారు. వారికి సీఎం కారును కూడా హ్యాండోవర్ చేసుకొని ఎమర్జెన్సీ సర్వీసులకు ఉపయోగించుకునే అధికారం ఉంటుందని ఆయన తెలిపారు.

### రేషన్ కార్డుంటే ఫ్రీ బియ్యం, రూ. 1500

"లాక్‌డౌన్‌తో పేదలకు కూలీ పనికి పోయే పరిస్థితి ఉండదు. అలాంటి వారు చాలా మంది ఉంటరు. నిరుపేదలు ఆకలికి గురి కావొద్దు.. వారం మొత్తం పనులు ఆగిపోతే దాని ప్రభావం ఇంకో 15 రోజులపై పడుతుంది.. అందుకే వాళ్లకు నెలకు సరిపడా బియ్యం ఇవ్వాలని నిర్ణయించినం. రాష్ట్రంలో 1.03 కోట్ల కుటుంబాలు ఉన్నాయి. 87.59 లక్షల మందికి వైట్ రేషన్ కార్డులున్నయి. ఈచ్ పర్సన్‌కు ఫ్రీగా 12 కేజీల రైస్ ఇస్తం.. వీలైనంత త్వరగా డీలర్ల ద్వారా వాటిని అందజేస్తాం. ఇందుకు రూ.1,103 కోట్లు ఖర్చు అవుతయి. పప్పు, ఉప్పు, చింతపండు, ఇతర సరుకులు కొనుక్కోవడానికి ప్రతి రేషన్ కార్డుకు రూ.1,500 నగదు రూపేణ ఇస్తం.. ఇందుకు రూ.1,314 కోట్లు ఖర్చు అవుతుంది" అని సీఎం తెలిపారు. మొత్తమ్మీద రూ. 2417 కోట్లు ప్రభుత్వం తక్షణం విడుదల చేస్తుందని చెప్పారు.

## దవాఖాన్లు తెరిచే ఉంటయ్

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో పూర్తిగా లాక్‌డౌన్ ప్రకటించినప్పటికీ, ప్రభుత్వ, ప్రైవేటు దవాఖాన్లు మాత్రం తెరిచే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. మెడికల్ షాపులు కూడా నడిపించుకునేందుకు అనుమతినిచ్చింది. సాధారణ సర్జరీలను మాత్రం నిలిపివేయాలని ఆదేశించింది. అన్ని దవాఖాన్లలో అత్యవసర సేవలు కొనసాగనున్నాయి. అంబులెన్స్ సర్వీసులు కూడా అందుబాటులో ఉంటాయి. అవసరమైన వాళ్లు 108 సేవలను వినియోగించుకోవాలని ఆరోగ్య శాఖ సూచించింది.



## క్లాప్స్‌కొట్టిన బీజేపీ నేతలు

జనతా కర్ఫ్యును సక్సెస్ చేయాలని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం ఉదయం నుంచి రాత్రి ఎవరింట్లో వాళ్లు గడిపారు. కొందరు ఇంట్లో పనులు చేస్తూ గడపగా, మరికొందరు కుటుంబాలతో సరదాగా గడిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నగరంలోని తన ఇంటి ఎదుట కుటుంబంతో కలిసి చప్పట్లు కొట్టి కరోనా పేషంట్లకు సర్వీస్ చేస్తున్న వారికి థ్యాంక్స్ చెప్పారు. కరోనా మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కరోనా పేషెంట్లకు సేవ చేస్తున్న వైద్య సిబ్బంది, ఎమర్జెన్సీ సర్వీసుల్లో ఉన్నవారికి థ్యాంక్స్ చెబుతూ బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ జి. వివేక్ వెంకటస్వామి తన నివాసంలో ఫ్యామిలీతో కలిసి క్లాప్స్ కొట్టారు.



## జిల్లాల వారీగా

# కరోనా పేషెంట్ల వివరాలు

- మొత్తం 27 మంది.. ఒకరు కోలుకుని డిశ్చార్జ్
- ఇద్దరు తప్ప అంతా విదేశాలకు వెళ్లొచ్చినవారే..

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో కరోనా వైరస్ పాజిటివ్‌గా గుర్తించిన పేషెంట్ల వివరాలను ప్రభుత్వం వెల్లడించింది. వారు ఏ ప్రాంతానికి చెందిన వారు, ఏ దేశం నుంచి వచ్చారన్నది తెలియజేసింది. ఆదివారం రాత్రి వరకు రాష్ట్రంలో మొత్తంగా 27 మందికి పాజిటివ్‌గా గుర్తించగా.. మొదటి పేషెంట్ ఒక్కరు కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మిగతా వారు గాంధీ, చెస్ట్ ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంట్ పొందుతున్నారు. మొత్తం 27 మందిలో పది మంది ఇండోనేషియా పౌరులే. మిగతా వారిలోనూ ఇద్దరు తప్ప అంతా విదేశాలకు వెళ్లి వచ్చినవారే.

**రాష్ట్రంలో కరోనా పేషెంట్ల వివరాలు**

| పేషెంట్ నంబర్ | వయసు/జెండర్ | ఏ దేశం నుంచి వచ్చారు | ఏ జిల్లా వ్యక్తి |
|---|---|---|---|
| పేషెంట్ 1 | 25/మేల్ | దుబాయి | హైదరాబాద్ |
| పేషెంట్ 2 | 24/ఫీమేల్ | ఇటలీ | భద్రాద్రి కొత్తగూడెం |
| పేషెంట్ 3 | 48/మేల్ | నెదర్లాండ్స్ | రంగారెడ్డి (కొత్తపేట) |
| పేషెంట్ 4 | 46/మేల్ | స్కాట్లాండ్ | రంగారెడ్డి (కొత్తపేట) |
| పేషెంట్ 5 | 52/మేల్ | ఇండోనేషియా | ఇండోనేషియా సిటిజెన్ |
| పేషెంట్ 6 | 21/మేల్ | యూకే | హైదరాబాద్ (నాచారం) |
| పేషెంట్ 7 -13 | మేల్ | ఇండోనేషియా | ఇండోనేషియా సిటిజెన్స్ |
| పేషెంట్ 14 | 60/మేల్ | దుబాయి | సికింద్రాబాద్ |
| పేషెంట్ 15 | 24/మేల్ | లండన్ (వయా దుబాయి) | మిర్యాలగూడ |
| పేషెంట్ 16 | 24/మేల్ | స్కాట్లాండ్ | హన్మకొండ |
| పేషెంట్ 17 | 18/ఫీమేల్ | లండన్ (వయా దుబాయి) | హైదరాబాద్ (కొండాపూర్) |
| పేషెంట్ 18, 19 | 27/60/మేల్ | ఇండోనేషియా | ఇండోనేషియా సిటిజెన్స్ |
| పేషెంట్ 20 | 35/మేల్ | 14వ పేషెంట్ కొడుకు | సికింద్రాబాద్ |
| పేషెంట్ 21 | 33/మేల్ | దుబాయి | హైదరాబాద్ (మున్నగూడ) |
| పేషెంట్ 22 | 24/మేల్ | లండన్ (వయా దుబాయి) | గుంటూరు |
| పేషెంట్ 23 | 23/మేల్ | లండన్ (వయా దోహా) | హైదరాబాద్ (కూకట్ పల్లి) |
| పేషెంట్ 24 | 26/మేల్ | స్వీడన్ | ఈస్ట్ గోదావరి (రాజోల్) |
| పేషెంట్ 25 | 34/మేల్ | స్వీడన్ | రంగారెడ్డి (మణికొండ) |
| పేషెంట్ 26 | 23/మేల్ | లండన్ | కొత్తగూడెం |
| పేషెంట్ 27 | 50/ఫీమేల్ | 14వ పేషెంట్ భార్య | సికింద్రాబాద్ |

# మరో ఆరుగురికి కరోనా

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో కరోనా వైరస్ కేసుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఆదివారం ఒక్క రోజే ఆరు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందులో ఒక లోకల్ కాంటాక్ట్ కేసు కూడా ఉంది. దుబాయి వెళ్లొచ్చిన 60 ఏండ్ల వ్యక్తి (పేషెంట్ 14) నుంచి ఆయన కొడుక్కి (పేషెంట్ 20) వైరస్ సోకినట్టు శనివారమే నిర్ధారణకాగా.. ఆదివారం ఆ వ్యక్తి భార్య (50 ఏండ్లు-పేషెంట్ 27)కు కూడా వైరస్ సోకినట్టు తేలింది. భర్తతోపాటు ఆమె కూడా దుబాయి వెళ్లొచ్చినా ఇక్కడికొచ్చాకే భర్త నుంచే ఆమెకు వైరస్ సోకిందని అధికారులు తెలిపారు. ఆదివారం మరో ఐదుగురికి కూడా వైరస్ పాజిటివ్ వచ్చింది. వారంతా వివిధ దేశాలకు వెళ్లొచ్చినవారేనని ఆరోగ్య శాఖ ప్రకటించింది. మొత్తంగా రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 27కు చేరింది. తొలి పేషెంట్ ఒక్కరు కోలుకుని ఇంటికి వెళ్లిపోగా.. మిగతా 26 మంది గాంధీ, చెస్ట్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారు.

- భర్త నుంచి భార్యకు వైరస్ వ్యాప్తి
- విదేశాల నుంచి వచ్చిన మరో ఐదుగురికి పాజిటివ్
- రాష్ట్రంలో 27కు పెరిగిన బాధితుల సంఖ్య
- పెరుగుతున్న ప్రైమరీ కాంటాక్ట్స్
- వైరస్ ముప్పు పెరుగుతుందనే ఆందోళన

**ప్రైమరీ కాంటాక్ట్స్ కు వైరస్ ముప్పు**

రాష్ట్రంలో ఒకరి నుంచి మరొకరికి వైరస్ వ్యాపించే దశ మొదలైంది. వైరస్ సోకిన వ్యక్తితో నేరుగా దగ్గరగా ఉండి మాట్లాడటం, కలిసుండటం చేసిన వారిని ప్రైమరీ కాంటాక్ట్స్‌గా వ్యవహరిస్తారు. అలాంటి వారికి వైరస్ సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రంలో పాజిటివ్ కేసులు పెరుగుతున్నకొద్దీ ప్రైమరీ కాంటాక్ట్స్ కూడా పెరుగుతున్నాయి. విదేశాల నుంచి వచ్చినవారిలో రెండు రోజుల నుంచి వారం రోజుల తర్వాతే వైరస్ లక్షణాలు బయట పడుతున్నాయి. ఆలోగానే వారు కుటుంబ సభ్యులను, బయటి వ్యక్తులను కలుస్తున్నారు. కొందరు ఫంక్షన్లకు, ఊళ్లకు, షాపింగ్‌లకు తిరుగుతున్నారు. ఇండోనేషియా బృందంలో ఇలాగే ఒకరి నుంచి ఒకరికి వైరస్ విస్తరించింది. దుబాయి వెళ్లొచ్చిన వ్యక్తి నాలుగు రోజుల కుటుంబ సభ్యులతోనే ఉన్నారు. ఆ సమయంలో వైరస్ ఆయన నుంచి భార్యకు, కొడుక్కి వ్యాపించింది.



### ఆ ఆరుగురు ఎవరు?

ఇక ఈ రోజు వైరస్ పాజిటివ్ వచ్చినవారిలో ఒకరు (పేషెంట్ 22) ఏపీలోని గుంటూరుకు చెందిన 24 ఏండ్ల యువకుడు. లండన్ నుంచి దుబాయి మీదుగా హైదరాబాద్‌కు వచ్చారు. మరో 23 ఏండ్ల యువకుడు (పేషెంట్ 23) కూడా లండన్ నుంచి దోహా మీదుగా హైదరాబాద్‌కు వచ్చారు. మరో ఇద్దరు ఈ నెల 14న, 16న స్వీడన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. ఒకరు ఏపీలోని రాజోల్‌కు చెందిన 26 ఏండ్ల యువకుడు (పేషెంట్ 24), మరొకరు హైదరాబాద్‌లోని మణికొండ ఏరియాకు చెందిన 34 ఏళ్ల వ్యక్తి (పేషెంట్ 25). మరో పేషెంట్ (నంబర్ 26) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 23 ఏండ్ల యువకుడు. 18న లండన్ నుంచి వచ్చారు. మరొకరు దుబాయి వెళ్లొచ్చిన వ్యక్తి (పేషెంట్ 14) భార్య. ఇప్పటివరకు పాజిటివ్ వచ్చిన 21 మందితో సుమారు 500 మంది కాంటాక్ట్ అయినట్టు గుర్తించిన అధికారులు.. ఆదివారం పాజిటివ్ గా తేలిన ఆరుగురితో ఎందరు కాంటాక్ట్ అయ్యారన్నదానిపై ఆరా తీస్తున్నారు. వారంతా 14 రోజులపాటు క్వారంటైన్‌లో ఉండాలని సూచించారు.

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఆదివారం నిర్మానుష్యంగా హిండన్ ఎలివేటెడ్ రోడ్డు



# దేశమంతా ఇంట్లనే

## జనతా కర్ఫ్యూ సక్సెస్.. ప్రధాని మోడీ పిలుపునకు అనూహ్య స్పందన

**న్యూఢిల్లీ:**

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ మరింత విస్తరించకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన జనతా కర్ఫ్యూ సూపర్ సక్సెస్ అయ్యింది. ఆదివారం దేశం మొత్తం స్తంభించిపోయింది. కోట్లాది మంది జనం ఇండ్లకే పరిమితమయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ మొదలుకుని మారుమూల గల్లీ వరకూ ప్రజలు స్వచ్ఛందంగా కర్ఫ్యూలో పాల్గొన్నారు. దీంతో ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా మారిపోయాయి. రోడ్లపై ఒకటి అరా మాత్రమే వెహికల్స్ కనిపించగా.. పోలీసులు తప్ప జనం చాలా తక్కువగా కనిపించారు. బడా షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్, రిటైల్ మార్కెట్లతో పాటు వీధి చివర ఉండే చిన్న కిరాణా షాపులు, పాన్ డబ్బాలు కూడా మూతపడ్డాయి. జనం కూడా బయటకు రావడానికి పెద్దగా ఇష్టపడలేదు. పూర్తిగా ఇంట్లోనే ఫ్యామిలీతో గడపడానికే ఎక్కువ శాతం మంది మొగ్గు చూపారు. నిత్యావసర వస్తువులు, మెడికల్ సర్వీసులు, మెడికల్ షాపులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

**ఢిల్లీ:** జనతా కర్ఫ్యూ కారణంగా దేశ రాజధాని ఢిల్లీ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. ప్రజలు స్వీయ నిర్బంధంలోని వెళ్లిపోయారు. ఢిల్లీలో మెట్రో రైలు సర్వీసులను బంద్ చేశారు. ఎమర్జెన్సీకి ఉపయోగపడేలా కొన్ని బస్సులను మాత్రమే నడిపారు. టూరిస్టు స్పాట్‌లు కూడా మూతపడ్డాయి.

**కాశ్మీర్:** కాశ్మీర్‌లో జనతా కర్ఫ్యూ ప్రభావం ఎక్కువగా ఉంది. గత నాలుగు రోజుల నుంచి లోయలోని కొన్ని ప్రాంతాల్లో లాక్‌డౌన్ కొనసాగుతున్నప్పటికీ ఆదివారం అన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ పాటించారు.

**పశ్చిమబెంగాల్:** జనతా కర్ఫ్యూతో వెస్ట్‌బెంగాల్‌లోని అన్ని సిటీలు, ఊళ్లు లాక్‌డౌన్ అయ్యాయి. బస్సులు, ట్రైన్లు క్యాన్సిల్ అయ్యాయి. ఎప్పుడూ రద్దీగా కనిపించే డల్‌హౌసీ, ఎస్‌ప్లాండే, కోల్‌కతాలోని హౌరా బ్రిడ్జి ఖాళీగా కనిపించాయి.

**మధ్యప్రదేశ్** :మధ్యప్రదేశ్‌లోని అన్ని పార్కులు, స్టేడియాలు, పబ్లిక్ గ్రౌండ్స్ ఖాళీగా కనిపించాయి. వాకింగ్, జాగింగ్ చేసే వాళ్లు, క్రికెట్ ఆడుకునే పిల్లలతో ఆదివారం నిండుగా కనిపించే స్టేడియాల్లో చీమ కూడాకనిపించలేదు. భోపాల్ తదితర సిటీల్లో కూడా రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి.

**మహారాష్ట్ర:** ముంబైలో రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. ఎప్పుడూ రద్దీగా కనిపించే సబ్ అర్బన్ ట్రైన్ స్టేషన్స్‌లో జనం ఎవరూ లేరు. ముంబైలో పరిస్థితి దారుణంగా ఉండటంలో రైల్వే అధికారులు రైళ్లను క్యాన్సిల్ చేశారు. 477 సబ్‌అర్బన్ రైళ్లు క్యాన్సిల్ అయ్యాయి. మాల్స్, రెస్టారెంట్లు, సినిమా హాళ్లు మూతపడ్డాయి.

**గుజరాత్:** రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన అహ్మదాబాద్, సూరత్, వడోదర, రాజ్‌కోట్ తదితర ప్రాంతాలన్నీ నిర్మాన్యుష్యంగా మారిపోయాయి. జనతా కర్ఫ్యూని పాటించేందుకు ప్రజలంతా స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయారు.

**గోవా:** గోవాలోని బీచ్‌లు, రెస్టారెంట్లు, బార్లను మూసేశారు. దీంతో నిత్యం టూరిస్టులతో కళకళాడే గోవా బీచ్‌లు, రెస్టారెంట్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాను కూడా మూసేశారు.

**తమిళనాడు:** రా ప్రజలంతా స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయారు. దీంతో నిత్యం రద్దీగా కనిపించే లోకల్ ట్రైన్స్ ఖాళీగా దర్శనమిచ్చాయి. "అమ్మ క్యాంటిన్లు" మాత్రం ఓపెన్‌లోనే ఉన్నాయి.

**ఒడిశా:** ప్రజలు స్వచ్ఛందంగా జనతా కర్ఫ్యూలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని 5 జిల్లాలు, 8 పట్టణాల్లో లాక్‌డౌన్ కొనసాగుతుందని అధికారులు చెప్పారు.

**కర్నాటక:** అత్యంత రద్దీ ప్రాంతమైన బెంగళూరు ఆదివారం ఖాళీగా కనిపించింది. షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు అన్నీ మూతపడ్డాయి. మెట్రో, బస్సు సేవలనూ నిలిపేశారు. బోర్డర్లన్నీ క్లోజ్ చేశారు. రాష్ట్ర సరిహద్దుల్లో సెక్యూరిటీని ఏర్పాటు చేశారు.

**కేరళ:** జనతా కర్ఫ్యూకి కేరళ సర్కార్ సపోర్ట్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పరిధిలోని అన్ని బస్సు, రైలు సర్వీసులు బంద్ అయ్యాయి. ఆర్టీసీ డిపోలు, తదితర ప్రాంతాలను క్లీన్ చేశారు. రోడ్లపై తిరుగుతున్న వారికి పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

**ఉత్తరాఖండ్:** మార్కెట్లు మూతపడ్డాయి. జనతా కర్ఫ్యూలో స్వచ్ఛంధంగా పాల్గొన్న జనాలు మార్నింగ్ వాక్ కోసం కూడా బయటకు రాలేదు.

హైదరాబాద్‌లో ఖాళీగా అసెంబ్లీ, రవీంద్రభారతి జంక్షన్



**పంజాబ్, హర్యానా, చండీగఢ్:** పంజాబ్, హర్యానా రాష్ట్రాలు పూర్తిగా షట్‌డౌన్ అయ్యాయి. జనతా కర్ఫ్యూలో పాల్గొన్న జనం ఇళ్లకే పరిమితమయ్యారు. తెల్లవారుజాము నుంచే రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి.

**పుద్దుచ్చేరి:** పుద్దుచ్చేరిలో 'జనతా కర్ఫ్యూ' ప్రభావం బాగా కనిపించింది. అన్ని టూరిస్టు ప్రాంతాలు, ప్రముఖ ఆలయాలు, బీచ్‌లు క్లోజ్ అయ్యాయి.

**అస్సాం:** ప్రజలు ఆదివారం ఉదయం నుంచే స్వచ్ఛందంగా 'జనతా కర్ఫ్యూ'లో పాల్గొన్నారు. . కొన్ని ప్రాంతాల్లోని ప్రజలు శనివారం రాత్రి నుంచే కర్ఫ్యూ పాటిస్తున్నారు.

**మేఘాలయ:** పూర్తిగా లాక్‌డౌన్ అయింది. చర్చిలు, ఆలయాలు క్లోజ్ అయ్యాయి. మార్కెట్లు కూడా మూతపడ్డాయి. జనం ఎవరూ బయటకు రాకపోవడంతో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

**నాగాలాండ్:** జనతా కర్ఫ్యూను వల్ల రాష్ట్ర ప్రజలు స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోయారు. ఆదివారం ప్రార్థనలకు చాలా తక్కువ మంది వచ్చారు.

### రాష్ట్రంలో గడప దాటలేదు!

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో జనతా కర్ఫ్యూను ప్రజలు స్వచ్ఛందంగా పాటించారు. అత్యవసరమైతే తప్ప ఎవ్వరూ గడపదాటి బయటికి రాలేదు. హైదరాబాద్‌లో పాల ప్యాకెట్ల కోసం జనం తిప్పలు పడ్డారు. నిత్యావసరాలైన పాలు, పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించినా.. చాలా వరకు పాల బూత్‌లు మూసే ఉన్నాయి. ఇండ్లకు, ఫ్లాట్లకు రోజువారీగా పాలు సరఫరా చేసే వాళ్లు ఉదయాన్నే ప్యాకెట్లు వేశారు. కూరగాయల బండ్లు కూడా ఎక్కడా కనిపించలేదు. పెట్రోల్ బంకులు తెరిచే ఉంచాలని సీఎం సూచించినా చాలా వరకు బంక్‌లు మూతపడ్డాయి. వాటర్ క్యాన్ల సప్లయ్ కూడా బంద్ చేశారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్‌లకు ప్రయాణికులెవరూ రాలేదు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎప్పుడో తప్ప ఎక్కడా వాహనాలు కనిపించలేదు. ఏ పనిలేకుండా రోడ్లపైకి వచ్చిన వారిని పోలీసులు జనతా కర్ఫ్యూకు మద్దతుగా ప్రింట్ చేసిన ప్లకార్డులతో కాసేపు నిల్చోబెట్టి తిరిగి పంపారు. అన్ని జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాల్లోనూ జనం స్వచ్ఛందంగా జనతా కర్ఫ్యూ పాటించారు. సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుటుంబ సభ్యులతో ఉండిపోయారు. కరోనా హైలెవల్ కమిటీతో ఆ తర్వాత సమావేశమయ్యారు. హెల్త్ మినిస్టర్ ఈటల రాజేందర్ మినహా మిగతా మంత్రులంతా ఇండ్లకే పరిమితమయ్యారు. రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు ఇళ్లలో కుటుంబ సభ్యులతోనే ఉండిపోయారు. సాయంత్రం 5 గంటలకు అందరూ చప్పట్లు కొట్టి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందికి సంఘీభావం తెలిపారు.

### 14 గంటల కర్ఫ్యూ

కరోనా విస్తరించకుండా సోషల్ డిస్టెన్స్ లో భాగంగా కొద్ది రోజుల క్రితం ప్రధాని మోడీ 14 గంటల జనతా కర్ఫ్యూను ప్రకటించారు. రాష్ట్రం సహా కొన్ని రాష్ట్రాల్లో 24 గంటల కర్ఫ్యూను అమలు చేశారు. ఆదివారం ఉదయం 7 గంటలకు కర్ఫ్యూ మొదలు కాగా.. ఉదయం నుంచే అన్ని మార్కెట్లు, పెద్ద పెద్ద కంపెనీలు, మాల్స్ పూర్తిగా మూసేశారు. టూరిస్టు స్పాట్స్, ప్రముఖ ఆలయాలు, పార్కులు, సినిమా హాల్స్ కూడా బందయ్యాయి. కర్ఫ్యూ ప్రారంభం కావడానికి కొద్ది నిమిషాల ముందు మోడీ ట్విట్టర్‌లో ఓ పోస్ట్ పెట్టారు. "మరికొద్ది నిమిషాల్లో జనతా కర్ఫ్యూ మొదలవుతుంది. అంతా భాగస్వాములు అవుదాం. ఇది కరోనా మహమ్మారిపై పోరాటానికి గొప్ప స్ఫూర్తినిస్తుంది"అని పేర్కొన్నారు. ఇప్పుడు తీసుకుంటున్న చర్యలు సరైన టైం మనకు సహాయపడతాయని చెప్పారు.

ముంబైలోని ఛత్రపతి శివాజీ టర్మినస్‌లో నిలిచిపోయిన సబర్బన్ రైళ్లు



### బండి కదలలేదు

శనివారం రాత్రి నుంచి దేశంలోని ఏ రైల్వే స్టేషన్ నుంచి కూడా ఒక్క రైలు కదలలేదు. శనివారం రాత్రి నుంచి అదివారం రాత్రి 10 గంటల వరకూ అన్ని మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. అయితే లోకల్ ట్రైన్లను మాత్రం చాలా తక్కువ సంఖ్యలో నడిచాయి. ఢిల్లీ, హైదరాబాద్, ముంబైలో మెట్రో సర్వీసులను ఆదివారం పూర్తిగా రద్దు చేశారు. ఇక అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులను కూడా పూర్తిగా ఆపేశారు. ఇప్పటికే విదేశీ సర్వీసులను ఆపేసిన ఎయిర్ లైన్స్ కంపెనీలు.. ఆదివారం డొమెస్టిక్ సర్వీసులను సైతం నిలిపేశాయి. గోఎయిర్, ఇండియో, విస్తారా ఆదివారం డొమెస్టిక్ సర్వీసులను ఆపేశాయి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ జనతా కర్ఫ్యూకు మద్దతు తెలిపింది. దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలను నిలిపేసినట్టు చెప్పారు.

≡ క్విక్ బైట్స్



### తెలంగాణలో 'జనతా కర్ఫ్యూ' భేష్

**కేసీఆర్ కు అమిత్ షా ఫోన్**

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో జనతా కర్ఫ్యూ అద్భుతంగా అమలయిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆదివారం సీఎం కేసీఆర్ తో ఫోన్ లో మాట్లాడిన ఆయన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల స్ఫూర్తిని, ప్రభుత్వ యంత్రాంగం కార్యాచరణను కొనియాడారు. ఈ విషయంలో తెలంగాణ దేశంలోనే ముందువరుసలో నిలిచిందని అమిత్ షా అన్నారు.



### నిర్లక్ష్యం వద్దు.. అలర్ట్‌గా ఉండండి

- కొందరికి పరిస్థితి తీవ్రత అర్థం కావటం లేదు: గవర్నర్ తమిళిసై

**హైదరాబాద్, వెలుగు:** కరోనా వైరస్ పట్ల నిర్లక్ష్యం వద్దని, అందరూ అలర్ట్‌గా ఉండాలని గవర్నర్ తమిళిసై పిలుపునిచ్చారు. ఇన్ఫెక్షన్ ప్రతి ఒక్కరికి వచ్చే అవకాశం ఉందని.. అయినా కొందరికి ప్రమాద తీవ్రత అర్థం కావటం లేదని పేర్కొన్నారు. ప్రధాని మోడీ పిలుపు ఇచ్చిన మేరకు ఆదివారం సాయంత్రం రాజ్ భవన్‌లో కుటుంబసభ్యులు, అధికారులతో కలిసి గవర్నర్ చప్పట్లు కొట్టారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. విదేశాల నుంచి వచ్చిన వాళ్లు నిజాలు దాచడం వల్ల ఇన్ఫెక్షన్ ఎక్కువగా ఉండే అవకాశముందని, వాళ్లు ఇండ్లలోకి బయటికి రాకుండా క్వారంటైన్ కావాలని సూచించారు. స్వీయ రక్షణే ఉత్తమమని, ప్రతి ఒక్కరూ సోషల్ డిస్టెన్సింగ్ పాటించాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కరోనా నివారణ, జనంలో అవగాహన కోసం జనతా కర్ఫ్యూ కు పిలుపు ఇచ్చిన ప్రధానికి ధన్యవాదా లు తెలుపుతున్నానని చెప్పారు. కరోనా వైరస్ నివారణ, ట్రీట్‌మెంట్ కోసం కృషి చేస్తున్న డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ స్టాఫ్, పోలీసులు, మీడియాకు గవర్నర్ ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లో కొందరు హాలిడేలుగా భావిస్తూ గుమిగూడుతున్నారని, అది సరికాదని సూచించారు.



కరోనా కట్టడి కోసం అత్యవసర సేవల్లో పాల్గొంటున్న వారికి మద్దతుగా బెల్ కొడుతున్న బీజేపీ ప్రెసిడెంట్ జేపీ నడ్డా



కరోనాపై పోరాడుతున్న డాక్టర్లు, అత్యవసర సిబ్బందికి సంఘీభావంగా ఆదివారం మంత్రులు, కుటుంబ సభ్యులు, ప్రగతి భవన్ సిబ్బందితో కలిసి చప్పట్లు కొడుతున్న సీఎం కేసీఆర్

### చప్పట్లతో మార్మోగిన దేశం

కరోనాపై పోరాడుతున్న ఎమర్జెన్సీ, మెడికల్ సర్వీసుల సిబ్బందికి సంఘీభావంగా ఆదివారం సాయంత్రం5 గంటలకు ప్రజలంతా ఇండ్లనుంచి బయటికి వచ్చి చప్పట్లు కొట్టాలంటూ ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపునకు దేశం మొత్తం స్పందించింది. సరిగ్గా సాయంత్రం5 గంటలకు కోట్లాది మంది దేశ ప్రజలు ఇండ్ల నుంచి బయటికి వచ్చి చప్పట్లు కొట్టారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ డాబాపైకిఎక్కి కొందరు.. గేటు బయటకొందరు.. బాల్కనీలు, కారిడార్లలో మరికొందరు ప్లేట్లు, డ్రమ్స్, గిన్నెలు, గంటలు కొడుతూ.. శంఖాలు ఊదారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్‌తోపాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, బీజేపీ నేషనల్ చీఫ్ జేపీనడ్డా, బాబారాందేవ్ సహా పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సామాన్య ప్రజలే కాకుండా బాలీవుడ్ స్టార్లు, క్రికెటర్లు, ఇతర సెలబ్రిటీలు చప్పట్లు కొట్టి దేశభక్తిచాటుకున్నారు. రాష్ట్రపతి భవన్ దగ్గర రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులతో కలిసి చప్పట్లు కొట్టారు. ఉప రాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, అమిత్ షా, ప్రకాశ్ జవదేకర్, పీయూష్ గోయల్, కిషన్ రెడ్డి, ఇతర మంత్రులు ఢిల్లీలో తమ నివాసాల్లో సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉన్నారు. సాయంత్రం 5 గంటలకు అంతా కుటుంబీకులతో కలిసి చప్పట్లు కొట్టి సంఘీభావం తెలిపారు.



ఆదివారం ఇంట్లో యోగా చేస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

కరోనా ఎఫెక్ట్‌తో అమెరికాలో ప్రజలు ఇండ్ల నుంచి కదలొద్దని ఆర్డర్లు ఇచ్చారు. చాలా ఫుడ్ బ్యాంక్‌లలో వలంటీర్ల కొరత ఏర్పడింది. దీంతో కాలిఫోర్నియా నేషనల్ గార్డ్స్ రంగంలోకి ఇలా ఫుడ్ ప్యాకింగ్ చేస్తున్నారు




# అమెరికా మరో ఇటలీ

**న్యూయార్క్:** కరోనా కేసులతో అమెరికా అల్లడం తల్లడమవుతోంది. రోజురోజుకు కేసులు వేలల్లో పెరుగుతున్నాయి. మార్చి 16 దాకా కేసుల వ్యాప్తి నిదానంగా ఉన్నా, ఈ నాలుగైదు రోజుల్లోనే కేసులు విపరీతంగా పెరిగిపోయాయి. ఎంతలా అంటే కేసుల్లో జస్ట్ ఒక్క రోజులోనే నాలుగో ప్లేస్‌కు వచ్చేసింది అగ్రరాజ్యం. ఇప్పటిదాకా 32,801 మంది కరోనా బారిన పడ్డారు. ఒక్క న్యూయార్క్‌లోనే 21,381 మంది ఎఫెక్ట్ అయ్యారు. దానికి తగ్గట్టు మరణాలూ పెరిగిపోతున్నాయి. ఇప్పటిదాకా 396 మంది చనిపోగా, ఒక్క

- 36 వేల మందికి వైరస్.. ఎక్కువ న్యూయార్క్‌లోనే
- 30 లక్షల మంది ఉద్యోగాలు గల్లంతు.. దేశ చరిత్రలో ఇదే తొలిసారి
- తన బిజినెస్‌లకూ నష్టం జరిగిందన్న ట్రంప్

రోజే 94 మంది బలయ్యారు. ఆ ఎఫెక్ట్ జాబ్‌లపైనా పడింది. ఎంతలా అంటే దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా యువత ఉద్యోగాలు కోల్పోతున్నారు.

**లాక్‌డౌన్ దిశగా**

కరోనా పరిస్థితుల నేపథ్యంలో దేశం లాక్‌డౌన్ దిశగా సాగుతోంది. పెరిగిపోతున్న కేసులతో న్యూయార్క్ స్టేట్ మొత్తాన్ని మూసేశారు. బయటకు రావొద్దని జనాలకు సూచిస్తున్నా ఎవరూ మాట వినకపోతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అత్యవసరాలు తప్ప మిగతా అన్నింటినీ క్లోజ్ చేశారు. జనాలు ఎవరూ బయటకు రావొద్దని, అనవసరం తిరగొద్దని సూచించారు. టైమ్స్‌స్క్వేర్‌తో పాటు అన్ని ప్రముఖ ప్రాంతాలను మూసేశారు. అత్యవసర సేవలు తప్ప ఎవరూ డ్యూటీలకు వెళ్లొద్దని కాలిఫోర్నియా, కనెక్టికట్, ఇల్లినాయీ, న్యూజెర్సీ వంటి రాష్ట్రాలూ లాక్‌డౌన్‌ను ప్రకటించాయి. దేశంలో ఇప్పటికే చాలా షాపులు, రెస్టారెంట్లు, బార్లు బంద్ వడంతో అమెరికన్ల ఉపాధిపై పెద్ద దెబ్బే పడింది. లాక్‌డౌన్ ఎఫెక్ట్‌తో దాదాపు ఈ ఐదు రాష్ట్రాల్లోనే 75 లక్షల మందికిపైగా ఇండ్లకే పరిమితమయ్యారు. వచ్చే వారం నాటికి దాదాపు 30 లక్షల మంది దాకా ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అమెరికా చరిత్రలోనే ఇంత మంది నిరుద్యోగులుగా మిగిలిపోవడం ఇదే తొలిసారని నిపుణులు చెబుతున్నారు. అంతకుముందు 1982 ఆర్థిక మాంద్యం టైంలో 7 లక్షల మంది ఉపాధికి గండి పడింది. ఇప్పుడు దానికి నాలుగింతలు ఎక్కువ మంది ఉపాధి కోల్పోయే ప్రమాదంలో పడ్డారు. గత వారంలో ప్రభుత్వ లబ్ధి, సాయం కోసం 2.81 లక్షల క్లెయిములు వచ్చినట్టు లేబర్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

**దునియాకు తాళం**

కరోనా ఎఫెక్ట్‌తో ప్రపంచానికి తాళం పడింది. చాలా దేశాలు ఇప్పటికే లాక్‌డౌన్‌ను ప్రకటించాయి. ఆ జాబితాలో మరిన్ని దేశాలు చేరుతున్నాయి. ఇప్పుడిప్పుడే కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో కొన్ని ఆఫ్రికా దేశాలు లాక్‌డౌన్‌ను ప్రకటించాయి. నైజీరియా, రువాండాలు ఎయిర్‌పోర్టులు మూసేశాయి. దేశంలో అన్నింటినీ బంద్‌పెడుతూ నిర్ణయం తీసుకున్నాయి. రెండు వారాల పాటు బయట తిరగడాన్ని నిషేధించాయి. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఇళ్ల నుంచే పనిచేయాలని సూచించాయి. ట్యునీషియా కూడా లాక్‌డౌన్ ప్రకటించింది. ప్రస్తుతం ఆఫ్రికాలోని 54 దేశాల్లో 41 దేశాలకు కరోనా సోకింది. ఉగాండా బోర్డర్లను మూసేసింది. విదేశాల నుంచి వచ్చేటోళ్లు ఇళ్లలోనే హోం క్వారంటైన్ కావాల్సిందిగా ఇథియోపియా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సౌతాఫ్రికాలోని జొహెన్నస్‌బర్గ్ ఎయిర్‌పోర్టుకు ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండడం, పెద్ద పెద్ద ఎయిర్‌లైన్స్ సంస్థలు విమానాలను రద్దు చేస్తుండడంతో నైజీరియా ఇంటర్నేషనల్ ఫ్లైట్లను రద్దు చేసింది. అంగోలా ఎయిర్, ల్యాండ్, సీ బార్డర్లను మూసేసింది. ఇప్పటికే జింబాబ్వే ఎమర్జెన్సీ ప్రకటించింది. ఆఫ్రికాలో ఎక్కువ మరణాలు బుర్కినాఫాసోలో నమోదయ్యాయి. మంత్రులకూ పాజిటివ్ వచ్చింది. దీంతో ఆ దేశమూ లాక్‌డౌన్ ప్రకటించింది. రెండు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులను మూసేసింది. ఇరాన్ డెత్ టోల్ పెరిగిపోతుండడంతో జోర్డాన్ లాక్‌డౌన్ విధించింది. దేశంలోని అన్ని షాపులూ బంద్ చేయాల్సిందిగా ఆదేశాలిచ్చింది. మంగళవారం వరకు జనమెవరూ బయటకు రావొద్దని సూచించింది. మ్యూజియంలు, ఆర్కియాలాజికల్ సైట్లను మూసేస్తూ ఈజిప్ట్ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ప్రార్థనలూ రద్దు చేసింది. మారిషస్ ఇప్పటికే లాక్‌డౌన్‌ను ప్రకటించింది. లిబియా ప్రభుత్వం దేశం మొత్తం కర్ఫ్యూ విధించింది. పబ్లిక్ ప్లేసెస్‌ను మూసేసింది. ఇప్పటికే అక్కడ నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఆ దేశానికి ప్రపంచ దేశాలు సాయం చేయాల్సిందిగా యూఎన్ కోరింది.

### నా బిజినెస్‌లకూ నష్టం: ట్రంప్

కరోనాతో జనాలకే కాకుండా తన బిజినెస్‌లకూ ఎఫెక్ట్ పడిందని ప్రెసిడెంట్ ట్రంప్ వాపోయారు. తన హోటల్ వ్యాపారమూ నష్టాల్లోనే సాగుతోందని ఆయన అన్నారు. తన వ్యాపారాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందుతున్న విషయం తనకు తెలియదన్నారు. మారాలాగోలోని ట్రంప్ హోటళ్లు మూతపడడం, వాషింగ్టన్‌లోని తన లగ్జరీ హోటల్‌లో బార్లు క్లోజ్ కావడంపై ఆయన స్పందించారు. లాక్‌డౌన్ ఎఫెక్ట్ తన వ్యాపారంపై భారీగా పడిందని,



అది తనను బాగా వేధిస్తోందని అన్నారు. తనతో పాటు దేశంలోని అన్ని గొప్ప హోటల్ చెయిన్లూ ఈ బాధ పడుతున్నాయన్నారు. కొన్ని బిజినెస్‌లు మాత్రమే బాగా నడుస్తున్నాయన్నారు. కానీ, కరోనా వైరస్ ఎఫెక్ట్ నేపథ్యంలో దేశానికి ఇలాంటి లాక్‌డౌన్ మంచిదేనన్నారు.

### ఆస్ట్రేలియా బంద్

నానాటికీ కేసులు పెరిగిపోతుండడంతో ఆస్ట్రేలియా లాక్‌డౌన్‌ను ప్రకటించింది. ప్రార్థనా మందిరాలు సహా అన్నింటినీ బంద్ పెట్టాలని ఆదేశాలిచ్చింది. పబ్బులు, క్లబ్బులు, జిమ్ములు, సినిమా హాళ్లు, మాల్స్ అన్నింటినీ మూసేయాలని సూచించింది. ఆదివారం కేబినెట్ మీటింగ్ తర్వాత ఆ దేశ ప్రధాని స్కాట్ మోరిసన్ ఈ నిర్ణయం ప్రకటించారు. సూపర్‌మార్కెట్లు, పెట్రోల్ బంక్‌లు, మెడికల్ షాపులు, హోం డెలివరీ సర్వీసులకు లాక్‌డౌన్ నుంచి మినహాయింపునిచ్చారు. స్కూళ్లనూ బంద్ పెట్టలేదు. స్కూళ్లను మూసేస్తే పిల్లల ఏడాది చదువుకు నష్టం జరుగుతుందని, అది తనకు ఇష్టం లేదని మోరిసన్ అన్నారు. పిల్లలను తల్లిదండ్రులే జాగ్రత్తగా చూసుకోవాలని, స్కూళ్లలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు స్కూళ్లను బంద్ చేయాలని కోరినా ఇప్పటిదాకా ప్రభుత్వం స్పందించలేదు. తాజాగా ప్రధాని వ్యాఖ్యలతో ఏం చేయాలో అర్థం కాక రాష్ట్రాలు తలపట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో 1,315 కేసులు నమోదవగా ఏడుగురు చనిపోయారు.

**3 కేసుల్లో అమెరికా ప్లేస్**

| బాధితులు | |
|---|---|
| 36,756 | 12,549 ఒక్కరోజులో కొత్త కేసులు (రికార్డ్) |
| 396 చనిపోయినోళ్లు | 94 ఒక్కరోజులో మృతులు |

# ట్రాన్స్‌పోర్ట్ బంద్

## రాష్ట్రంలో నిలిచిపోనున్న బస్సులు, రైళ్లు

**హైదరాబాద్, వెలుగు:** కరోనా వైరస్ నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చర్యలతో మొత్తంగా రవాణా బంద్ కానుంది. ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించడంతో ఆదివారం మొదలైన ట్రాన్స్‌పోర్ట్ బంద్ ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగనుంది. ఆర్టీసీ బస్సులు, అన్ని రకాల రైళ్ల వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టుతోపాటు ప్రైవేటు వాహనాలు కూడా ఆగిపోనున్నాయి. రాష్ట్రం చుట్టూరా ఇతర రాష్ట్రాలతో ఉన్న సరిహద్దులను మూసివేస్తున్నారు. కేవలం అత్యవసర వస్తువులు, సేవలకు మాత్రమే మినహాయింపు ఉంది.

- ప్రైవేట్ బస్సులు, క్యాబ్స్, ఆటోలు కూడా..
- రాష్ట్రం చుట్టూ అన్ని బోర్డర్స్ క్లోజ్
- అత్యవసర సేవలకు మాత్రమే మినహాయింపు
- వ్యక్తిగత వాహనాల్లో.. అదీ అత్యవసరమైతేనే బైయటికి

**మొత్తం కోటీ 20 లక్షల వాహనాల్లో..**

రాష్ట్రంలో మొత్తం కోటీ 20 లక్షల వాహనాలు ఉన్నాయి. అందులో టూవీలర్లు 92 లక్షల 63 వేల 173, గూడ్స్ క్యారేజీలు 4 లక్షల 99 వేల 568, ఆటో రిక్షాలు 4 లక్షల 34 వేల 037, క్యాబ్‌లు లక్షా 28 వేల 420, ప్రైవేటు కార్లు 4 లక్షల 85 వేల 805 ఉండగా.. ఆర్టీసీ బస్సులు, ఇతర రకాల వాహనాలు మరికొన్ని ఉన్నాయి. దాదాపుగా ఈ వాహనాలన్నీ ఈ నెల 31వ తేదీ వరకు ఎక్కడివక్కడ నిలిచిపోనున్నాయి. అయితే ప్రతి డిపోలో అత్యవసర సేవల కోసం ఐదు బస్సులు నడిపాలని భావిస్తున్నారు. కరోనా ఎఫెక్ట్‌తో ఆర్టీసీ భారీగా ఆదాయం కోల్పోనుంది.

**రైళ్లన్నీ బంద్..**

రవాణా రంగంలో కీలకమైన రైళ్లు పూర్తిగా బంద్ కానున్నాయి. ఆదివారమే బంద్ మొదలుకాగా 31వ తేదీ వరకు ఇది కొనసాగనుంది. దక్షిణ మధ్య రైల్వే ద్వారా నిత్యం 750 ట్రైన్స్ నడుపుతుండగా.. 10 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. టికెట్ల ద్వారా రోజుకు రూ.10 కోట్ల ఆదాయం వస్తోంది. హైదరాబాద్ జంట నగరాల్లోని ఎంఎంటీఎస్‌లను కూడా ఆపేస్తున్నారు. అత్యవసర సేవల కోసం 12 ఎంఎంటీఎస్ రైళ్లను నడిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు కూడా బంద్ కానుంది.

**క్యాబ్స్, ఆటోలు, ప్రైవేట్ బస్సులు నడవవు**

క్యాబ్స్, ఆటోలు, ఇతర ప్రైవేట్ బస్సులు కూడా బంద్ చేయాలని సర్కారు నిర్ణయించింది. దీంతో లక్షలాది వాహనాలు ఆగిపోనున్నాయి. హైదరాబాద్‌లోనే 80 వేల క్యాబ్, లక్షన్నరకు పైగా ఆటోలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12 వేల ప్రైవేట్ బస్సులున్నాయి. విదేశాల నుంచి ఇతర రాష్ట్రాల మీదుగా రాష్ట్రానికి వచ్చినవారిలో కరోనా పాజిటివ్‌ను గుర్తించారు. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలతో బోర్డర్స్ బంద్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది, రాష్ట్రానికి ఏపీ, కర్నాటక, తమిళనాడుతో బార్డర్స్ ఉన్నాయి. 18 చెక్ పోస్టులు ఉన్నాయి. వీటిని 31వ తేదీ వరకు మూసివేయనున్నారు. ఎమర్జెన్సీ, ముఖ్యమైన గూడ్స్ వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు.

**రాష్ట్రంలో కేటగిరీ వారీగా వాహనాల సంఖ్య**

| వెహికల్ | సంఖ్య |
|---|---|
| ఆటో రిక్షాలు | 4,34,037 |
| స్కూల్, కాలేజీ బస్సులు | 27,477 |
| గూడ్స్ క్యారేజీలు | 4,99,568 |
| మ్యాక్సీ క్యాబ్‌లు | 30,706 |
| మోటార్ క్యాబ్‌లు | 1,28,420 |
| కార్లు | 4,85,805 |
| టూవీలర్లు | 92,63,173 |
| ట్రాక్టర్, ట్రాలర్స్ | 4,89,717 |
| ఇతర వాహనాలు | 1,01,301 |
| మొత్తం | 1,24,60,204 |



జనతా కర్ఫ్యూ ఎఫెక్ట్‌తో పికెట్ డిపోలో నిలిచిపోయిన బస్సులు

# ఏపీలోనూ లాక్ డౌన్

## 31 వరకు ప్రజా రవాణా పూర్తిగా బంద్

**అమరావతి, వెలుగు:** కరోనా వ్యాప్తి నివారణకు ఏపీ ప్రభుత్వం ఈనెల 31 వరకు లాక్ డౌన్ ప్రకటించింది. ప్రజా రవాణాను పూర్తిగా బంద్ చేస్తున్నట్లు తెలిపింది. ఇంటర్ స్టేట్ బోర్డర్లను మూసివేస్తున్నట్లు వెల్లడించింది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, ముందు జాగ్రత్త చర్యల కోసమే తాత్కాలిక లాక్ డౌన్ ప్రకటించినట్లు సీఎం జగన్ అన్నారు. జనతా కర్ఫ్యూను సక్సెస్ చేసినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు అమరావతిలోని నివాసంలో చప్పట్లు కొట్టి వైద్యసిబ్బందిని అభినందించారు. తర్వాత క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. "ఏపీలో ఇప్పటి వరకు 6 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వారిలో ఒకరు కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశాం. మరో ఐదు కేసుల్లో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని ఇద్దరు బాధితులు కోలుకుంటున్నారు. ఫారిన్ నుంచి వచ్చిన వారి వల్లే కరోనా వ్యాప్తి చెందింది. విదేశాల నుంచి ఎవరొచ్చినా ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలి. విదేశాల నుంచి వచ్చినవారు క్వారంటైన్‌లో ఉండాలి. ప్రజల మధ్య తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫారిన్ నుంచి వచ్చిన 11,670 మందిని గుర్తించి హోం క్వారంటైన్‌లో ఉంచాం. ఈ నెల 31 వరకు మాల్స్, జిమ్స్, కల్చరల్ సెంటర్లు, విద్యా సంస్థలు తెరవరాదు" అని అన్నారు. అత్యవసర సేవలు అందించే ప్రభుత్వ శాఖలు మినహా మిగిలిన ఉద్యోగులు సగం మంది మాత్రమే పనిచేసేలా ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. పరిశ్రమలు, ప్రైవేటు ఆఫీసుల్లో సిబ్బంది గుమిగూడకుండా చూసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని అన్నారు. నిత్యావసరాల దుకాణాలు మాత్రం తెరిచే ఉంటాయన్నారు. టెన్త్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని చెప్పారు. కరోనా ఉన్న విద్యార్థులకు పరీక్షల్లో మినహాయింపు ఇస్తామన్నారు. కరోనా లక్షణాలు,



ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నా ప్రత్యేక గదులు కేటాయిస్తామని చెప్పారు.

**29వ తేదీకే ఏప్రిల్ కోటా రేషన్ బియ్యం**

లాక్‌డౌన్ కారణంగా పేదలు ఇబ్బంది పడకుండా ఏప్రిల్ కోటా బియ్యాన్ని ఈ నెల 29వ తేదీకే ఉచితంగా అందిస్తామని సీఎం జగన్ చెప్పారు. బియ్యంతోపాటు కిలో పప్పును కూడా ఇస్తామన్నారు. నిత్యావసరాల కొనుగోలు కోసం ఒక్కో రేషన్ కార్డు దారుడికి ఏప్రిల్ 4న రూ. 1,000 సాయం అందిస్తామని చెప్పారు. ఈ మొత్తాన్ని గ్రామ, వార్డు వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి ఇస్తారని తెలిపారు. దీని కోసం రూ.1,500 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. బడ్జెట్ ఆమోదం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని జగన్ అన్నారు.

### ఏపీలో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్

**అమరావతి, వెలుగు:** కరోనా నివారణలో భాగంగా ఏపీ 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు వారం పాటు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించింది. అత్యవసర సేవలందిస్తున్న ప్రభుత్వ శాఖలు మినహా మిగిలిన శాఖల్లోని ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేయాలని ఆదేశాలు జారీ చేసింది. 50:50 చొప్పున ఉద్యోగులు ఆల్టర్నేటివ్ వారాలు విధుల నిర్వహణకు రావాలని సీఎస్ నీలం సాహ్నీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీ సెక్రటేరియట్ లో సెక్షన్ ఆఫీసర్ మొదలుకొని కిందిస్థాయి వరకు ఆల్టర్నేటివ్ వారాలు పనిచేస్తే చాలని సూచించారు. దీనికి అనుగుణంగా ఉద్యోగులను 50:50 శాతంగా విభజించాలని హెచ్‌ఓడీలు, కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు మండల స్థాయి ఆఫీసుల అధికారులు ఉద్యోగులను 2 సమాన గ్రూపులుగా చేసి ఆల్టర్నేట్ వారాలు పనిచేయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారులు, చైర్‌పర్సన్‌లు, కన్సల్టెంట్‌లుగా పనిచేస్తున్న వారు హెచ్‌ఓడీల అనుమతితో వర్క్ ఫ్రమ్ హోమ్‌కు పరిమితం కావాలన్నారు. ఉద్యోగుల్లో 50 ఏళ్లకు పైబడినవారు డయాబెటిస్, ఊపిరితిత్తుల సంబంధ వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులు ఉన్నవారు సెల్ఫ్ క్వారంటైన్ అవ్వాలని పేర్కొన్నారు. ఇలాంటివారికి ఏప్రిల్ 4 వరకు మెడికల్ సర్టిఫికెట్ అవసరం లేకుండా కమిటెడ్ లీవ్ జారీ చేస్తామన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రొటేషన్ పద్ధతిలో ఆఫీసుకు వచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ఉన్నతాధికారులకు సూచించారు.

# కరోనా హాస్పిటల్‌గా ‘కింగ్ కోఠి’

## ఆస్పత్రిని కరోనా పేషెంట్ల కోసం వాడుకోవాలని సర్కారు నిర్ణయం

**హైదరాబాద్, వెలుగు:** కరోనా పేషెంట్లకు ట్రీట్‌మెంట్ చేసేందుకు ఓ దవాఖానను పూర్తిగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం హైదరాబాద్‌లోని కింగ్ కోఠి దవాఖానాను ఎంపిక చేసినట్టు తెలిసింది. ఆ దవాఖానాలో ఇప్పటికే ఉన్న పేషెంట్లను సమీపంలోని ఇతర దవాఖానాలకు షిఫ్ట్ చేస్తున్నారు. రాష్ట్రంలో కరోనా అనుమానితులు, పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గాంధీ, చెస్ట్, ఫీవర్ హాస్పిటళ్లకు పదుల సంఖ్యలో అనుమానితులు వస్తున్నారు. ఆదివారం ఒక్క రోజే గాంధీకి 126 మంది వచ్చారు. ఇందులో 26 మందిని ఐసోలేషన్‌లో ఉంచి, శాంపిల్స్ సేకరించారు. ఇప్పటి వరకూ పాజిటివ్‌గా గుర్తించిన 27 మందిని గాంధీ, చెస్ట్ హాస్పిటళ్లలో ఉంచి ట్రీట్‌మెంట్ అందిస్తున్నారు. వైరస్ ఇతరులకు సోకకుండా ఆ దవాఖానాల్లో చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. వాటికి వచ్చేందుకు పేషెంట్లు భయపడుతున్నారు. రోజు రోజుకూ ఓపీ తగ్గిపోతోంది. ఇదే సమయంలో కరోనా కేసులు పెరుగుతుండటంతో.. కరోనా పేషెంట్ల కోసం ప్రత్యేకంగా ఓ హాస్పిటల్ ఉంటే బాగుంటుందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది.

**విదేశాల నుంచి వచ్చినోళ్లపై ఆరా**

రాష్ట్రంలో కరోనా పరిస్థితిపై కోఠిలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రి ఈటల రాజేందర్, కమిటీ సభ్యులు, హెల్త్ ఆఫీసర్లు భేటీ అయ్యారు. ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు, ఇంకా ఏం చేయాలన్న దానిపై ఆరా తీశారు. మార్చి ఒకటి తర్వాత విదేశాల నుంచి వచ్చినోళ్ల వివరాలను సేకరిస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ప్రతి గ్రామంలో సర్పంచ్, వీఆర్వో, ఆశ వర్కర్, పోలీస్ కానిస్టేబుల్‌తో టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆ గ్రామాల నుంచి విదేశాలకు వెళ్లిన వారి వివరాలను సేకరించి, వాళ్లు ఇప్పుడు ఎక్కడున్నారనే దానిపై ఆరా తీస్తున్నామని తెలిపారు. ఇందులో ఎవరైనా ఇండియాకు వచ్చి, ఇప్పుడు ఎక్కడున్నారో తెలియకపోతే ఇంటెలిజెన్స్‌కు సమాచారం చేరవేస్తున్నట్టు వివరించారు.




- కరోనా పాజిటివ్ కేసులు, అనుమానితులు పెరుగుతుండటంతో చర్య
- నిపుణుల కమిటీతో మంత్రి ఈటల భేటీ
- ఏ జిల్లా పేషెంట్లను ఆ జిల్లాలోనే ఐసోలేట్ చేయాలని నిర్ణయం
- పాజిటివ్ వస్తేనే హైదరాబాద్‌కు తరలింపు

### ఏ జిల్లా పేషెంట్ ఆ జిల్లాలోనే..

కరోనా అనుమానితులను హైదరాబాద్ కు తరలించొద్దని ఆరోగ్యశాఖ ఆదేశాలిచ్చింది. ఇప్పటికే ఆయా జిల్లా దవాఖాన్లలో ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. అనుమానితులను ఆ దవాఖాన్లకు తరలించి, శాంపిళ్లను మాత్రమే హైదరాబాద్ కు పంపించాలని మంత్రి జిల్లాల హెల్త్ ఆఫీసర్లకు సూచించారు. ఒకవేళ అందులో ఎవరైనా పాజిటివ్ వస్తే.. ఆ పేషెంట్‌ను హైదరాబాద్‌కు తరలించాలని ఆదేశించారు. అలాగే కరోనా టెస్టుల కోసం ఎవర్ని రిఫర్ చేయాలన్న దానిపై నిపుణుల కమిటీ మార్గదర్శకాలు రూపొందించి, ప్రభుత్వానికి అందజేసినట్టు తెలిసింది.

# 13 రాష్ట్రాలు బంద్

## కరోనా ఎఫెక్ట్‌తో లాక్‌డౌన్ ■ వైరస్ ప్రభావమున్న 75 జిల్లాలు కూడా

- అత్యవసర, నిత్యవసర సర్వీసులే అందుబాటులో
- కొన్ని చోట్ల ఇంటికే రేషన్

కరోనా మహమ్మారి వ్యాప్తిని అడ్డుకోవడానికి కేంద్ర, రాష్ట్రాలు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశంలో వైరస్ ప్రభావమున్న 75 జిల్లాలను లాక్‌డౌన్ చేస్తున్నట్టు కేంద్రం ఆదివారం ప్రకటించింది. మహమ్మారిని కట్టడి చేసేందుకు రాష్ట్రాలు చర్యలు ముమ్మరం చేశాయి. 31 వరకు లాక్‌డౌన్ చేస్తున్నట్టు 13 రాష్ట్రాలు ప్రకటించాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, హర్యానా, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఢిల్లీ, నాగాలాండ్, రాజస్థాన్,చత్తీస్‌గఢ్ నిర్ణయం తీసుకున్నాయి.

**మార్చి 31 వరకు కర్ఫ్యూ**

దేశంలో కరోనా కేసులు పెరుగుతుండటంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. కరోనా కేసులు బయటపడ్డ జిల్లాలను మార్చి 31 వరకు లాక్ డౌన్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఆదివారం ఆ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో 75 జిల్లాల్లో మార్చి 31 వరకు కర్ఫ్యూ కొనసాగనుంది. ఈ జిల్లాల్లో అత్యవసర, నిత్యావసర సేవలు మినహా మిగిలినవన్నీ బంద్ కాబోతున్నాయి. కేబినెట్ సెక్రటరీ నేతృత్వంలో అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు, ప్రధాని మోడీ ప్రిన్సిపల్ సెక్రటరీలతో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**అవసరమైతే ఇంటింటికీ రేషన్: ఉత్తరాఖండ్**

ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించింది. నిత్యావసర దుకాణాలు ఎప్పటిలాగే కొనసాగుతాయంది. ప్రధాని మోడీ జనతా కర్ఫ్యూ ప్రకటించిన రోజే ఉత్తరాఖండ్ సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. కర్ఫ్యూను విజయవంతం చేసినందుకు రాష్ట్ర ప్రజలకు ఆదివారం థాంక్స్ చెప్పిన ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్.. మున్ముందు తీసుకునే కఠిన నిర్ణయాలకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు కోరారు.

**ఢిల్లీలో 144 సెక్షన్**

దేశ రాజధాని ఢిల్లీలో కూడా 31 వరకు లాక్‌డౌన్‌ను ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఇది అమల్లోకి వస్తుందని చెప్పారు. లాక్‌డౌన్ రోజుల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు. 25 శాతం ట్రాన్స్‌పోర్ట్ సర్వీసులే నడుస్తాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 27 కేసులు నమోదయ్యాయి.

**మహారాష్ట్రలో 144 సెక్షన్**

మహారాష్ట్రలో మార్చి 22 నుంచి 31 వరకు 144 సెక్షన్ విధిస్తున్నట్టు ఆ రాష్ట్ర సీఎం ఉద్ధవ్ తెలిపారు. కేసులు పెరుగుతున్న ఈ టైమ్‌లో కఠిన నిర్ణయాలు తీసుకోవడం తప్ప వేరే మార్గం లేదన్నారు. అందుకే 144 సెక్షన్ విధిస్తున్నామని తెలిపారు. విదేశాల నుంచి రాష్ట్రంలోకి ఒక్క విమానానికీ అనుమతి లేదని చెప్పారు.

**గుజరాత్‌లో గాంధీనగర్‌లోనూ లాక్‌డౌన్**

ఇప్పటికే అహ్మదాబాద్, సూరత్, వడోదర, రాజ్‌కోట్‌లను మార్చి 25 వరకు లాక్‌డౌన్ చేస్తున్నట్టు వెల్లడించిన గుజరాత్ ప్రభుత్వం తాజాగా ఆ రాష్ట్ర రాజధాని గాంధీనగర్‌లోనూ లాక్‌డౌన్ విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. అత్యవసర సర్వీసులు తప్ప అన్ని షాపులనూ మూసేస్తున్నట్టు ఆ రాష్ట్ర సీఎం విజయ్ రూపానీ తెలిపారు. గవర్నమెంట్ సర్వీసులు మాత్రం మార్చి 29 వరకు 50 శాతం క్లాస్ 3, క్లాస్ 4 సిబ్బందితో పని చేస్తాయన్నారు.

**చత్తీస్, నాగాలాండ్ లాక్‌డౌన్**

చత్తీస్‌గఢ్ కూడా రాష్ట్రంలోని అన్ని పట్టణాలను లాక్‌డౌన్ చేస్తున్నట్టు ప్రకటించింది. వైరస్‌ను ఆపడానికి ప్రపంచవ్యాప్తంగా పాటిస్తున్న బెస్ట్ పద్ధతి ఇదేనని ఆ రాష్ట్ర సీఎం భూపేశ్ బాఘల్ అన్నారు. నాగాలాండ్ కూడా లాక్ డౌన్ ఆర్డర్స్ ఇచ్చేసింది. పశ్చిమ బెంగాల్ 31 వరకు అంతా మూసేస్తున్నట్టు వెల్లడించింది. ఉత్తరప్రదేశ్‌లోనూ 15 జిల్లాలను బుధవారం వరకు లాక్‌డౌన్ చేస్తున్నట్టు ప్రకటించారు. హర్యానాలో 7 జిల్లాల్లో మార్చి 31 వరకు లాక్‌డౌన్ చేశారు. కోల్‌కతా నగరం షట్‌డౌన్ అయింది. నోయిడా నగరం కూడా లాక్‌డౌన్ అయిపోయింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి డొమెస్టిక్ ఫ్లైట్లు నడుస్తాయని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. కలకత్తా ఎయిర్‌పోర్టు నుంచి కూడా డొమెస్టిక్ ఫ్లైట్లు నడుస్తాయని ఎయిర్‌పోర్టు ప్రకటించింది.



జనతా కర్ఫ్యూ నేపథ్యంలో రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. ముంబైలోని జేజే బ్రిడ్జి ఇలా నిర్మానుష్యమైపోయింది.

### కుటుంబం నుంచి ఒక్కరే: పంజాబ్

రాజస్థాన్‌లాగే పంజాబ్ కూడా లాక్‌డౌన్ ప్రకటించింది. మార్చి 31 వరకు అంతా బంద్ చేస్తున్నట్టు వెల్లడించింది. నిత్యావసర సేవలు పొందేందుకు ప్రతి కుటుంబం నుంచి ఒక్కరినే బయటికి వచ్చేందుకు అనుమతిస్తామని చెప్పింది. పాలు, ఆహారం, మెడిసిన్ షాపుల్లాంటి నిత్యావసర వస్తువులమ్మే దుకాణాలు మినహా అన్ని వ్యాపార, వాణిజ్య సముదాయాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. లాక్‌డౌన్ పర్యవేక్షణకు ఓ టాస్క్ ఫోర్స్ టీమ్‌ను ఆ రాష్ట్రం ఏర్పాటు చేసింది. పంజాబ్‌లో ప్రస్తుతం 14 పాజిటివ్ కేసులున్నాయి. శనివారం 11 మందికి కరోనా సోకినట్టు వెల్లడైంది.

### చండీగఢ్‌లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ బంద్

చండీఘర్‌లో 6 పాజిటివ్ కేసులు నమోదవడంతో ముందు జాగ్రత్తగా మార్చి 31 వరకు అంతా బంద్ చేస్తున్నట్టు అక్కడి అధికారులు ప్రకటించారు. ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు, ఫ్యాక్టరీలు, ఇతర బిజినెస్ కార్యక్రమాలు జరగవన్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కూడా బంద్ చేస్తున్నామని చెప్పారు. అందరూ ఇండ్లలోనే ఉండాలని, అర్జెంటయితేనే బయటకు రావాలని సూచించారు. అత్యవసర, ఆహార పదార్థాల సర్వీసులు, రేషన్ షాపులు తెరిచే ఉంటాయన్నారు.

### మే వరకు సరిపడా గోధుమలు ఫ్రీ: రాజస్థాన్

వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేయడానికి మార్చి 22 నుంచి 31 వరకు రాష్ట్రాన్ని పూర్తిగా లాక్‌డౌన్ చేస్తున్నామని రాజస్థాన్ సర్కారు ప్రకటించింది. అత్యవసర సేవలే పనిచేస్తాయని ఆ రాష్ట్ర సీఎం అశోక్ గెహ్లాట్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆఫీసులు, మాల్స్, షాపులు, ఫ్యాక్టరీలు, ప్రజా రవాణా మూసేస్తున్నామన్నారు. లాక్‌డౌన్ టైంలో ప్రజలకు ఆహారానికి సమస్య లేకుండా కోటి కంటే ఎక్కువ కుటుంబాలకు మే వరకు ఫ్రీగా గోధుమలు లభిస్తాయని సీఎం ట్వీట్ చేశారు. వీధి వ్యాపారులు, రోజువారీ కార్మికులకు ఏప్రిల్ 1 నుంచి రెండు నెలల పాటు ఫ్రీగా ఆహార ప్యాకెట్లు అందిస్తామన్నారు. రాజస్థాన్‌లో తాజాగా 8 కొత్త కేసులు నమోదయ్యాయి.



## 31 వరకు రైళ్లు, మెట్రో బంద్

### ఇంటర్ స్టేట్ బస్సులూ నడవవు

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- ప్యాసింజర్ ట్రైన్లన్నీ రద్దు: రైల్వే శాఖ
- గూడ్స్ ట్రైన్లకు మినహాయింపు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ప్రజా రవాణాపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ నెల 31 వరకు రైళ్లు, మెట్రో ట్రైన్లు, ఇంటర్ స్టేట్ (అంతర్రాష్ట్ర) బస్సు సర్వీసులను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. కేంద్రం ఆదివారం అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో హైలెవెల్ మీటింగ్ నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైల్వే శాఖ ఒక ప్రకటన రిలీజ్ చేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈ నెల 31 అర్ధరాత్రి వరకు అన్ని ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. కేవలం గూడ్స్‌సర్వీసులను మాత్రం నడిపిస్తామని చెప్పింది. అయితే ఇప్పటికే జర్నీలో ఉన్న ట్రైన్లు గమ్య స్థానాలకు చేరేందుకు అనుమతినిచ్చింది. ప్యాసింజర్, ప్రీమియమ్, మెయిల్ అండ్ ఎక్స్ ప్రెస్, సబర్బన్, కోల్ కతా మెట్రో రైల్, కొంకణ్ రైల్వే సర్వీసులు ఈ నెల 31 అర్ధరాత్రి వరకు నడవవని వెల్లడించింది. ఇక కేంద్ర నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా మెట్రో రైళ్లు కూడా రద్దు కానున్నాయి. ఈ నెల 31 వరకు మెట్రో సర్వీసులను నిలిపి వేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకటించింది. రైళ్లను ఆపేస్తున్నట్లు నోయిడా మెట్రో రైల్ కార్పొరేషన్ (ఎన్ ఎంఆర్ సీ) కూడా తెలిపింది. మెట్రో సిటీ బస్సులు కూడా నడవవని ఎన్ ఎంఆర్ సీ వెల్లడించింది. మరోవైపు ఇంటర్ స్టేట్ బస్సు సర్వీసులను కూడా రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వివిధ రాష్ట్రాల మధ్య నడుస్తున్న బస్సులు బంద్ కానున్నాయి. రైళ్లలో క్వారంటైన్ వ్యక్తులు ప్రయాణాలు చేస్తున్నట్లు రైల్వేశాఖ దృష్టికి రావడంతో అప్రమత్తమైంది. ఇలాంటి సంఘటనలు మూడు జరగడంతో రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రజలు ప్రయాణాలను రద్దు చేసుకోవాలని లేదంటే వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఇందుకోసం రిఫండ్ రూల్స్ ను కూడా సరళతరం చేసింది. మార్చి 21 నుంచి జూన్ 21 మధ్య ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్న వారికి ఇది వర్తించనుంది. ఈ పీరియడ్‌లో రద్దయ్యే ట్రైన్లలో టికెట్లు బుక్ చేసుకున్న వారికి రిఫండ్ ఇవ్వాలని రైల్వే శాఖ నిర్ణయించింది. జర్నీ డేట్ నుంచి మూడు నెలల్లోగా టికెట్ ను కౌంటర్‌లో అందజేసి, రిఫండ్ పొందొచ్చని తెలిపింది. ఒకవేళ రైళ్లు రద్దు కాకుండా, ప్యాసింజర్లే ప్రయాణం రద్దు చేసుకుంటే... జర్నీ డేట్ నుంచి మూడు నెలల్లోగా స్టేషన్ లో టికెట్ డిపాజిట్ రిసిప్ట్ (టీడీఆర్)ను ఫైల్ చేయాలని సూచించింది. ఢిల్లీలోని నేషనల్ రైల్ మ్యూజియం సహా రీజినల్ రైల్ మ్యూజియాలు, హెరిటేజ్ పార్కులు, గ్యాలరీలను మూసివేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది.



జనాలు లేక వెలవెలబోయిన కోల్‌కతా కూరగాయల మార్కెట్

# ఒక్కరోజే ముగ్గురు బలి

## ముంబై, పాట్నా, గుజరాత్ లో ఒక్కొక్కరు మృతి

- దేశంలో 7కు చేరిన కరోనా మృతులు
- మొత్తం 341 మందికి సోకిన వైరస్
- ఒక్క రోజులోనే కొత్తగా 58 మందికి పాజిటివ్

దేశంలో కరోనా మహమ్మారి రోజురోజుకూ పెరిగిపోతోంది. ఒక్క రోజే ముగ్గురు వైరస్ కు బలైపోయారు. ఇంతకుముందు మహారాష్ట్ర, ఢిల్లీ, కర్నాటక, పంజాబ్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చనిపోయారు. ఆదివారం ముంబై, పాట్నా, సూరత్ లో ఒక్కొక్కరు మృత్యువాత పడ్డారు. దీంతో మృతుల సంఖ్య 7కు చేరింది. దేశంలో ఆదివారం నాటికి కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 341కి చేరింది. వీరిలో 41 మంది విదేశీయులు ఉన్నారని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. దేశంలో ఒక్కరోజులోనే కొత్తగా 58 మందికి వైరస్ కన్ఫమ్ అయిందని ఐసీఎంఆర్ వెల్లడించింది. ఆదివారం నాటికి మొత్తం 16,999 శాంపిళ్లను టెస్ట్ చేసినట్లు తెలిపింది. ఆదివారం గుజరాత్, బీహార్ లో తొలి కరోనా మరణాలు నమోదయ్యాయి. గుజరాత్ లో మొత్తం కేసులు 18కి చేరాయి. సూరత్ కు చెందిన ఓ వ్యక్తి కరోనా వల్ల చనిపోయినట్లు హెల్త్ మినిస్టర్ ప్రకటించారు. వడోదరలో ఓ మహిళ కూడా కరోనా వల్లే చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఇక ఖతార్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి పాట్నాలోని ఎయిమ్స్ లో కిడ్నీ ఫెయిల్యూర్ తో చనిపోయాడు. అతడికి కరోనా సోకినట్లు పరీక్షల్లో తేలింది. మృతుడికి ట్రీట్ మెంట్ చేసిన హాస్పిటల్లో మరో ఆరుగురు పేషెంట్లకు కూడా వైరస్ సోకినట్లుగా అనుమానిస్తున్నారు. ఇప్పటిదాకా 24 మంది మాత్రమే కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ఆదివారం ముంబైలో కరోనా వల్ల చనిపోయిన 63 ఏళ్ల వ్యక్తికి డయాబెటిస్, హైబీపీ, గుండెజబ్బు సమస్యలూ ఉన్నాయని హెల్త్ ఆఫీసర్లు వెల్లడించారు. మహారాష్ట్రలో కరోనా కేసుల సంఖ్య 74కు పెరిగింది. కేరళలో 52కు చేరాయి.

**రామగుండం వచ్చిన 8 మందికి కరోనా..**

ఇటీవల రెండు రైళ్లలో ప్రయాణించిన 12 మంది ప్యాసింజర్లకు కరోనా పాజిటివ్ వచ్చినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. వీరిలో 8 మంది ఢిల్లీ నుంచి రామగుండానికి ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్ ప్రెస్ లో ఈ నెల 13న ప్రయాణించారని తెలిపింది. ఇక ఢిల్లీలో మార్చి 31 వరకూ జిమ్ లు, స్పాలు తెరవరాదన్న ఆదేశాలను ఉల్లంఘించిన నలుగురు జిమ్ ఓనర్లపై పోలీసులు కేసులు పెట్టారు. ఇద్దరిని అరెస్టు చేశారు. మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

**లోకల్ ట్రాన్స్ మిషన్ పెరుగుతోంది**

దేశంలో కరోనా కన్ఫమ్ అయిన వారితో కాంటాక్ట్ అయినవారి సంఖ్య కూడా పెరుగుతోందని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. శనివారం నాటికి 7 వేల మంది కాంటాక్ట్ అయినవాళ్లను గుర్తించామని తెలిపింది. మహారాష్ట్రలో కరోనా వైరస్ లోకల్ ట్రాన్స్ మిషన్ (వ్యాప్తి) పెరుగుతోందని హెల్త్ మినిస్టర్ రాజేశ్ తొపే చెప్పారు. ఆదివారం 10 కొత్త కేసులు నమోదు కాగా, వారిలో ఎలాంటి ఫారిన్ టూర్ హిస్టరీ లేకున్నా ఐదుగురికి వైరస్ సోకినట్లు తేలిందని తెలిపారు. మిగతా ఐదుగురు మాత్రం విదేశాల నుంచి వచ్చారన్నారు.





చెన్నై సిటీలో రోడ్లను శానిటైజర్‌తో క్లీన్ చేస్తున్న సిబ్బంది. బీహార్ రాజధానిలోని పాట్నా బస్టాండ్‌లకే పరిమితమైపోయిన బస్సులు

### మైక్ పెన్స్ కు నెగెటివ్

బ్రిటన్ రాణి రెండో ఎలిజబెత్ స్టాఫ్‌లో ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో ఆ వ్యక్తితో కాంటాక్ట్ అయిన అందరూ సెల్ఫ్ఐసోలేషన్ లోకి వెళ్లారు. 93 ఏళ్ల క్వీన్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఇక ఆదివారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు వంద కోట్ల మంది ఇండ్లకే పరిమితమయ్యారు. ప్రపంచమంతా వైరస్ గుప్పిట్లో చిక్కినందున జపాన్ లో జరగబోయే 2020 టోక్యో ఒలంపిక్స్ ను రద్దు చేయాలన్న డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. కేవలం 45 నిమిషాల్లో రిజల్ట్ వచ్చే కరోనా వైరస్ టెస్టుకు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం తెలిపింది. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, ఆయన భార్యకు కరోనా నెగెటివ్ వచ్చినట్లు ఆయన సెక్రటరీ వెల్లడించారు. పెన్స్ స్టాఫ్‌లో ఒకరికి పాజిటివ్ రావడంతో వారికి టెస్టులు చేశారు.

### 2 రోజుల్లోనే 40% కేసులు..

దేశవ్యాప్తంగా గత రెండు రోజుల్లోనే కరోనా కేసులు 40% పెరిగాయి. శనివారం ఒక్కరోజే కొత్తగా 78 మందికి పాజిటివ్ వచ్చింది. కేరళలో 12, మహారాష్ట్రలో 11, పంజాబ్ లో 10 కొత్త కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ఆదివారం నాటికి ఢిల్లీలో 27, యూపీలో 25, రాజస్థాన్ లో 24, హర్యానాలో 17, కర్నాటకలో 20, గుజరాత్ లో 18, పంజాబ్, లడఖ్‌లలో 13 చొప్పున, తమిళనాడులో 6, చండీగఢ్ లో 5, మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల్లో 4 చొప్పున, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్ లలో 2 చొప్పున, పుదుచ్చేరి, చత్తీస్ గఢ్ లలో ఒక్కో కేసు చొప్పున కన్ఫమ్ అయ్యాయి.

### ప్రపంచం విలవిల

కరోనా మహమ్మారి ధాటికి ప్రపంచం విలవిల్లాడుతోంది. ఆదివారం నాటికి మొత్తం 13,598 మంది వైరస్ కు బలైపోయారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య మొత్తం 3,16,067కు చేరింది. చైనాలో పాజిటివ్ కేసులు 81,054కి పెరిగాయి. ఆ దేశంలో మూడు రోజులుగా 45 కేసులు నమోదైనా, అవి విదేశాల నుంచి వచ్చినవారివే ఉన్నాయి. ఆదివారం మాత్రం కొత్తగా ఒక డొమెస్టిక్ కేసు నమోదైంది. కొత్తగా ఆరుగురు చనిపోగా, మృతుల సంఖ్య 3,261కి చేరింది. ఇక ఇటలీలో కేసులు 53,578కి చేరగా, మృతుల సంఖ్య 4,825కు పెరిగింది. స్పెయిన్ లో 28,572 కేసులు నమోదు కాగా, 1,725 మంది చనిపోయారు. స్పెయిన్ లో శనివారం ఒక్కరోజే 32 శాతం కేసులు పెరిగాయి. అమెరికాలో 26,905 కేసులు నమోదయ్యాయి. కొత్తగా 2,698 మందికి వైరస్ సోకింది. ఇప్పటిదాకా348 మంది మరణించారు. ఇరాన్ లో గత 24 గంటల్లోనే 966 కొత్త కేసులు నమోదయ్యాయి. దేశంలో మొత్తం 21,638 మందికి వైరస్ సోకగా, మృతుల సంఖ్య 1,685కు చేరింది. దేశంలో కరోనా పేషెంట్లలో మరణాల రేటు 8.6 శాతానికి చేరింది. ఫ్రాన్స్ లో 14,459 మందికి వైరస్ సోకగా,562 మంది మృత్యువాత పడ్డారు. సౌత్ కొరియాలో కేసుల సంఖ్య 8,897కు పెరగగా, 104 మంది చనిపోయారు. బ్రిటన్ లో 5 వేల కేసులు నమోదు కాగా, 240 మంది చనిపోయారు. అలాగే స్విట్జర్లాండ్ లో 80 మంది, నెదర్లాండ్స్ లో 136 మంది, ఇండోనేసియాలో 48 మంది, బెల్జియంలో 75 మంది చనిపోయారు. థాయిలాండ్ లోనూ రాత్రికిరాత్రే 600 కొత్త కేసులు నమోదయ్యాయి. పాకిస్తాన్ లో 730కేసులు కన్ఫమ్ కావడంతో అంతర్జాతీయ విమానాలన్నింటినీ రద్దు చేసింది.




డాక్టర్లకు థ్యాంక్స్ చెప్తూ గంట కొడుతున్న ఎల్.కే. అద్వానీ


జనతా కర్ఫ్యూలో భాగంగా ప్లేట్‌ను కొడుతూ మద్దతు తెలుపుతున్న ఈమె ప్రధాని మోడీ తల్లి. 'మీలాంటి కోట్లాది మంది తల్లుల ఆశీర్వాదంతో.. కరోనా వైరస్‌పై పోరాడుతున్న డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది, పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది, స్కావెంజర్లు, మీడియా ప్రతినిధులు వంటి లెక్కలేనంత మంది ఎంతో ప్రేరణ పొందారు. వాళ్లు మరింత పనిచేసేందుకు మద్దతు వచ్చింది' అంటూ ఆమె వీడియోను మోడీ ఆదివారం ట్వీట్ చేశారు.


వైరస్ భయంతో జనం భయపడుతుంటే.. బాధితులకు దగ్గరగా మెసులుతూ చికిత్స చేస్తున్న డాక్టర్లు, నర్సులు, ఇతర అత్యవసర సిబ్బంది సేవలను గుర్తిస్తూ చప్పట్లు కొడుతున్న ప్రెసిడెంట్ రామ్‌నాథ్ కోవింద్ కుటుంబ సభ్యులు



## కనిక కపూర్ పార్టీకి వెళ్లినోళ్లలో 11 మందికి సేఫ్

**కాన్పూర్ :** కరోనా పాజిటివ్ వచ్చిన బాలీవుడ్ సింగర్ కనిక కపూర్ ఇచ్చిన పార్టీకి వెళ్లిన వారిలో 11 మందికి కరోనా నెగిటివ్ అని తేలింది. ఈ విషయాన్ని కాన్పూర్ జిల్లా కలెక్టర్ బ్రహ్మ డియో రామ్ ప్రకటించారు. 13 న కనిక కపూర్ ఇచ్చిన పార్టీకి మొత్తం 56 మంది హాజరయ్యారు. ఆ తర్వాత కనిక కపూర్ కు కరోనా పాజిటివ్ అని తేలటంతో ఆ పార్టీ కి వచ్చిన వారందరికీ కరోనా టెస్ట్ లు చేస్తున్నారు. వీరిలో ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా కరోనా సోకలేదు. ఆదివారం 11 మందికి నెగిటివ్ రిజల్ట్స్ వచ్చింది. మిగతా వారి శాంపిల్స్ ను కలెక్ట్ చేశారు. రిజల్ట్స్ రావాల్సి ఉంది.



## ఢిల్లీలో 31 వరకు ఆంక్షలు

### ర్యాలీలు, ధర్నాలు బంద్

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 31 వరకు పోలీసులు ఆంక్షలు విధించారు. ఆదివారం రాత్రి 9 గంటల నుంచి 31 అర్ధరాత్రి వరకు ర్యాలీలు, ధర్నాలపై బ్యాన్ విధిస్తున్నట్లు ఢిల్లీ పోలీస్ కమిషనర్ శ్రీవాస్తవ ఉత్తర్వులు జారీ చేశారు. సెమినార్లు, ఫంక్షన్లు, స్పోర్ట్స్ గ్యాదరింగ్స్, కాన్ఫరెన్స్‌లు కూడా నిర్వహించొద్దని అన్నారు. రాజకీయ సమావేశాలపై కూడా బ్యాన్ విధించారు.

# ఇటలీ నుంచి ఢిల్లీకి 263 మంది

**న్యూఢిల్లీ, పుణే, ముంబై, కోల్ కతా:**

ఇటలీలో చిక్కుకుపోయిన 263 మంది మనోళ్లను ఎయిర్ ఇండియా స్పెషల్ ఫ్లైట్ ఆదివారం ఢిల్లీకి తీసుకొచ్చింది. ఎయిర్ పోర్టులో దిగిన వాళ్లందరినీ అటునుంచి అటే ఐటీబీపీ క్వారంటైన్ ఫెసిలిటీకి తరలించినట్లు అధికారులు చెప్పారు. కరోనా వైరస్ ప్రభావం చాలా ఎక్కువగా ఉన్న ఇటలీలో మనోళ్లు, ఇక్కడ వాళ్ల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఫ్లైట్ సర్వీసులు కూడా రద్దు చేయడంతో వాళ్లంతా ఎయిర్ పోర్టుల్లోనే చిక్కుకుపోయారు. ఈ క్రమంలో వారిని తీసుకొచ్చేందుకు కేంద్రం శనివారం స్పెషల్ ఫ్లైట్‌ను పంపించింది. ఈ విమానం మొత్తం 263 మందితో ఆదివారం ఉదయం 10 గంటలకు ఢిల్లీ ఎయిర్ పోర్టులో దిగిందని అధికారులు చెప్పారు. థర్మల్ స్క్రీనింగ్ తర్వాత ప్రయాణికులందరినీ ఛావ్లా ఏరియాలోని క్వారంటైన్‌కు తరలించినట్లు ఐటీబీపీ అధికార ప్రతినిధి చెప్పారు. ఇంతకుముందు వివిధ దేశాల నుంచి ప్రత్యేక విమానాల్లో తీసుకొచ్చిన వారిని కూడా ఇదే క్వారంటైన్‌లో ఉంచినట్లు ఆయన వివరించారు.

**ఢిల్లీ ఎయిర్ పోర్టులో 90 స్క్రీనింగ్ కౌంటర్లు**

దేశంలోకి ఇంటర్నేషనల్ ఫ్లైట్లను ఆదివారం నుంచి అనుమతించబోమని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో 12 దేశాల నుంచి వేలాది మంది ఇండియన్లు ఢిల్లీ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. వారందరికీ దశలవారీగా స్క్రీనింగ్ చేసి క్వారంటైన్‌కు పంపిస్తున్నారు. ఈ క్రమంలో థర్మల్ స్క్రీనింగ్‌కు గంటల తరబడి వెయిట్ చేయాల్సి రావడంతో శుక్ర, శనివారాల్లో ఎయిర్ పోర్టులో గందరగోళం నెలకొంది. దీనిపై విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. ఢిల్లీ ఎయిర్ పోర్టులో 90 హెల్త్ స్క్రీనింగ్ కౌంటర్లను ఏర్పాటు చేశామని, దీంతో పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాయని ఆదివారం ట్వీట్ చేశారు. ప్రతి గంటకు వెయ్యి మంది ప్రయాణికులు క్లియరెన్స్ పొందవచ్చునని పేర్కొన్నారు.



- స్పెషల్ ఫ్లైట్‌లో చేరుకున్న మనోళ్లు
- ఐటీబీపీ క్వారంటైన్‌కు తరలింపు
- క్వారంటైన్ స్టాంపుతో ప్రయాణం..
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హోం క్వారంటైన్ స్టాంప్‌తో..**

చేతి మీద హోంక్వారంటైన్ స్టాంప్ ఉన్న ఒక వ్యక్తి ముంబై నుంచి బెంగళూరు వెళ్తుండగా రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పుణే జిల్లాలోని దౌండ్ స్టేషన్‌లో అదుపులోకి తీసుకుని హాస్పిటల్‌లకు తరలించినట్లు అధికారులు చెప్పారు. ఖత్తార్ నుంచి ముంబై వచ్చిన 28 ఏళ్ల వ్యక్తికి ముంబై ఎయిర్‌పోర్ట్‌లోని అధికారులు హోం క్వారంటైన్ స్టాంప్ వేశారు. అయినప్పటికీ ఆ వ్యక్తి తన సొంత ఊరు కర్నాటకలోని గుల్బర్గ్ వెళ్లేందుకు ట్రైన్‌లో బయలుదేరాడు. ఈ విషయం తెలిసి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ వ్యక్తికి కరోనా వైరస్ లక్షణాలు లేవని, ట్రైన్ బోగీని శుభ్రం చేసి లాక్ చేశామని స్టేషన్ అధికారులు చెప్పారు.

**క్వారంటైన్ నుంచి 15 మంది పరార్**

హోమ్ క్వారంటైన్ స్టాంపులు వేసిన 15 మంది ప్యాసింజర్లు ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి ఆదివారం పారిపోయారు. ఆ తర్వాత వారి కోసం గాలించిన పోలీసులు ముంబై రైల్వే స్టేషన్ దగ్గర అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం దుబాయ్ నుంచి ముంబైకు వచ్చిన 15 మందిని చెక్ చేసిన పోలీసులు హోం క్వారంటైన్ లో ఉండాలని సూచిస్తూ వారికి స్టాంపులు వేశారు. అయితే వాళ్లంతా డిటైల్స్ ఇవ్వకుండా ఎయిర్‌పోర్ట్ నుంచి పారిపోవడంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వాళ్లంతా పంజాబ్‌కు చెందిన వారని, వారిని స్పెషల్ బస్సులో తరలిస్తున్నామని సీనియర్ పోలీస్ ఆఫీసర్ చెప్పారు.

### హౌరాలో వెయ్యిమందికి థర్మల్ స్క్రీనింగ్

హౌరా రైల్వే స్టేషన్‌లో ముంబై నుంచి స్పెషల్ ట్రైన్ లో వచ్చిన వెయ్యి మంది ప్యాసింజర్లకు కరోనా థర్మల్ స్క్రీనింగ్ చేశారు. ఆదివారం ఉదయం 7.22 గంటలకు స్పెషల్ ట్రైన్ హౌరా స్టేషన్ కు చేరుకోగానే ఆర్పీఎఫ్, జీఆర్ పీ సిబ్బంది ప్యాసింజర్లను చుట్టుముట్టారు. మెడికల్ ఆఫీసర్లు అందరకీ థర్మల్ స్క్రీనింగ్ చేశారు. మహారాష్ట్ర నుంచి రెండు ట్రైన్ లు కోల్ కతా వస్తున్నట్లు సమాచారం అందడంతో వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఎలర్ట్ ప్రకటించారు. ముంబై, పుణే నుంచి రైళ్లలో వస్తున్నవారికి స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించారు.



### టెస్ట్ చేస్తామంటే భయపడ్డడు

ఈ మధ్యే సౌదీ అరేబియా నుంచి జమ్మూ కాశ్మీర్‌కు వచ్చిన వ్యక్తి కరోనా టెస్ట్ చేయించుకోమంటే భయపడి హాస్పిటల్ నుంచి పారిపోయిండు. అయితే ఆయన్ను వెంటనే గుర్తించిన పోలీసులు అదుపులోకి తసుకుని ఐసోలేషన్ వార్డులకు తరలించారు.

## నిర్మాణ కూలీలకు రూ. 3 వేల సాయం

### పంజాబ్ సీఎం అమరీందర్ ప్రకటన

**చండీగఢ్:** కరోనా ఎఫెక్ట్‌తో ఉపాధి కోల్పోయిన నిర్మాణ రంగ కూలీలను ప్రభుత్వం ఆదుకుంటుందని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ ప్రకటించారు. ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకున్న నిర్మాణ కూలీలకు తక్షణ సాయం కింద రూ.3 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. సోమవారం కూలీల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈ డబ్బును జమ చేస్తామని చెప్పారు. దీనికోసం రూ.96 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని ఓ ప్రకటనలో తెలిపారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వ గైడ్‌లైన్స్‌ను ఫాలో కావాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్మాణ రంగ కూలీలకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ విషమ పరిస్థితులలో అసంఘటిత రంగంలోని కార్మికులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరంలేదని అమరీందర్‌సింగ్ వారికిభరోసా ఇచ్చారు.



## బయటికొచ్చిన వాళ్లకు పూలతో విజ్ఞప్తి

### ఇంట్లోనే ఉండాలని ఢిల్లీ పోలీసుల సూచన

**న్యూఢిల్లీ:** జనతా కర్ఫ్యూ లో భాగంగా జనమంతా ఇంటికే పరిమితమైతే ఢిల్లీలో కొంతమంది మాత్రం రోడ్లపైకి వచ్చారు. ఇలా బయటికి వచ్చిన వారికి ఢిల్లీ పోలీసులు పువ్వులు ఇచ్చి, ఇంటికెళ్లాలని సూచించారు. ప్రధాని పిలుపుమేరకు జనతా కర్ఫ్యూ పాటించాలని కోరారు. కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వచ్ఛందంగా కర్ఫ్యూ పాటించాలని ప్రధాని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే ! దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఢిల్లీ పోలీసులు ట్విట్టర్లో ప్రచారం చేశారు. 'మీ సేఫ్టీ కోసం మేంరోడ్లపై ఉన్నాం.. మీరు మాత్రం ఇంట్లోనే ఉండండి. బైక్‌లపై తిరుగుతున్నవారికి పోలీసులు రోజా పువ్వు ఇచ్చి ఇంటికి వెళ్లాలని రెక్వెస్ట్ చేస్తున్నారు. ప్లీజ్ సహకరించండి' అంటూ ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ట్వీట్ చేశారు.



## మాకు షెల్టర్ కల్పించండి

### లండన్ లో ఇండియన్ హైకమిషన్ ను ఆశ్రయించిన స్టూడెంట్స్

**లండన్:** కరోనా వైరస్ కారణంగా బ్రిటన్ లో యూనివర్సిటీలు మూతపడటంతో ఇండియన్ స్టూడెంట్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు షెల్టర్ కల్పించాలని లండన్ లోని ఇండియన్ హైకమిషన్ ను ఆశ్రయించారు. ప్రస్తుతం ట్రావెల్ బ్యాన్ ఉన్నందున ప్రత్యేక విమానం ఏర్పాటు చేసి సొంత దేశానికి పంపాలని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి 19 మంది ఇండియన్ స్టూడెంట్లు లండన్ లోని ఇండియన్ హైకమిషన్‌కు చేరుకున్నారు. వీరిలో తెలంగాణ స్టూడెంట్స్ ఎక్కువగా ఉన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందుతుండటంతో బ్రిటన్ తోపాటు యూరప్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ఇండియా ట్రావెల్ బ్యాన్ విధించింది. దీంతో ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న స్టూడెంట్స్ అవస్థలు పడుతున్నారు. "59 మంది స్టూడెంట్స్ కు హెల్ప్ చేసేందుకు ప్రయత్నించాం. 40 మందికి వసతి కల్పించాం. 19 మంది మాత్రం నిరాకరించారు" అని లండన్ లోని ఇండియన్ ఒకరు చెప్పారు. "ఈ నెల 18 నుంచి 31 వరకు ట్రావెల్ బ్యాన్ ఉంది. ఫ్లైట్ సర్వీసులు బంద్ అయ్యాయి. వాళ్ల ప్రాణాలను పణంగా పెట్టలేం. హైకమిషన్ బిల్డింగ్ లోనే భోజనం ఏర్పాట్లు చేశాం, టెంపరరీ షెల్టర్ కల్పించాం" అని ఎంబసీ అధికారులు చెప్పారు. స్టూడెంట్ వీసా గడువు ముగిసిపోతోందని ఇండియాకు వెళ్లాలంటే ఫ్లైట్స్ క్యాన్సిల్ చేశారని చాలా మంది స్టూడెంట్స్ తమను సంప్రదించినట్లు తెలిపారు.

# పార్లమెంట్ నుంచి వాపస్ రండి

**న్యూఢిల్లీ/ ముంబై:**

కరోనా వ్యాప్తి ఆందోళనల నేపథ్యంలో తమ పార్టీ ఎంపీలను పార్లమెంటు నుంచి వాపస్ రావాలని తృణముల్ కాంగ్రెస్(టీఎంసీ) సూచించింది. సోమవారం(మార్చి 23) నుంచి సమావేశాలను రద్దు చేయాలని టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరిక్ ఓబ్రైన్ లోక్‌సభ, రాజ్యసభ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఆదివారం లెటర్ రాశారు. పార్లమెంటు సమావేశాలు రద్దు చేయాలని గత పదిరోజులుగా వీరంతా కోరుతున్నారు. ప్రజలు ఎక్కువగా గుమిగూడొద్దని.. సోషల్ డిస్టెన్స్ మెయింటెన్ చేయాలని, అలాగే 65 ఏండ్లు పైబడిన వారు మరింత జాగ్రత్తగా ఉండాలని ప్రధాన మంత్రి మోడీ స్వయంగా చెప్పారని ఓబ్రైన్ అన్నారు. రాజ్యసభలో 44 శాతం, లోక్‌సభలో 22 శాతం ఎంపీలు 65 ఏండ్లు పైబడిన వారున్నారన్నారు. ఇది ఒక్క ఎంపీలకు సంబంధించిందే కాదు.. పార్లమెంటు కాంప్లెక్స్‌కు ప్రతిరోజు వేలమంది వస్తుంటారు వారందరి క్షేమం దృష్ట్యా ఈ చర్యలు చేపట్టాలని కోరారు. టీఎంసీకి లోక్‌సభలో 22 మంది, రాజ్యసభలో 13 మంది ఎంపీలు ఉన్నారు.

**జనతా కర్ఫ్యూ వారం ముందే పెట్టాల్సింది: రౌత్**

కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ఆదివారం అనుసరించిన 'జనతా కర్ఫ్యూ'ను దేశం మొత్తం వారం రోజుల ముందే పాటించాల్సిందని శివసేన సీనియర్ నేత సంజయ్ రౌత్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థపై కరోనా ఎఫెక్ట్ దారుణంగా ఉందని.. కొన్నేండ్ల పాటు దీని ప్రభావం ఉంటుందన్నారు. మహమ్మారి వైరస్‌కు చెక్ పెట్టేందుకు ప్రధాని మోడీ ఇచ్చిన జనతా కర్ఫ్యూ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయన పిలుపుతో దేశవ్యాప్తంగా ప్రజలు ఇండ్లకే పరిమితయ్యారు. వీధులు, రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఎక్కడో ఒకటి తప్ప రోడ్లపై వెహికల్స్ ఏవీ కనిపించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి భిన్నమైన వ్యూస్ ఉంటే ఉండొచ్చు కానీ.. లాక్‌డౌన్ లాంటిది ముందే ప్రకటించాల్సిందన్నారు. ఇప్పుడు ప్రజలతో సంప్రదించి నిర్ణయాలు తీసుకునేంత టైమ్ లేదు. కొవిడ్ 19 మరింతగా విస్తరించకుండా నియంత్రించడానికి చైనాలా కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాలు కొన్ని ప్రభుత్వాలపై విమర్శలు చేస్తున్నాయని.. ఇది విమర్శలకు టైమ్ కాదని వారు రాజకీయాలు చేయడం మాని ప్రభుత్వానికి సపోర్ట్‌గా నిలవాలన్నారు. గతంలో విపత్కర పరిస్థితుల్లో కొంత కాలంపాటు ఆహార అలవాట్లను కట్టడి చేసుకొని దేశం ఆ ముప్పు నుంచి బయటపడిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇప్పుడు కూడా ఎక్కువ కాలంపాటు మనల్ని మనం కాపాడుకునేందుకు అన్నిరకాలుగా వినియోగం తగ్గించుకొవాలన్నారు.



- పార్టీ ఎంపీలకు టీఎంసీ సూచన
- పార్లమెంటు సమావేశాలు రద్దు చేయాలి: ఎంపీ డెరిక్ ఓబ్రైన్

## షాహీన్‌బాగ్ నిరసన స్పాట్‌లో పెట్రోల్ బాంబులు

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని షాహీన్ బాగ్ నిరసన స్పాట్ లో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి పెట్రోల్ బాంబు విసిరినట్లు పోలీసులు వెల్లడించారు. పెట్రోల్ నింపిన ఐదారు బాటిళ్లకు నిప్పంటించి విసిరి పారిపోయాడని తెలిపారు. జామియా మిలియా వర్సిటీ బయట నిరసన స్పాట్‌లోనూ ఇలాంటి ఘటనే జరిగిందని వర్సిటీ అధికారులు, స్టూడెంట్లు తెలిపారు. బైక్‌పై వచ్చిన దుండగుడు పెట్రోల్ బాంబు విసిరి, ఖాళీ ప్లేస్ లో రెండు రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ రెండు ఘటనలు నిమిషాల వ్యవధిలోనే జరిగాయని, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేస్తామని పోలీసులు చెప్పారు.



నిర్మానుష్యంగా హైటెక్ సిటీ ఏరియా

# జయహో జనతా..

## గ్రేటర్‌లో కరోనా కర్ఫ్యూ సక్సెస్

**రోజంతా ఇంటికే పరిమితమైన ప్రజలు**

**ఖాళీగా రోడ్లు, ఫ్లైఓవర్లు, మెయిన్ సర్కిళ్లు**

**పోలీసుల బందోబస్తు.. చౌరస్తాల్లో చెకింగ్‌లు**

కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు గ్రేటర్ జనమంతా ఒక్కటై సామాజిక బాధ్యతను చాటారు. రోజంతా ఇండ్లకే పరిమితమై యుద్ధ స్ఫూర్తితో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి జనతా కర్ఫ్యూను సక్సెస్ చేశారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. ఎక్కడికక్కడే రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఏ గల్లీలో చూసినా నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. సాయంత్రం 5 గంటలకు ఇండ్ల బయటకు వచ్చి ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు. గంటలు మోగించారు. ఎమర్జెన్సీ సేవల కోసం 5 ఆర్టీసీ బస్సులు , మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లు అందుబాటులో ఉన్నాయి. మూడు కమిషనరేట్ల పరిధిలోని పోలీస్ సిబ్బందిని మానిటరింగ్ చేస్తూ సీపీలు అంజనీకుమార్, సజ్జనార్, మహేశ్ భగవత్ పర్యవేక్షించారు. చెక్ పాయింట్స్ పెట్టి వాహనదారుల వివరాలు సేకరించారు. రోడ్లపై షికారుకు వచ్చిన యువత, మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సిటీ కమిషనరేట్ పరిధిలో 200లకు పైగా ఎంవీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి 12 వెహికల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కి చేరుకున్న సుమారు 250 మందిని సెట్విన్ బస్సుల్లో గమ్యస్థానాలకు చేర్చారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కి వచ్చే డొమెస్టిక్ ప్యాసింజర్స్ ను రిసీవ్ చేసుకునే వారిని తప్ప ఇతరులను రోడ్లపైకి అనుమతించలేదు.

- హైదరాబాద్/వెలుగు, నెట్‌వర్క్



ట్యాంక్ బండ్ ఏరియా ఇలా



బోసిపోయిన ఎల్బీ నగర్ క్రాస్ రోడ్స్



మహాత్మాగాంధీ బస్‌స్టేషన్



సికింద్రాబాద్‌లో క్లాప్స్ కొడుతున్న ఓ అపార్ట్‌మెంట్ వాసులు



జూబ్లీహిల్స్‌లో...



పెద్దఅంబర్‌పేట వద్ద ఖాళీగా కనిపిస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు



శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో క్లాప్స్



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్



## 80 కోట్ల బిజినెస్ బంద్

**సిటీలోని ప్రధాన మార్కెట్లన్నీ మూసివేత**

**హైదరాబాద్, వెలుగు:** జనతా కర్ఫ్యూకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఆదివారం ఇంటికే పరిమితమైపోగా, సిటీలోని ప్రధాన మార్కెట్లను కూడా మూసేశారు. కొత్త పేట ఫ్రూట్ మార్కెట్, మలక్ పేట గంజ్, అఫ్జల్ గంజ్, మోజంజాహీ మార్కెట్, మోండా మార్కెట్ లన్నీ స్తంభించాయి. ఒక్క రోజే దాదాపు 80 కోట్ల బిజినెస్ ఆగిపోయింది.

## కరోనా అనుమానిత యువతి కలకలం

**సికింద్రాబాద్, వెలుగు :** గుజరాత్‌నుంచి కాకినాడకు వెళ్లే భావ్‌నగర్‌ఎక్స్‌ప్రెస్‌రైల్‌లో కరోనా అనుమానిత యువతి ఉండడంతో ప్రయాణికుల్లో కలకలం రేపింది. ట్రైన్ ఆదివారం ఉదయం 10.10గంటలకు సికింద్రాబాద్ చేరుకుంది. హారిక అనే యువతి ఎస్-4 బోగీలో ఎక్కింది. తోటి ప్రయాణికులు ఆమె చేతికి క్వారంటైన్ స్టాంప్ ఉన్నట్లు గుర్తించి సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు చెప్పారు. అప్రమత్తమై ట్రైన్ నిలిపి ఆమె వివరాలు తెలుసుకున్నారు. యువతి దుబాయి నుంచి వస్తుండగా ఎయిర్‌పోర్ట్‌లో థర్మల్‌స్క్రీనింగ్ చేసి చేతికి క్వారంటైన్‌స్టాంపు వేసినట్లు ఆమె తెలిపింది. క్వారంటైన్‌లో ఉండాలంటూ కూకట్‌పల్లిలోని బంధువుల ఇంటికి పంపించారు. ఆమె ప్రయాణించిన బోగిని శానిటైజర్లతో శుభ్రం చేసిన అనంతరం రైలును పంపించారు.



## గాంధీలో మరిన్ని ఐసోలేషన్ వార్డులు

**27 నుంచి 239 బెడ్లకు పెంపు**

**రెండు రోజుల్లో అందుబాటులోకి..**

**పద్మారావునగర్, వెలుగు :** కరోనా అనుమానితుల తాకిడి పెరుగుతుండడంతో గాంధీ ఆస్పత్రిలో ఐసోలేషన్ వార్డులను పెంచనున్నారు. మొదటి వార్డులో 27 బెడ్లు ఉండేవి. ఆ తర్వాత 8వ ఫ్లోర్‌లో వంద ఐసోలేషన్ బెడ్లు ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ క్యాజువల్ వార్డులో 52 బెడ్లు ఉన్నాయి. గాంధీ మెయిన్ బిల్డింగ్‌లోని ఆరోగ్యశ్రీ, ఆర్థోపెడిక్ వార్డులను వేరే వార్డులోకి తరలించి అక్కడ 60 బెడ్లను ఏర్పాటు చేశారు. దాంతో మొత్తం 239 ఐసోలేషన్ బెడ్లు రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు గాంధీ సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ తెలిపారు. అటు కరోనా ప్రభావంతో పాటు ఇటు రక్త నిల్వలు తగ్గడంతో గాంధీ ఆస్పత్రిలో వివిధ రకాల ఆపరేషన్లు నిలిపివేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## రిజర్వేషన్ కౌంటర్లు, పార్శిల్ ఆఫీస్‌ల మూసివేత

**సికింద్రాబాద్, వెలుగు:** ఈ నెల 31 వరకు రైళ్లు రద్దు కారణంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని రిజర్వేషన్లు, రిజర్వేషన్ కౌంటర్లు, పార్శిల్ ఆఫీస్‌లను మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. యూటీఎస్ మొబైల్ యాప్ బుకింగ్‌లు కూడా నిలిపి వేశారు. ఇప్పటికే టికెట్లు బుక్‌చేసుకున్నవారికి జూన్ 21లో రీఫండ్ అవతాయని చెప్పారు.




## హోమ్ క్వారంటైన్‌పై నిఘా

**హైదరాబాద్, వెలుగు:** సిటీలో కరోనాను నియంత్రించేందుకు బల్దియా అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. 150 బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయి. మార్చి 1 నుంచి విదేశాల నుంచి నగరానికి వచ్చిన వారి జాబితాను కంట్రోల్ రూమ్‌కు ప్రభుత్వం పంపుతోంది. ఆ జాబితా ప్రకారం వారి ఇండ్లకు వార్డు స్థాయి బృందాలు వెళ్లి హోం క్వారంటైన్ స్టాంప్‌వేస్తున్నారు. 14 రోజుల పాటు హోమ్ క్వారంటైన్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

# డాక్టర్లు ఇట్ల ట్రీట్‌మెంట్ చేస్తున్నరు

## కరోనా పాజిటివ్ పేషెంట్లకు 'గాంధీ' వైద్య సిబ్బంది సేవలు



**పద్మారావునగర్, వెలుగు :** ప్రస్తుతం కరోనా భూతం ప్రతి ఒక్కరిని గజగజ వణికిస్తోంది. ఈ మహమ్మరి నుంచి తప్పించుకోవాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. అలాంటిది కరోనా సోకిన వ్యక్తి దగ్గరకు వెళ్లాలంటేనే ఎంత ధైర్యం కావాలి ! అయినా ప్రాణాలను ఫణంగా పెట్టి డాక్టర్లు, నర్సులు కరోనా సోకిన పేషెంట్లకు ట్రీట్ మెంట్ చేస్తున్నారు. వారి కృషికి దేశం మొత్తం సెల్యూట్ చేస్తోంది. కరోనా పాజిటివ్ వచ్చినోళ్లకి వైద్యం అందించాలంటే మాటలు కాదు. వారి దగ్గరికి వెళ్లాలంటే కేర్ ఫుల్ గా ఉండాలి. మన దగ్గర ఒక్క హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌లోనే కరోనా బాధితులకు చికిత్స అందిస్తున్నారు. అయితే పేషెంట్ల వద్దకు వెళ్లడానికి డాక్టర్లు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు, ఎంత మంది ట్రీట్ మెంట్ ఇస్తున్నారన్నది తెలుసుకుందాం.

**ఏడు రకాల ప్రొటెక్షన్స్**

కరోనా వార్డుకు వెళ్లే ముందు డాక్టర్లు, నర్సులు తలస్నానం చేస్తారు. పొడి దుస్తులతో పాటు పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ)ను ధరిస్తారు. అది డాక్టర్లు, నర్సులకు కరోనా సోకకుండా కాపాడుతుంది. క్యాప్, మాస్క్, అద్దాలు, పైజామా, గౌన్, గ్లౌజులు, లెగ్గిన్స్ ఇలా ఏడు రకాల ప్రొటెక్షన్స్ ఉంటాయి. తర్వాత పీపీఈలను స్పెషల్ లిక్విడ్ లో స్టెరిలైజ్ చేస్తారు. మరోసారి తలస్నానం చేస్తారు.

**డాక్టర్ల టీమ్**

కరోనా పేషెంట్లకు స్పెషల్ మెడికల్ టీమ్ సేవలు అందిస్తోంది. ఇందులో గాంధీ హాస్పిటల్‌సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ రాజారావు, పల్మనాలజీ హెచ్ఓడీ డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ ప్రమోద్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ మంగమ్మతోపాటు 30 మంది నర్సులు ఉన్నారు.

**ట్రీట్ మెంట్ ఇలా**

కరోనా పాజిటివ్‌పేషెంట్లను గంటకొకసారి అబ్జర్వ్ చేస్తారు. ఎప్పటికప్పుడు బీపీ, షుగర్ లెవల్స్ చెక్ చేస్తారు. రెస్పిరెటరీ ప్రాబ్లమ్స్ ఏమైనా ఉన్నట్లుగా అనిపిస్తే లంగ్స్ ను ఎక్స్ రే తీసి పరిశీలిస్తారు. ఐవీ ఫ్లూయిడ్స్, ఇంజక్షన్లు రెగ్యులర్ గా ఇస్తుంటారు. జర్వం ఉంటే పారాసిటమాల్, జలుబు, రన్నింగ్ నోస్ సమస్యలకు మందులు రెగ్యులర్ ఇస్తూ ట్రీట్మెంట్ చేస్తారు. కరోనాకు మందు లేకపోవడంతో పేషెంట్ కండిషన్ స్టేబుల్ గా ఉండేలా ఇమ్యూనిటీ పవర్ పెంచేలా జాగ్రత్తలు తీసుకుంటారు.

**ప్రికాషన్స్ తీసుకున్నా రిస్కే**

డాక్టర్లకు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా రిస్క్ తప్పదు. గతంలో ఇలాగే ఓ డాక్టర్ కు హెచ్ఐవీ సోకింది. మరో డాక్టర్ కు స్వైన్ ఫ్లూ వచ్చింది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఒక్కోసారి డాక్టర్లకు కూడా వైరస్ సోకే పరిస్థితి ఉంటుంది.

**40 రోజులకు సరిపడా..**

కరోనా పేషెంట్లకు 40 రోజుల పాటు ట్రీట్ మెంట్ ఇచ్చేందుకు కావాల్సిన ఎక్విప్ మెంట్ అంతా గాంధీలో సిద్ధంగా ఉంది. పేషెంట్ల సంఖ్య పెరిగినా సరే ట్రీట్ మెంట్ చేస్తామని డాక్టర్లు చెబుతున్నారు. కరోనా కిట్లు, శానిటైజర్స్, మాస్కులు, గ్లౌస్ లు, లెగ్గింగ్స్ ఇలా రానున్న 40 రోజులకు సంబంధించిన పరికరాలను రెడీగా ఉంచారు. అవసరాన్ని బట్టి ఎక్విప్ మెంట్ ను తెప్పిస్తామని డాక్టర్లు చెబుతున్నారు.

**లాంగ్వేజీ ప్రాబ్లమ్**

ప్రస్తుతం కరోనా పేషెంట్లలో ఇండోనేషియాకు చెందినవారు 8 మంది ఉన్నారు. వీరికి ఇంగ్లీష్, హిందీ రాదు. కేవలం అరబిక్‌లోనే మాట్లాడుతున్నారు. ఆ భాష తెలియక ట్రీట్ మెంట్ చేయడం కష్టంగా ఉందని డాక్టర్లు చెబుతున్నారు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది వీరితో సైగలతో మాట్లాడుతున్నారు.

**ల్యాబ్ లోనూ ఫుల్ కేర్**

టెస్ట్ లను గాంధీలోని వైరాలజీ ల్యాబ్ లోనే చేస్తున్నారు. పేషెంట్ కు ట్రీట్ మెంట్ టైమ్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో టెస్టింగ్ సమయంలో అంతకన్నా ఎక్కువ జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. ల్యాబ్ వద్దకు మిగతా ఎవరిని అనుమతించరు. అనుమానితుల నుంచి సేకరించిన శాంపిల్స్ ను అతి జాగ్రత్తగా ల్యాబ్ కు తీసుకొస్తారు. ఒక్కో టెస్ట్ కు కనీసం 5 నుంచి 7 గంటల సమయం పడుతుంది. పాజిటివ్ గా తేలిన కేసులను మరోసారి పరీక్షిస్తున్నారు. కిట్స్ లిమిట్ గా ఉండటం, టెస్ట్ లకు టైమ్ ఎక్కువగా తీసుకోవటంతో ట్రావెల్ హిస్టరీ, కరోనా లక్షణాలున్న వారినే టెస్ట్ చేస్తున్నారు.





సిద్దిపేటలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్లు

# గడప దాటలే..

నిర్మానుష్యంగా మారిన పట్టణాలు, పల్లెలు

చప్పట్లతో హెల్త్ సిబ్బందికి ప్రజల అభినందనలు

## జనతా కర్ఫ్యూ సక్సెస్

కరోనాపై యుద్ధానికి ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపునకు మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ ఉమ్మడి జిల్లాల ప్రజలు జైకొట్టారు. ఆదివారం నిర్వహించిన జనతా కర్ఫ్యూలో స్వచ్ఛందంగా పాల్గొని మద్దతు తెలిపారు. అత్యవసరం అయితే తప్ప ఇండ్ల నుంచి బయటికి రాలేదు. టీవీలు చూస్తూ, పిల్లలతో కలిసి ఆటలు ఆడుతూ గడిపారు. మంత్రులు ఎమ్మెల్యేలు సైతం ఇండ్లకే పరిమితం అయ్యారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లతో పాటు వ్యాపార వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, హోటళ్లు, పెట్రోల్ బంకులు మూత పడడంతో పల్లెలు, పట్టణాలు నిర్మానుష్యంగా కనిపించాయి. హైదరాబాద్ నుంచి ముంబాయి, విజయవాడ, బెంగళూరు వెళ్లే హైవేలు, టోల్‌ప్లాజాలు బోసిపోయాయి. కర్ఫ్యూను కలెక్టర్లు, ఎస్పీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రోడ్లపై ఎవరైనా వాహనదారులు కనిపిస్తే పోలీసులతో కౌన్సెలింగ్ ఇప్పించారు. అంతర్రాష్ట్ర సరిహద్దులను క్లోజ్ చేయడంతో లారీలు బోర్డర్ ఆవల కిలోమీటర్ల కొద్దీ నిలిచిపోయాయి. సాయంత్రం 5 గంటలకు ప్రజలతో పాటు మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు చప్పట్లు కొట్టి అత్యవసర సేవలు అందిస్తున్న వారిని అభినందించారు.

- వెలుగు నెట్‌వర్క్


మహబూబ్‌నగర్: అప్పన్నపల్లి దగ్గర నిర్మానుష్యంగా ఉన్న ఫ్లైఓవర్


నల్గొండలో ఖాళీగా కనిపిస్తున్న ప్రకాశం బజార్


సంగారెడ్డి: నిర్మానుష్యంగా మారిన బాంబే హైవే


మహబూబ్‌నగర్ : వెంకటేశ్వర కాలనీలోని వందన అపార్ట్‌మెంట్‌లో చప్పట్లు కొడుతున్న జనాలు


నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రోడ్


చౌటుప్పల్‌లో నిర్మానుష్యంగా మారిన హైదరాబాద్ - విజయవాడ హైవే


చౌటుప్పల్: ఖాళీగా కనిపిస్తున్న పంతంగి టోల్‌ప్లాజా


నల్గొండ డిపోలో నిలిచిపోయిన బస్సులు


మహబూబ్‌నగర్‌లో చప్పట్లు కొడుతున్న ఓ కుటుంబం


అలంపూర్: బోర్డర్‌లో వాహనాలను నిలిపేస్తున్న పోలీసులు


ప్రయాణికులు లేక వెలవెలబోతున్న దేవరకద్ర రైల్వే స్టేషన్


నల్గొండలో చప్పట్లు కొడుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులతో కలిసి చప్పట్లు కొడుతున్న మంత్రి హరీశ్‌రావు


సూర్యాపేటలోని తన ఇంట్లో పచ్చీస్ ఆడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులతో కలిసి చప్పట్లు కొడుతున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్


చప్పట్లు కొడుతున్న మెదక్ కలెక్టర్ ధర్మారెడ్డి


వనపర్తి: వ్యవసాయ క్షేత్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి


కృష్ణ మండలం తైరోడ్ చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ చేతన


నిర్మానుష్యంగా ఉన్న వరంగల్ నిట్ రోడ్డు



హన్మకొండలోని ఆర్టీసీ డిపోలో నిలిపిన బస్సులు


బోసిపోయిన మానుకోట రైల్వేస్టేషన్


నిర్మానుష్యంగా వర్ధన్నపేట మెయిన్‌రోడ్డు


వంట చేస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

# గడప దాటలే!

## జనతా కర్ఫ్యూ సక్సెస్ ● వరంగల్, ఖమ్మం జిల్లాల్లో స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు

**వెలుగు, నెట్‌వర్క్:**

జనతా కర్ఫ్యూ అద్భుత రీతిలో సక్సెస్ అయింది. ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం ప్రజలు స్వచ్ఛందంగా ఇండ్లలో ఉండిపోయారు. కరోనా వైరస్ నియంత్రణకు అహర్నిశలు శ్రమిస్తున్న వైద్య బృందానికి కృతజ్ఞతగా సాయంత్రం 5 గంటలకు ప్రజలు, ప్రముఖులు చప్పట్లు కొట్టారు. ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని తొమ్మిది డిపోల్లో దాదాపు 950 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల నుంచి నిత్యం రాకపోకలు సాగించే దాదాపు 170 రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భూపాలపల్లిలో 2వేల మంది పాల్గొనే పోచమ్మ బోనాల పండుగను భక్తులను ఒప్పించి పోలీసులు నిలిపివేశారు. భూపాలపల్లి ఏరియాలో 5వేల మందికి పైగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు ఇండ్ల వద్దే ఉండిపోయారు. ఫలితంగా గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మహాదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం వద్ద మహారాష్ట్ర, ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం వద్ద చత్తీస్ గఢ్ రాష్ట్ర సరిహద్దులను రాష్ట్ర ప్రభుత్వం మూసేసింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హైదరాబాద్‌లోని తమ తమ నివాసాలకే పరిమితమయ్యారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. భద్రాచలంలోకి ప్రవేశించే అన్ని జాతీయ, రాష్ట్ర రహదారులను పోలీసులు మూసివేశారు. భిక్షాటన చేసుకునే యాచకులకు పోలీసులు భోజనం ఏర్పాటు చేశారు. పాల్వంచ, అశ్వారావుపేట, భద్రాచలం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్ పోస్టుల వద్ద భారీగా వాహనాలు నిలిచాయి. సౌదీ నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండకు వచ్చిన ఓ వ్యక్తి ఇంటికి డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్‌వైద్యసిబ్బందితో వెళ్లి ఆరోగ్య పరిస్థితి ని తెలుసుకున్నారు. చంద్రుగొండ మండలం తిప్పనపల్లిలోని మసీదుకు ఉత్తరప్రదేశ్‌నుంచి వచ్చిన ఐదు కుటుంబాల ముస్లిం మత పెద్దలను అధికారులు స్వీయ గృహనిర్బంధం చేశారు. కొత్తగూడెంలో ఓ వ్యక్తికి కరోనా వైరస్ పాజిటీవ్ లక్షణాలున్నాయనే అనుమానంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. భద్రాద్రి జిల్లా ఇల్లందు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన 14మంది బెంగుళూరు పరిసర ప్రాంతాల్లో రైల్వే పనులకు ఇటీవల వెళ్లారు. కరోనా ఎఫెక్ట్‌తో భయపడి కాంట్రాక్టర్ వాళ్లను సొంతూరుకు పంపించారు. కాగా గ్రామస్తులు రాత్రి వారిని ఇండ్లకు రానివ్వలేదు. దీంతో అధికారులు స్పందించి సమీపంలోని ఆలయంలోనే బస ఏర్పాటు చేశారు. టేకులపల్లి మండలంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన దంపతులకు ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు.


జనతా కర్ఫ్యూతో నిర్మానుష్యంగా ఉన్న భూపాలపల్లి పట్టణం


పీహెచ్‌డీ ప్రిపరేషన్‌లో ములుగు ఎమ్మెల్యే సీతక్క


డాక్టర్లకు కృతజ్ఞతగా చప్పట్లు కొడుతున్న సీపీ రవీందర్ దంపతులు, పోలీసులు


భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి మసీదులో మత పెద్దలతో మాట్లాడుతున్న పోలీసులు


బయటికి రావొద్దని దండం పెడుతున్న పోలీస్


గేమ్ ఆడుతున్న బీజేపీ వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్


ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద...


భద్రాచలం పట్టణంలో యాచకులకు సీఐ వినోద్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను అందజేస్తున్న పోలీసులు


పేషెంట్లను చెకప్ చేస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య


డాక్టర్లకు కృతజ్ఞతగా చప్పట్లు కొడుతున్న మానుకోట కలెక్టర్ వీపీ గౌతమ్


హైదరాబాద్‌లో డాక్టర్లకు సంఘీభావంగా చప్పట్లు కొడుతున్న మంత్రి అజయ్ దంపతులు


ఢిల్లీలో డాక్టర్లకు సంఘీభావంగా చప్పట్లు కొడుతున్న ఎంపీ నామా దంపతులు


పాల్వంచలో ఇంటిముందు క్లాప్స్ కొడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుటుంబం


కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు


హన్మకొండలో మార్కెట్ వద్ద కడుతున్న ఫ్లెక్సీ


నిర్మానుష్యంగా మారిన జనగామ బస్టాండ్


దమ్మపేట మండలం గండుగుల పల్లిలో చప్పట్లు కొడుతున్న మాజీ మంత్రి తుమ్మల తదితరులు



జిల్లా ఆస్పత్రి ముందు చప్పట్లు కొడుతున్న కలెక్టర్ కర్ణన్, సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ఇతర పోలీస్ సిబ్బంది


పాపతో ఆడుకుంటున్న ములుగు జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్


కుటుంబ సభ్యులతో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి


టీవీ చూస్తున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని


ఇంట్లో టీవీ చూస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి


డాక్టర్లకు మద్దతుగా చప్పట్లు కొడుతున్న జనగామ కలెక్టర్ నిఖిల


దమ్మపేట మండలం తాటిసుబ్బన్నగూడెంలో చప్పట్లు కొడుతున్న ఎమ్మెల్యే ఫ్యామిలీ


ఖమ్మంలో చప్పట్లు కొడుతున్న పెద్దలు, పిల్లలు

## జనతా కర్ఫ్యూ







జనతా కర్ఫ్యూతో వెలవెలబోతున్న కరీంనగర్ బస్టాండ్ చౌరస్తా (ఇన్‌సెట్‌లో) క్లాక్ టవర్ సెంటర్

# గడప దాటలే..

## జనతా కర్ఫ్యూ సక్సెస్.. స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు

**వెలుగు, నెట్‌వర్క్ :** జనతా కర్ఫ్యూకు ప్రజల నుంచి అద్భుత స్పందన కనిపించింది. కరోనా మహమ్మారిని తరిమేందుకు ప్రధాని ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్లలోనే ఉండిపోయారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, పల్లెలనే తేడా లేకుండా రోడ్లన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. రైళ్లన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. బస్టాండ్లు ప్రయాణికులు లేక బోసిపోయాయి. సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. ఎన్టీపీసీకి సెలవులు ప్రకటించడంతో ఆ ప్రాంతమంతా వెలవెలబోయింది. మహారాష్ట్ర సరిహద్దుల్లో వాహనాలను ఆపేశారు. కాశీ నుంచి వచ్చిన టూరిస్టులు 42 మందిని పరీక్షల నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేశారు. కరీంనగర్‌లో కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో ప్రజలు గడప దాటలేదు. కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి, రామగుండం సీపీ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మంత్రి గంగుల కమలాకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ కుమార్ ఇళ్లలో కుటుంబసభ్యులతోనే గడిపారు. జగిత్యాల జిల్లాలో దుబాయి నుంచి వచ్చిన ఆరుగురిని సెల్ఫ్ క్వారంటైన్‌లో గడపాలని సూచించారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో ఓ వ్యక్తి అంత్యక్రియలు వాయిదా వేశారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామానికి చెందిన వ్యక్తి హోం క్వారంటైన్ నుంచి బయట తిరగడంతో కేసు నమోదు చేశారు. కరీంనగర్‌లో ఇండోనేషియా వారితో కలిసి తిరిగిన ఓ వ్యక్తిని శనివారం పట్టుకుని హాస్పిటల్‌కు తరలించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. 650 బస్సులు డిపోల్లోనే నిలిచిపోయాయి. మహారాష్ట్ర సరిహద్దులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను అధికారులు శనివారం రాత్రే మూసివేశారు. సాలూర చెక్‌పోస్టు వద్ద క్వారంటైన్ స్టాంప్ ఉన్న వ్యక్తిని గుర్తించి వెనక్కి పంపించారు. సీపీ కార్తికేయ, కలెక్టర్లు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సాయంత్రం 5 గంటలకు ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు, ప్రజలు డాక్టర్ల సేవలకు సంఘీభావంగా చప్పట్లు కొట్టారు.




ఆదిలాబాద్ నేషనల్ హైవే పై నిలిచిపోయిన వాహనాలు



కరీంనగర్‌లో చప్పట్లు కొడుతున్న మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు



ఆదిలాబాద్ మహారాష్ట్ర సరిహద్దులో వాహనాలు రాకపోవడంతో ఖాళీగా ఉన్న పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా



ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైళ్లు



పెద్దపల్లి మంచిర్యాల మధ్య ఖాళీగా కనిపిస్తున్న గోదావరి బ్రిడ్జి



జగిత్యాల క్లాక్ టవర్ సెంటర్..




కార్మికులు లేక బోసిపోయిన ఓసీపీ–2 ముఖద్వారం



సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి జరగకపోవడంతో నిలిచిపోయిన డంపర్లు



కరీంనగర్ బస్టాండ్‌లో నిలిచిపోయిన బస్సులు



జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో గర్భిణిని తరలిస్తున్న పోలీసులు



నిర్మానుష్యంగా మారిన పెద్దపల్లి రైల్వేస్టేషన్



బోధన్ డిపోలో నిలిచిపోయిన బస్సులు



ప్రయాణికులు లేక ఖాళీగా ఉన్న నిజామాబాద్ బస్టాండ్



హైదరాబాద్‌లో మనువడితో కలిసి చెట్లకు నీళ్లు పడుతున్న మంత్రి ఐకే రెడ్డి



చప్పట్లు కొడుతున్న ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు



నిర్మానుష్యంగా ఉన్న నిజామాబాద్ కిసాన్ గంజ్



కామారెడ్డిలో చప్పట్లు కొడుతున్న కలెక్టర్ శరత్, ఆఫీసర్లు



కర్ఫ్యూను పర్యవేక్షిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి



మహారాష్ట్ర సరిహద్దులోని మండగాడ వద్ద వాహనాలు నిలిపివేసిన ఆఫీసర్లు



నిర్మానుష్యంగా ఉన్న నిజామాబాద్ రైల్వేస్టేషన్ రోడ్డు



నిజామాబాద్‌లో పర్యటిస్తున్న పోలీస్ కమిషనర్ కార్తికేయ



బోసిపోయిన వేములవాడ ఆలయ పరిసరాలు

క్విక్ బైట్స్

## పెండ్లయిన వారం రోజులకే యువతి ఆత్మహత్య

### పెళ్లి కార్డుపైనే సూసైడ్ నోట్



మౌనిక

**సూర్యాపేట క్రైం, వెలుగు:** సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం చేస్తున్నానని, ఐదెకరాల భూమి ఉందని చెప్పాడు. పెళ్లయిన తర్వాత అవన్నీ అబద్ధాలని తేలడంతో నవ వధువు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన సూర్యాపేట పట్టణంలో ఆదివారం జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్ గ్రామానికి చెందిన సామ ఇంద్రారెడ్డి ప్రభుత్వ టీచర్. ఇద్దరు కూతుళ్లున్నారు. పెద్ద కూతురు మౌనిక(24) సీఏ పూర్తి చేసి మంచి వేతనంతో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు చెందిన సాయి కిరణ్‌రెడ్డికి ఇచ్చి ఈ నెల 15న సూర్యాపేటలో ఘనంగా వివాహం జరిపించారు. కట్నకానుకల కింద రూ. 10 లక్షల నగదు, సుమారు 35 తులాల బంగారం, 4 కేజీల వెండి అప్పజెప్పారు. వరుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడని, ఘట్‌కేసర్ దగ్గర 5 ఎకరాల భూమి ఉందని పెండ్లికి ముందు నమ్మించాడు. పెళ్లి కార్యక్రమాల తర్వాత ఇంద్రారెడ్డి దంపతులు కూతురిని చూడడానికి శనివారం హైదరాబాద్ వెళ్లారు. అక్కడి పరిస్థితిని చూసి ఆరా తీస్తే అతను ఎలాంటి ఉద్యోగం చేయడం లేదని తేలింది. భూమి విషయం కూడా అబద్ధం కావడంతో వరుడి బంధువులను నిలదీశారు. దీంతో వారు దాడికి పాల్పడడంతో పాటు 'మౌనికను ఇక్కడే పడి ఉండమను, లేదా విడాకులు తీసుకుని వెళ్లమను' అని గట్టిగా దబాయించారు. దాంతో కూతురిని తీసుకుని సాయంత్రం సూర్యాపేటలోని ఇంటికి చేరుకున్నారు. తనకు జరిగిన మోసం, మెట్టినింటి వారి ప్రవర్తనపై తీవ్రంగా కలత చెందిన మౌనిక, తన పెళ్లి కార్డుపైనే సూసైడ్ నోట్ రాసి, ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోండి

### మంత్రి, సీఎస్‌కు సూచించిన సీఎం

**హైదరాబాద్, వెలుగు:** యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ లను ఆదేశించారు. ఐకేపీ సెంటర్లు, పీఏసీఎస్ లు, మార్కెట్ కమిటీల ద్వారా గ్రామస్థాయిలోనే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. లక్ష టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఎఫ్‌సీఐ సిద్ధంగా ఉందని అన్నారు.

## జనతా కర్ఫ్యూ రోజున ట్యాక్స్‌ల వసూలు

### మున్సిపల్ తీరుపై ప్రజల ఆగ్రహం

**జనగామ అర్బన్, వెలుగు:** జనతా కర్ఫ్యూలోనూ జనగామ మున్సిపల్ సిబ్బంది ఆదివారం పన్నులు వసూలు చేయడానికి వచ్చారంటూ జనగామ బాలాజీనగర్ వాసులు అంటున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే అధికారుల ఆదేశాలంటూ బదులు ఇచ్చారని చెప్పారు. ఈ క్రమంలో బాలాజీనగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేయగా దురుసు సమాధానం వచ్చిందని వాపోయాడు. బాలాజీనగర్‌కు ఇటీవలే ఇటలీ నుంచి ఒకరు వచ్చారని, సిబ్బంది ఇంటింటికి తిరిగితే వైరస్ సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## అంత్యక్రియలూ ఆపేసిన్రు

**ఎల్కతుర్తి/మెట్‌పల్లి, వెలుగు:** జనతా కర్ఫ్యూతో అంత్యక్రియలను సైతం వాయిదా వేసుకున్నారు. వరంగల్ అర్బన్‌జిల్లా ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి కి చెందిన అంబీరు నాగయ్య(75) శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం జనతా కర్ఫ్యూ ఉందని తెలిసినా మృతదేహం కాబట్టి తమకు ఎలాంటి ఆటంకాలు రావనుకున్నారు. తీరా ఆదివారం ఉదయం అంత్యక్రియలకు సిద్ధమవుతుండగా డప్పు కొట్టేందుకు, గొయ్యి తీసేందుకు ఎవరూ ముందుకురాలేదు. దీంతో ఫ్రీజర్ ను తెప్పించి దాంట్లో మృతదేహాన్ని పెట్టారు. అంత్యక్రియలను సోమవారానికి వాయిదా వేసుకున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామానికి చెందిన పిడుగు చిన రాజాం(70) అనారోగ్యంతో ఆదివారం ఉదయం చనిపోయాడు. కర్ఫ్యూతో అంత్యక్రియలను సోమవారానికి వాయిదా వేశారు.

## క్వారంటైన్‌లో ఉండని ఆరుగురిపై కేసు

**కాజీపేట/దంతాలపల్లి, వెలుగు:** క్వారంటైన్‌లో ఉండని ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇండోనేషియా టూర్ కు వెళ్లి వస్తూ క్వారంటైన్ వార్డుకు వెళ్లకుండా రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ లో ప్రయాణించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన దంపతులపై కాజీపేట రైల్వే పోలీసులు ఎపిడమిక్ డిసీస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

**దాట్లలో నలుగురిపై కేసు**

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్లలో క్వారంటైన్ నిబంధనలు ఉల్లంఘించినందుకు నలుగురిపై కేసు నమోదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకకు చెందిన గుజి వేణుగోపాల్ ఖతర్ దేశం ఈ నెల 13న వచ్చాడు. సారపాక నుంచి దాట్లలోని అత్తగారింటికి 20న వచ్చాడు. విషయం తెలుసుకున్న దంతాలపల్లి రెస్క్యూ టీం గ్రామానికి వెళ్లి స్కీనింగ్ టెస్టులు చేసి హౌస్ క్వారంటైన్ చేశారు. కానీ వేణుగోపాల్ శనివారం రాత్రి ఆఫీసర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తిరిగి వెళ్లిపోయాడు. దీంతో అతనితో పాటు భార్య, అత్తామామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.



## పోలీస్ వాహనంలో గర్భిణి తరలింపు

**గంగాధర, వెలుగు :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని మధురానగర్‌కు చెందిన రజిత (20)కు ఆదివారం ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు స్థానిక పీహెచ్ సీకి తరలించారు. అక్కడి సిబ్బంది కరీంనగర్‌లోని మాతాశిశు ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆమెను కరీంనగర్ తరలించేందుకు కుటుంబ సభ్యులకు వాహనాలు దొరకలేదు. విషయం తెలుసుకున్న ఎస్సై తాండ్ర వివేక్, కానిస్టేబుల్ పరశురాం పోలీస్‌వాహనంలో తరలించారు. అక్కడ ఆమెకు పాప పుట్టింది.



**కరోనా అనుమానితుడు ఎక్కిండని బోగీకి శానిటేషన్**

కరోనా అనుమానితుడు ప్రయాణించిన సంపర్క్ క్రాంతి ఎక్స్ ప్రెస్ లోని బీ3 బోగీకి ఆదివారం కాజీపేట రైల్వే స్టేషన్ లో సిబ్బంది శానిటేషన్ చేశారు. కరోనా అనుమానితుడిని భువనగిరిలో రైలు నుంచి దింపారు. రైలు కాజీపేటకు వచ్చాక శానిటేషన్ చేసి బోగిని ఖాళీగా పంపించారు.

- కాజీపేట, వెలుగు

# చత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

# 17 మంది జవాన్లు మృతి

**భద్రాచలం/రాయ్‌పూర్, వెలుగు:**

చత్తీస్‌గఢ్ లోని దండకారణ్యంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 17 మంది జవాన్లు చనిపోయారు. మరో 15 మంది గాయపడగా.. అందులో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. మావోయిస్టులు వ్యూహాత్మకంగా వ్యవహరించి, భద్రతా బలగాలను దారి మళ్లించాయని.. చుట్టుముట్టి కాల్పులు జరిపాయని తెలిపారు. సుక్మా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్మాగూడ ప్రాంతంలో మావోయిస్టు నేత హిడ్మా ఆధ్వర్యంలో 300 మంది నక్సల్స్ సమావేశమయ్యారని చత్తీస్‌గఢ్ నిఘా వర్గాలకు సమాచారం అందింది. దాంతో దోర్నపాల్ పోలీస్‌స్టేషన్ నుంచి డీఆర్‌జీ, ఎస్టీఎఫ్‌లకు చెందిన 200 మంది, బుర్కపాల్ క్యాంపు నుంచి మరో 130 మంది సిబ్బందితో కూంబింగ్ చేపట్టారు. శనివారం మధ్యాహ్నం దాకా గాలించి తిరిగి క్యాంపులకు బయలుదేరారు. అయితే పోలీసు బలగాలను గుర్తించిన నక్సలైట్లు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, హెల్మెట్లు ధరించి కసల్ పాడు ప్రాంతంలోని కోర్జా గుట్టల పైనుంచి చుట్టుముట్టారు. ఇద్దరి మధ్య మధ్యాహ్నం 2.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఎదురుకాల్పులు కొనసాగాయి. ఈ సమయంలో చెల్లాచెదురైన భద్రతా బలగాలు క్యాంపులకు చేరుకున్నాయి. 14 మంది జవాన్లు గాయపడగా హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్‌లోని హాస్పిటల్‌కు తరలించారు. బలగాలు బయటకు వచ్చాక 17 మంది అడవిలో గల్లంతయ్యారని గుర్తించారు. నక్సల్స్ ఆపరేషన్స్ డీజీపీ అవస్థి, బస్తర్ ఐజీ సుందర్‌రాజు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం డ్రోన్ల తో ఘటన జరిగిన ప్రాంతం నుంచి 7 కి.మీ.ల దూరంలో పరిశీలించగా 17 మంది జవాన్ల మృతదేహాలు దొరికాయి. 12 మంది డీఆర్‌జీ, ఐదుగురు ఎస్టీఎఫ్ సిబ్బంది చనిపోయినట్లుగా ధ్రువీకరించారు. సుక్మాలో వారికి గార్డ్ ఆఫ్ ఆనర్ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 10 ఏకే47 తుపాకులతో పాటు ఆటోమెటిక్‌రైఫిల్స్, యుబిజీఎస్ ఆయుధాన్ని నక్సల్స్ ఎత్తుకెళ్లారు. ఎదురు కాల్పుల్లో ఐదుగురు నక్సల్స్ చనిపోయినట్లు సమాచారం. గాయపడ్డ జవాన్లను చత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ రాయ్‌పూర్ హాస్పిటల్‌లో పరామర్శించారు.



రాయ్‌పూర్ హాస్పిటల్‌లో గాయపడ్డ జవాన్‌ను పరామర్శిస్తున్న సీఎం భూపేశ్

- మరో 15 మందికి గాయాలు
- ఐదుగురు నక్సల్స్ మృతి



జవాన్ల మృతదేహాలు

**గతంలోనూ ..**

చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో నక్సల్స్‌దాడిలో గతంలోనూ పోలీసులు పదుల సంఖ్యలో మృతిచెందారు. 2018 ఏప్రిల్‌లో మావోయిస్టులు 34 మందిని ఎటాక్ చేసి చంపారు.

- 2 018 మార్చి 13న కిష్టారం వద్ద అంబుష్‌చేసి 9 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను చంపారు.
- 2017 ఏప్రిల్‌లో బుర్కపాల్ వద్ద 25 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను హతమార్చారు.
- 2010 ఏప్రిల్‌లో చింతలనార్ తాడ్‌మెట్ల వద్ద దారి కాచి డైరక్షనల్ మైన్స్ పేల్చి 76 మంది జవాన్లను చంపారు.
- 2014 మార్చి11న సుక్మా జిల్లా తోంగ్‌పాల్ వద్ద 16 మందిని కాల్చి చంపారు.
- 2008 జూన్‌లో ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో లాంచీపై ప్రయాణిస్తున్న గ్రేహౌండ్స్ బలగాలపై బాంబులు విసిరి 37 మంది ఉసురు తీశారు.
- 2007 మార్చి15న మావోయిస్టుల ప్రయోగాత్మక మొబైల్ దాడి ద్వారా రాణీబోద్లీ పోలీస్ అవుట్ పోస్టుపై దాడి చేసి 52 మందిని చంపి ఆయుధాలు ఎత్తుకెళ్లారు.

# కాజీపేటలో 80 పడకలతో ఐసోలేషన్ వార్డులు

**కాజీపేట, వెలుగు:** కాజీపేటలో కరోనా అనుమానితుల కోసం ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. రైల్వే ప్రయాణికులతో వ్యాప్తి చెందే ప్రమాదం ఉండడంతో ఎవరికైన కరోనా లక్షణాలు ఉంటే వారిని వెంటనే చికిత్స కోసం తరలించడం కోసం కాజీపేటలోని రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమ్యూనిటీ హాల్ ను ఐసోలేషన్ వార్డుగా మారుస్తున్నారు. ఈ మేరకు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ రవీంద్రశర్మ ఇటీవల కమ్యూనిటీ హాల్ ను పరిశీలించారు. ఐసోలేషన్ వార్డు ఏర్పాటు కోసం ప్రతిపాదించారు.

**మొత్తం మూడు...**

ఈ నెల 21న రాజధాని సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ లో క్వారంటైన్ కు తరలకుండా రైలులో ప్రయాణిస్తున్న ఇద్దరు భార్యభర్తలను గుర్తించారు. ఇక్కడ ఐసోలేషన్ వార్డు లేకపోవడంతో వారిని ఎంజీఎంకు, ఆ తర్వాత సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి పంపించాల్సి వచ్చింది. అలాగే ఆదివారం సంపర్క్ క్రాంతి ఎక్స్ ప్రెస్ లో వస్తున్న ఒక అనుమానితుడిని భువనగిరిలో దించాల్సి వచ్చింది. ఈ రెండు రోజుల్లోనే ముగ్గురు అనుమానితులు రైళ్లలో ప్రయాణించడంతో రైల్వే అధికారులు సాధ్యమైనంత త్వరగా ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వేపరంగా వైద్య సౌకర్యాలు కల్పించినట్లయితే వారిని ఇక్కడకు తరలించే అవకాశం ఉంది. కాజీపేట రైల్వే పాలీక్లినిక్ లో చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, ముగ్గురు డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది ఉన్నారు. ఐసోలేషన్ వార్డులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది సేవలను ఉపయోగించుకోనున్నారు. రైల్వే కమ్యూనిటీ హాల్లో 40 పడకలు, రైల్వే పాలీక్లినిక్ లో 20 పడకలు, రైల్వే డిస్పెన్సరీలో 20 పడకలతో మూడు ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేస్తున్నట్లు డీజిల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈ, ఐసోలేషన్ వార్డుల పర్యవేక్షకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 24 లేక 25వ తేదీ నుంచి ఈ ఐసోలేషన్ వార్డు అందుబాటులోకి రానుంది.



ఐసోలేషన్ వార్డుగా మారుస్తున్న రైల్వే కమ్యూనిటీ హాల్

- రైల్వే కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు
- రెండు మూడు రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం

## ఇంట్లో దూరి వృద్ధురాలి హత్య

**గంగాధర, వెలుగు:** ఇంట్లోకి చొరబడి వృద్ధురాలిని గొంతు కోసి హత్య చేసిన ఘటన కరీంనగర్‌జిల్లా గంగాధర మండలంలోని గట్టుభూత్కూర్‌లో జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంకణాల కౌసల్య అలియాస్ కంసవ్వ(80) భర్త చాలా ఏళ్ల క్రితం చనిపోయాడు. ఈమెకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉండగా కొడుకులిద్దరూ కొన్నేళ్ల క్రితం చనిపోయారు. దీంతో ఆమె గట్టుభూత్కూర్ లోని ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆదివారం జనతా కర్ఫ్యూ విధించడంతో గ్రామంలో ఇళ్లల్లోంచి ఎవరూ బయటకు రాలేదు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తి కౌసల్య ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కూరగాయలు కోసే పీటతో మెడ భాగంలో కోసి హతమార్చాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో వృద్ధురాలు హత్యకు గురైన విషయం పక్కింట్లో ఉండే మహిళ గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు కుటుంబసభ్యులు, చుట్టుపక్కలవారిని విచారించగా కౌసల్య వద్ద అప్పు తీసుకున్నవారే ఈ పని చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామంలోని సీసీటీవీ పుటేజీలను పోలీసులు పరిశీలించారు. గ్రామానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుంటామని సీపీ కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు.

# కౌన్సిలింగ్.. క్వారంటైన్

### ఫారిన్ నుంచి వచ్చినోళ్లకు అవగాహన కల్పిస్తున్న ఆఫీసర్లు

**వెలుగు నెట్‌వర్క్:** కరోనాపై జిల్లాల్లో ఆఫీసర్లు అప్రమత్తంగా ఉంటున్నారు. ఫారిన్‌నుంచి వచ్చిన వారి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. వారి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించడంతోపాటు క్వారంటైన్‌లో ఉండాలని సూచిస్తున్నారు. వరంగల్‌రూరల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ శివారు సాయిరెడ్డిపల్లికి వచ్చిన ఓ ఎన్‌ఆర్‌కి ఆదివారం రెవెన్యూ, పోలీస్, వైద్య అధికారులు క్వారంటైన్ హోం స్టాంపు వేశారు. ములుగు జిల్లా మంగపేట మండల నర్సింహసాగరానికి చెందిన దొమ్మాటి సతీష్‌సింగపూర్‌లో చదువుకుంటున్నాడు. ఈనెల 19న సింగపూర్‌నుంచి ఇండియాకు బయల్దేరి చెన్నై ఎయిర్‌పోర్టులో దిగాడు. అక్కడి ఆఫీసర్లు అన్నిరకాల పరీక్షలు చేసి కరోనా లక్షణాలు లేకపోవడంతో వెళ్లిపోవాలని చెప్పారు. సతీష్ భార్య సాయిరెడ్డిపెల్లిలోని అత్తగారి ఇంట్లో ఉండడంతో అతడు చెన్నై నుంచి నేరుగా శనివారం ఇక్కడకు వచ్చాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మహబూబ్ అలీ, పర్వతగిరి సీఐ కిషన్, ఎస్సై ప్రశాంత్ బాబు, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు సతీష్ వద్దకు వెళ్లి అతడి చేతికి స్టాంపింగ్ వేశారు. ఏప్రిల్ 5వరకు ఇంట్లో నుంచి బయటకు రావద్దని, సపరేట్ గదిలో ఉండి, సెల్ఫ్‌కంట్రోల్‌లో ఉండాలని పలు ఆరోగ్య సూచనలు చేశారు. యాదగిరి గుట్టలోనూ వివిధ ప్రాంతాల నుంచి 14 మందిని క్వారంటైన్‌లో ఉండాలని అధికారులు సూచించారు.

**తప్పించుకోబోతే పట్టుకుని..**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన హైమద్ బీన్ ఇమద్, ఫారుక్ బీన్ ఉబేద్ దుబాయ్‌నుంచి ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో శంషాబాద్‌ఎయిర్‌పోర్టులో దిగారు. జిల్లాకు చేరుకున్నీ వీరిని కర్ఫ్యూ గస్తీ లో ఉన్న రెబ్బెన ఎస్సై రమేష్ ఆపి వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులను తప్పించుకోవడానికి ప్రయత్నించడంతో వెంటనే అదుపులోకి తీసుకొని జిల్లా కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి కరోనా పరీక్షల కోసం తీసుకువచ్చారు. వీరికి వైరస్ కి సంబంధించిన లక్షణాలు లేకపోవడంతో 14 రోజుల పాటు ఇంట్లో క్వారంటైన్ ఉండాలని సూచించారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి ప్రాంతంలో ఆదివారం దుబాయ్ నుంచి వచ్చిన ఐదుగురికి మెట్ పల్లి సర్కార్ దవాఖానలో టెస్ట్ చేసి డాక్టర్లు, పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. 14 రోజులు క్వారంటైన్‌లో ఉండాలని చెప్పారు.

**పొలాల్లో నుంచి నడిచి బార్డర్ దాటిన్రు**

దుబాయ్ నుంచి వస్తున్న ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్‌జిల్లాకు చెందిన 16 మందిని తెలంగాణ సరిహద్దున ఉన్న బోధన్‌మండలం సాలూర చెక్‌పోస్ట్‌వద్ద ఆఫీసర్లు అడ్డుకున్నారు. దీంతో వారు ఆఫీసర్ల కళ్లుగప్పి పొలాల్లో నడుచుకుంటూ వచ్చి బార్డర్‌దాటారు. మెట్ పల్లి, మంచిర్యాల, నిర్మల్, బాల్కొండ ప్రాంతాలకు చెందిన 16 మంది ఆదివారం ఉదయం 4 గంటలకు ముంబై ఎయిర్‌పోర్ట్‌కు దుబాయ్ నుంచి వచ్చారు. అక్కడ ఆఫీసర్లు స్క్రీనింగ్ టెస్ట్ చేసి కరోనా లేదని నిర్ధారించారు. చేతిపై హోం క్వారంటైన్ ముద్ర వేసి, ట్రావెల్‌చేయడానికి అనుమతిపత్రం ఇచ్చారు. అక్కడి నుంచి వారు ప్రైవేటు వాహనం మాట్లాడుకుని తెలంగాణకు బయలుదేరారు. అయితే సాలూర చెక్ పోస్టు వద్ద వారిని ఆఫీసర్లు అడ్డుకున్నారు. ఎయిర్‌పోర్టులో ఆఫీసర్లు ఇచ్చిన సర్టిఫికెట్ చూపించినా తిరిగి వెళ్లాలని సూచించారు. దీంతో వారు అర కిలోమీటర్‌వెనక్కి వెళ్లి పొలాల ద్వారా నడుచుకుంటూ వచ్చి బార్డర్‌గ్రామాలకు చేరుకున్నారు. అక్కడి నుంచి వారి స్వగ్రామాలకు చేరుకున్నారు.



రెబ్బనలో దుబాయ్ నుంచి వచ్చిన వారిని ప్రశ్నిస్తున్న పోలీసులు



**టిఫిన్ సెంటర్ తెరిచిండని కేసు**

జనతా కర్ఫ్యూ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలు పాటించని వ్యక్తిపై కేసు నమోదు చేశారు. నిర్మల్‌జిల్లా బాసర మండల కేంద్రంలోని బిదిరెల్లి నివాసి సాయినాథ్ ఆదివారం తన టిఫిన్ సెంటర్‌తెరిచాడు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వుల ధిక్కరణ ఐపీసీ సెక్షన్188 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోదాడరాజు తెలిపారు.

**క్వారంటైన్ ఉండట్లే..**

జనగామ జిల్లా పాలకుర్తి మండలం వావిలాల గ్రామానికి చెందిన గూడెపల్లి కృష్ణ ఈ నెల 21 బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో దిగాడు. అతడికి అక్కడి డాక్టర్లు స్క్రీనింగ్ టెస్ట్ చేసి చేతిపై స్టాంపు వేసి పంపారు. అతడు ఏప్రిల్ 5 వరకు క్వారంటైన్‌లో ఉండాలి. కానీ స్థానిక రాజీవ్ చౌరస్తాలో విధుల్లో ఉన్న పోలీసులకు అతడు ఎదురుపడటంతో ఇంటికి వెళ్లి క్వారంటైన్‌లో ఉండాలని చెప్పారు.



మాస్కులు, శానిటైజర్ల
# రేట్లు తగ్గాయ్

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ ఆదేశాల మేరకు మేజర్ ఎఫ్ఎంసీజీ కంపెనీలు తమ శానిటైజర్ల రేట్లను తగ్గించాయి. దీంతో పాటు ప్రొడక్షన్‌ను కూడా పెంచుతామని ప్రకటించాయి. కాగా ప్రభుత్వం సర్జికల్ మాస్కులు, హ్యాండ్ శానిటైజర్లకు ఎంఆర్‌పీని శనివారం సెట్ చేసిన విషయం తెలిసిందే. హ్యాండ్ శానిటైజర్ల రేట్లను గురించి పట్టించుకోవడం లేదని, ప్రస్తుత విపత్కర పరిస్థితులలో దేశానికి అండగా ఉంటామని ఎఫ్ఎంసీజీలు ప్రకటించాయి. శానిటైజర్ తయారీ కంపెనీలు ఆర్‌బీ, హిందుస్తాన్ యూనిలీవర్, ఐటీసీ వంటి కంపెనీలు తమ శానిటైజర్ ప్రొడక్ట్‌లపై రేట్లను తగ్గించాయి.

**ఇకపై శానిటైజర్లు, మాస్కులకు ఏంఆర్‌పీ**

హ్యాండ్ శానిటైజర్లు, సర్జికల్ మాస్కుల( పీఎల్ వై మాస్కులు) ధరలకు ప్రభుత్వం శనివారం పరిమితులను విధించింది. 200 మి.లీ హ్యాండ్ శానిటైజర్ బాటిల్ రిటైల్ ధరను గరిష్టంగా రూ. 100గా నిర్ణయించింది. అదే 2 ప్లై సర్జికల్ మాస్కు గరిష్ట ధరను రూ. 8 గా, 3 ప్లై అయితే రూ. 10 గా నిర్ణయించింది. ఈ ధరలు జూన్ 30 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. వీటి తయారీలో వాడే మూల పదార్థాల ధరలను పరిగణనలోకి తీసుకొనే ధరలను నిర్ణయించామని కన్జూమర్ ఎఫైర్స్ మినిస్టర్ రామ్ విలాస్ పాశ్వాన్ ఓ స్టేట్‌మెంట్‌లో తెలిపారు. కరోనా వైరస్ విస్తరిస్తుండడంతో దేశంలో హ్యాండ్ శానిటైజర్లు, మాస్కులకు డిమాండ్ పెరగడంతో కొరత ఏర్పడుతోంది. పరిస్థితులను ఆసరగా చేసుకుని కొంత మంది మాస్కులు, శానిటైజర్ల రేట్లను అడ్డగోలు పెంచుతుండటంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. కాగా ఈ నెల ప్రారంభంలో హ్యాండ్ శానిటైజర్లు, మాస్కులను 'అత్యవసరమైన వస్తువులు' (ఎసెన్షియల్ కమోడిటీస్)గా ప్రభుత్వం గుర్తించింది. దీంతోపాటు హ్యాండ్ శానిటైజర్ల తయారీలో వాడే ఆల్కహాల్ ధరలకు కూడా ఈ నెల 19న పరిమితులు విధించింది.

బల్క్ డ్రగ్స్, మెడికల్ డివైసెస్‌కు
# ₹10 వేల కోట్లు
## ప్యాకేజ్ ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ :**

దేశంలో బల్క్ డ్రగ్స్, మెడికల్ డివైజెస్ ప్రొడక్షన్ పెంచేందుకు రూ. 13,760 కోట్ల ప్యాకేజ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం 4 స్కీములను తెస్తున్నట్లు వెల్లడించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో జరిగిన కేబినెట్ మీటింగ్ ఈ ప్యాకేజ్‌ను ఆమోదించింది. బల్క్ డ్రగ్స్ కోసం రూ. 9,940 కోట్లతో, మెడికల్ డివైసెస్ కోసం రూ. 3,820 కోట్లతో ప్యాకేజ్‌లను తయారు చేసినట్లు కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. రాబోయే 5 ఏళ్లలో బల్క్ డ్రగ్స్ పార్కుల ఏర్పాటు కోసం రూ. 3 వేల కోట్లతో మరో స్కీమునూ కేంద్ర కేబినెట్ ఆమోదించింది. అలాంటి పార్కులలో కామన్ ఫెసిలిటీస్‌కు ఈ

- మెడికల్ డివైసెస్‌కు మరో రూ. 3,820 కోట్లు
- దేశీయంగా ప్రొడక్షన్ పెంచేందుకే

డబ్బును వెచ్చిస్తారని మంత్రి చెప్పారు. క్రిటికల్ స్టార్టింగ్ మెటీరియల్ (కేఎస్ఎం), డ్రగ్ ఇంటర్మీడియెట్స్, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) ఉత్పత్తిని దేశంలో పెంచేందుకు రూ. 6,940 కోట్ల ప్యాకేజ్ సాయపడుతుందని మాండవీయ వెల్లడించారు. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) స్కీముగా దీనిని తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్కీము వల్ల రూ. 46,400 కోట్ల అదనపు అమ్మకాలు సాధ్యమవుతాయని, రాబోయే ఎనిమిదేళ్లలో చెప్పుకోగ్గ కొత్త ఉద్యోగాలు కూడా వస్తాయని మంత్రి చెప్పారు. రాష్ట్రాలతో కలిసి మూడు మెగా బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఒక్కో పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1,000 కోట్ల చొప్పున గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. 53 క్రిటికల్ బల్క్ డ్రగ్స్ తయారీదారులకు ఇంక్రిమెంటల్ సేల్స్‌పై ఇన్సెంటివ్‌ను కూడా చెల్లించనున్నారు. 2019-20 ని ఇందుకోసం బేస్ ఇయర్‌గా తీసుకుంటారు. ఈ ఇన్సెంటివ్స్‌ను ఆరేళ్లపాటు చెల్లించనున్నారు. ఈ బల్క్ డ్రగ్స్‌లో 26 ఫెర్మెంటేషన్ బేస్డ్ కాగా, 27 కెమికల్ సింథసిస్ డేస్డ్ బల్క్ డ్రగ్స్. ఫెర్మెంటేషన్ బేస్డ్ బల్క్ డ్రగ్స్‌కు ఇంక్రిమెంటల్ సేల్స్‌లో 20 శాతాన్ని, కెమికల్ సింథసిస్ బేస్డ్ బల్క్ డ్రగ్స్‌కు ఇంక్రిమెంటల్ సేల్స్‌లో 10 శాతాన్ని ఇన్సెంటివ్‌గా చెల్లిస్తారు. మరోవైపు, మెడికల్ డివైసెస్ పార్కుల ఏర్పాటుకు ఒక్కో పార్కుకు రూ. 100 కోట్ల చొప్పున రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా కేంద్రం ఇస్తుందని మాండవీయ తెలిపారు. దీంతో వచ్చే అయిదేళ్లలో మెడికల్ డివైసెస్ ఇండస్ట్రీ ప్రొడక్షన్ రూ. 68,437 కోట్లు పెరుగుతుందని, అదనంగా 33,750 ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో చైనా నుంచి బల్క్ డ్రగ్స్ దిగుమతులు నిలిచిపోయే ప్రమాదం కలగడంతో, భవిష్యత్‌లో అలాంటి ముప్పు లేకుండా తాజా ప్యాకేజ్‌లను రూపొందించారు. ఐతే, ఇప్పుడున్న కెపాసిటీని ముందు పూర్తిగా వినియోగించుకునేలా చొరవ తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. తాజా స్కీములో ఇంకా స్పష్టత లేదని, మరి కొన్ని వివరాలు తెలవాల్సి ఉందని ఐడీఎంఏ బల్క్‌డ్రగ్ కమిటీ హెడ్ యోగిన్ మజుందార్ తెలిపారు. ముందు ప్రస్తుతమున్న యూనిట్లలో ఉత్పత్తి పెంచాలి. ఆ తర్వాత దీర్ఘకాలిక ప్లాన్ కింద, మూడేళ్లలో పార్కులను నెలకొల్పాలని మజుందార్ అభిప్రాయపడ్డారు. కెపాసిటీలో 40 శాతాన్ని అసలు వినియోగించడం లేదని పేర్కొన్నారు. ఎన్విరాన్‌మెంట్ రెగ్యులేషన్స్‌లోనూ కొన్ని మార్పులు అవసరమని, బల్క్ డ్రగ్స్ పరిశ్రమలకు అనుమతులు తొందరగా వచ్చేలా చూడాలని తెలిపారు. పరిశ్రమ ప్రొడక్షన్ పెరగకుండా ప్రధానంగా అడ్డుపడుతున్నవి పొల్యూషన్ నిబంధనలేనని, ఈ ప్యాకేజ్‌ల ప్రకటనలో వాటి ప్రస్తావనే లేదని వ్యాఖ్యానించారు.



తాజా ప్యాకేజ్ ప్రకటనతో దేశంలో మెడికల్ డివైసెస్ ప్రొడక్షన్ పెరుగుతుందని ఆశిస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మాన్యుఫాక్చరర్స్ ఆఫ్ మెడికల్ డివైజెస్ కో ఆర్డినేటర్ రాజీవ్ నాథ్ తెలిపారు. మేకిన్ ఇండియాకు కొత్త ఊపు వస్తుందని అన్నారు. మెడికల్ డివైజెస్ అవసరాలలో 80-90 శాతం దిగుమతుల ద్వారానే నెరవేరుతున్నాయని, ఇందుకోసం రూ. 38,837 కోట్లను వెచ్చించాల్సి వస్తోందని వాపోయారు.







కరోనాతో మ్యూచువల్ ఫండ్స్
# నష్టపోతున్నాయి
## కేవలం నెలరోజుల్లోనే 26 శాతం నష్టం

**న్యూఢిల్లీ:** మ్యూచువల్ ఫండ్స్‌లలో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లు కరోనా దెబ్బతో భారీగా నష్టపోయారు. కేవలం నెల రోజుల్లోనే తమ ఇన్వెస్ట్‌మెంట్లలో 26 శాతం వరకు నష్టపోయారు. ముఖ్యంగా ఈక్విటీ ఫండ్ స్కీమ్‌లలో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లుకు నష్టాలు తప్పలేదు. కరోనా వైరస్ వలన గ్లోబల్ రెసిషన్ భయాలు, పతనమైన క్రూడ్ ఆయిల్ ధరలు, యెస్ బ్యాంక్ సంక్షోభం వంటి అంశాలు ఇండియన్ ఈక్విటీ మార్కెట్లను కకావికలం చేశాయి. దీంతో దేశంలోని మ్యూచువల్ ఫండ్ హౌస్‌లన్ని నష్టాలనే మూటకట్టుకున్నాయి. ఈ ఫండ్ హౌస్‌ల ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్(ఈఎల్ఎస్ఎస్), మిడ్‌క్యాప్, లార్జ్-మిడ్ క్యాప్, లార్జ్ క్యాప్, స్మాల్ క్యాప్, మల్టీక్యాప్ స్కీమ్‌లు భారీగా నష్టపోయాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 19 నుంచి మార్చి 18 మధ్య కాలంలో ఈ స్కీమ్‌లు 25-26 శాతం వరకు పతనమయ్యాయని మార్నింగ్ స్టార్ ఇండియా డేటా పేర్కొంది.

**ఎక్కువగా పడినవి**
**లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్ స్కీమ్‌లే..**

ఈ నెల రోజుల కాలంలో లార్జ్-మిడ్ క్యాప్ స్కీమ్‌లు 26.63 శాతం పతనమయ్యాయి. లార్జ్ క్యాప్(26.45 శాతం), ఈఎల్ఎస్ఎస్(26.47 శాతం), మల్టీ క్యాప్(26.45 శాతం), స్మాల్ క్యాప్(26.32 శాతం), మిడ్ క్యాప్(24.84 శాతం) స్కీమ్‌లు ఇన్వెస్టర్లకు అధికంగా నష్టాలను మిగిల్చాయి. కానీ ఈ స్కీమ్‌లు వాటి బెంచ్‌మార్క్ ఇండెక్స్‌ల కంటే తక్కువగానే నష్టపోవడం గమనార్హం. ఈ నెల రోజుల్లోనే సెన్సెక్స్ 30 శాతం పతనమై, 41,000 స్థాయి నుంచి 29,000 స్థాయికి పడిపోయింది. షార్ట్ టెర్మ్‌లో మార్కెట్లలో వోలటైలిటీ కొనసాగుతుందని, స్మాల్, మిడ్ క్యాప్ ఈక్విటీలపై ఒత్తిడి కొనసాగుతుందని ఐఫాస్ట్ ఫైనాన్షియల్ ఇండియా, సీనియర్ రీసెర్చ్ ఎనలిస్ట్ కృష్ణ కర్వా అన్నారు.

- మార్కెట్లు తక్కువ వాల్యుయేషన్ వద్ద ఉన్నాయి
- లాంగ్ టెర్మ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు రైట్ టైమ్: ఎనలిస్టులు

**ఇన్వెస్ట్ చేయడానికి ఇదే సరియైన సమయం..**

ప్రస్తుతం మార్కెట్లు తక్కువ వాల్యుయేషన్ వద్ద ఉన్నాయని, రిస్క్ తీసుకోవాలనుకునే వారికి ఇదే సరియైన సమయమని కర్వా అన్నారు. ఇన్వెస్టర్లు కనీసం 7-10 ఏళ్ల కోసం ఈక్విటీలలో ఇన్వెస్ట్ చేయాలని సలహాయిచ్చారు. మార్కెట్లు భారీగా పడడంతో, ఈక్విటీల వాల్యుయేషన్ ఆకర్షణీయంగా మారిందని తెలిపారు. మార్కెట్లు భారీగా నష్టపోవడాన్ని గతంలోనూ చూశామని మార్నింగ్ స్టార్ ఇండియా డైరక్టర్ కౌస్తుభ్ బెలపుర్కర్ అన్నారు. లాంగ్ టెర్మ్‌లో మార్కెట్లు తిరిగి కోలుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్వెస్టర్లు తమ ఇన్వెస్ట్‌మెంట్, సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల(ఎస్ఐపీ)ను కొనసాగించాలని కోరారు. రిస్క్ తీసుకోవాలనుకునే వారికి ఇదే సరియైన సమయమని అన్నారు. ఇన్వెస్టర్లు స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్స్‌లలో లాంగ్ టెర్మ్ కోసం ఇన్వెస్ట్ చేయాలని సలహాయిచ్చారు. తాజా మార్కెట్ల నష్టంతో లార్జ్ క్యాప్, బ్లూచిప్ ఫండ్స్ ఎసెట్ విలువ తగ్గిందని, కానీ ఈ స్టాకులు వేగంగా బౌన్స్ బ్యాక్ అవుతాయని అభిప్రాయపడ్డారు. క్వాలిటీ బిజినెస్, ఇండస్ట్రీ లీడర్లగా ఉన్న కంపెనీల షేర్లు మిగిలిన షేర్ల కంటే తొందరగా ఖరీదవుతాయని అన్నారు. ఈ స్టాకులలోకి తొందరగా ఇన్‌ఫ్లోలు వస్తాయని తెలిపారు.



పీఎంసీ బ్యాంక్‌పై ఆంక్షలు
# మరో 3 నెలలు

**న్యూఢిల్లీ:** పంజాబ్, మహారాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంక్(పీఎంసీ)పై విధించిన నియంత్రణలను మరో మూడు నెలల పాటు ఆర్‌బీఐ పొడిగించింది. ఈ బ్యాంకుపై ఆర్‌బీఐ నియంత్రణలు జూన్ 22, 2020 వరకు అమలులో ఉంటాయి. పీఎంసీ బ్యాంక్ రికవరీకి చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌బీఐ తెలిపింది. బ్యాంక్ రివైవల్ ప్లాన్‌ను ముందుకు తీసుకెళ్లాలంటే బ్యాంక్‌పై నియంత్రణలను పొడిగించడం అవసరమని పేర్కొంది. ఎన్‌పీఏలను దాచడంతో పీఎంసీ బ్యాంక్‌పై ఆరు నెలల పాటు నియంత్రణలను విధిస్తూ గతేడాది సెప్టెంబర్‌లో ఆర్‌బీఐ ఆదేశాలను జారీ చేసింది. ఆర్‌బీఐ నియంత్రణల వలన పీఎంసీ బ్యాంక్ డిపాజిటర్ల విత్‌డ్రాయల్స్ పై పరిమితులను విధించారు. అంతేకాకుండా ఆర్‌బీఐ అనుమతి లేకుండా పీఎంసీ బ్యాంకు ఎటువంటి లోన్లను రెన్యూ చేయడం లేదా కొత్తగా ఇవ్వడం గానీ చేయకూడదు. ఆర్‌బీఐ అనుమతి లేకుండా ఎటువంటి ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కూడా చేయకూడదు.



# బ్రోకర్లకూ వర్క్ ఫ్రమ్ హోమ్

**న్యూఢిల్లీ:** కరోనా కేసులు తగ్గేవరకు స్టాక్ బ్రోకర్లు ఇంటి నుంచే పనిచేయాలని బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు కోరాయి. ఈ మేరకు తాజాగా సర్క్యులర్లు జారీ చేశాయి. వ్యాధి పెరగకుండా అడ్డుకట్టవేయడానికి వచ్చే నెల 30 వరకు వర్క్ ఫ్రం హోమ్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించాయి. ఇండియాలో బ్రోకర్లకు ఇలాంటి సదుపాయం కల్పించడం ఇదే తొలిసారని మార్కెట్ ఎక్స్‌పర్టులు చెబుతున్నారు. పరిస్థితి మరింత విషమిస్తే వర్క్ ఫ్రమ్ గడువును ఇంకా పెంచే అవకాశాలూ ఉన్నాయి. ఇళ్ల నుంచే పని చేసుకునే వెసులుబాటును ఇవ్వాలని ట్రేడింగ్ మెంబర్లు ఇది వరకే కోరారు. ఎక్స్ఛేంజీకి రిపోర్ట్ చేయని ట్రేడింగ్ టెర్మినల్స్ నుంచి కూడా పనిచేసుకునే అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు తెలిపాయి. అయితే కొన్ని షరతులతో వర్క్ ఫ్రమ్ హోమ్ సదుపాయాన్ని కల్పిస్తారు. అనధికార ట్రేడింగ్‌కు అవకాశం లేకుండా ఇంటర్నల్ పాలసీని తయారు చేసుకోవాలి. అనుమతి కలిగిన యూజర్లందరి వివరాలను ఎక్స్ఛేంజీలకు ఇవ్వాలి. టెర్మినల్, సర్టిఫికెట్, ఆల్టర్నేటివ్ లొకేషన్ వంటి వివరాలనూ అందజేయాలి. అవసరాన్ని బట్టి కొత్త ఇంటర్నల్ పాలసీకి సీఈఓ/ సంబంధిత డైరెక్టర్/కాంప్లయన్స్ ఆఫీసర్/పార్ట్‌నర్/ప్రొప్రైటర్ అనుమతి ఉండాలి. ఇలాంటి టెర్మినల్స్‌ను పర్యవేక్షించే మెకానిజం మెంబర్లకు అందుబాటులో ఉంటుంది.

- సర్క్యులర్లు జారీ చేసిన ఎక్స్ఛేంజీలు
- కరోనా ఎఫెక్ట్ తగ్గించడానికే...
- ఇండియాలో మొదటిసారి

# ఇండియాలో మరిన్ని ఇన్వెస్ట్‌మెంట్లు

**న్యూఢిల్లీ:**

ఎదుగుదలకు అపార అవకాశాలు ఉన్న ఇండియా వంటి మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని ప్రపంచంలోనే అతిపెద్ద చమురు కంపెనీ సౌదీ ఆరామ్‌కో తెలిపింది. అందుకే ఇండియాలో డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్ట్‌మెంట్లపై దృష్టి పెడుతున్నామని తెలిపింది. విదేశీ కంపెనీలు ఇండియా కంపెనీ ద్వారా మరో ఇండియా కంపెనీలో ఇన్వెస్ట్ చేయడాన్ని డౌన్‌స్ట్రీమ్ ఇన్వెస్‌మెంట్ అంటారు. అందుకే రిలయన్స్ ఇండస్ట్రీస్ పెట్రోకెమికల్స్ బిజినెస్‌లో 20 శాతం వాటా కోసం 75 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నట్టు కంపెనీ తన ఆన్యువల్ రిపోర్టులో పేర్కొంది. దీని ప్రకారం.. క్రూడాయిల్ దిగుమతులపై ఆధారపడే దేశాల్లో పెట్టుబడులకు సౌదీ ఆరామ్‌కో ప్రాధాన్యం ఇస్తుంది. అత్యంత వేగంగా ఎదుగుతున్న ఇండియాలో ఇంధనం వాడకం ఏటా ఐదుశాతం వరకు పెరుగుతోంది. తన ఆయిల్ అవసరాల్లో 83 శాతం దిగుమతులు ద్వారానే తీరుతున్నాయి. ఇండియాకు అత్యధికంగా క్రూడాయిల్ సరఫరా చేస్తున్న దేశాల్లో సౌదీది రెండోస్థానం. ఇండియాతోపాటు చైనా, కొరియా, జపాన్, సౌత్ ఈస్ట్ ఆసియా, అమెరికా వంటి దేశాలపై ఎక్కువగా దృష్టి సారిస్తామని ఈ కంపెనీ తెలిపింది. అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ సెగ్మెంట్లను అనుసంధానం చేసి మరింత చౌకగా రిఫైనరీలకు క్రూడాయిల్ అందిస్తాని పేర్కొంది. సౌదీ ఆరామ్‌కోకు 20 శాతం వాటాను అమ్ముతామని రిలయన్స్ అధిపతి ముకేశ్ అంబానీ గత ఆగస్టులోనే ప్రకటించారు. పెట్రో రిటైలింగ్ బిజినెస్‌లో 49 శాతం వాటాను రూ.ఏడు వేల కోట్లకు బ్రిటిష్ పెట్రోలియం కంపెనీకి అమ్మేశారు. ఇదిలా ఉంటే రిలయన్స్‌లో వాటాల కొనుగోలుపై ఇప్పటికీ సౌదీ ఆరామ్‌కో సంప్రదింపులు జరుపుతోందని మోర్గన్ స్టాన్లీ మూడు రోజుల క్రితం తెలిపింది. ఎవాల్యుయేషన్ పని పూర్తి కాగానే అప్రూవల్స్‌కు దరఖాస్తు చేస్తుందని తెలిపింది. రిలయన్స్‌తో ఆగస్టులో కుదిరిన ఒప్పందం ప్రకారం సౌదీ ఆరామ్‌కో జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌కు రోజుకు ఐదు లక్షల బ్యారళ్ల క్రూడాయిల్ సరఫరా చేస్తుంది.




- ఇక్కడి మార్కెట్లో బోలెడు అవకాశాలు
- సౌదీ ఆరామ్‌కో ప్రకటన



ప్రొడక్షన్ ఆపేసిన
# హీరో మోటోకార్ప్, ఫియెట్

**న్యూఢిల్లీ:** దేశంలోని అతి పెద్ద టూవీలర్ తయారీదారైన హీరో మోటోకార్ప్ తన అన్ని ప్లాంట్లలోనూ ప్రొడక్షన్ ఆపేస్తున్నట్లు ప్రకటించింది. కరోనా నుంచి ఉద్యోగులను కాపాడే దిశలో గ్లోబల్‌గా తయారీ యూనిట్లన్నింటిలోనూ మార్చి 31 దాకా ఉత్పత్తి నిలిపేస్తున్నామని ఆదివారం వెల్లడించింది. మరో ఆటోమొబైల్ కంపెనీ ఫియెట్ కూడా ఇండియాలో ప్రొడక్షన్‌ను ఈ నెలాఖరు దాకా ఆపేస్తోంది. ఇండియా, కొలంబియా, బంగ్లాదేశ్‌లలోని తయారీ యూనిట్లతోపాటు, గ్లోబల్ పార్ట్స్ సెంటర్ (జీబీసీ)ని కూడా నిలిపి వేస్తున్నట్లు హీరో మోటోకార్ప్ తెలిపింది. సెంటర్ ఆఫ్ ఇనొవేషన్ అండ్ టెక్నాలజీ (జైపూర్-రాజస్థాన్) సహా కంపెనీలోని ఉద్యోగులందరినీ ఇంటి నుంచే పనిచేయాలని చెప్పినట్లు పేర్కొంది.

ఫ్లోర్ ప్రైస్‌పై వెంటనే
# చర్చ జరగాలి

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ వల్ల కంపెనీలన్నీ ఆన్‌లైన్‌లో పనిచేస్తున్నాయని, ఫ్లోర్‌ప్రైజ్ సమస్యలపైనా ఆన్‌లైన్‌లో చర్చించాలని సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) కోరింది. అయితే టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) వర్గాలు మాత్రం ఈ ప్రపోజల్ సాధ్యం కాదని పేర్కొన్నాయి. సరైన సమయంలో కస్టమర్ సమక్షంలో ఈ విషయంపై చర్చించాలని, హడావుడిగా చేయడం సాధ్యం కాదని చెబుతున్నాయి. టెలికం సేవలకు ప్రభుత్వం నిర్ణయించే చార్జీలను ఫ్లోర్‌ప్రైస్ అంటారు. ఫ్లోర్ ప్రైస్‌పై కామెంట్లను, కౌంటర్ కామెంట్లను ట్రాయ్ స్టడీ చేస్తోందని సీనియర్ ఆఫీసర్లు కొందరు చెప్పారు.

| నెక్ గుడ్ల ధరలు (100కు) | ఫామ్‌గేట్ | డజన్‌కు |
|---|---|---|
| హైదరాబాద్ | ₹210 | ₹40 |
| వరంగల్ | ₹213 | ₹40 |

# మీ పాలసీకి కరోనా కవరేజ్ ఉందా?

**న్యూఢిల్లీ:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా కరోనా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ఇండియాలో ఆదివారం ఉదయం నాటికి కరోనా కేసుల సంఖ్య 324కు చేరింది. ప్రతి ఒక్కరూ ఈ మహమ్మారి గురించి భయపడుతున్నారు. ఇంతకీ మన ఇన్సూరెన్స్ పాలసీలు, ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు కరోనా చికిత్సకు కవరేజీకి ఇస్తాయా లేదా అన్నది ఇప్పుడు అందరూ చర్చించుకుంటున్న విషయం. దీంతో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏ) ఈ విషయమై గతవారం సర్క్యులర్ ఇచ్చింది. తమ ఇన్సూరెన్స్ పాలసీల్లో కరోనాకూ కవరేజీ ఇచ్చే ఇన్సూరర్స్ ఇలాంటి బీమా క్లెయిములను త్వరగా పరిష్కరించాలని ఆదేశించింది. కరోనా క్లెయిమ్స్‌ను తిరస్కరించడానికి ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని సూచించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా కరోనాను మహమ్మారిగా ప్రకటించడంతో జనంలో ఆందోళన ఇంకా ఎక్కువయింది.

**మేం ఆదుకుంటాం...**

కరోనా విషయంలో పాలసీహోల్డర్లకు వీలైనంత సాయం చేస్తామని ఎస్‌బీఐ జనరల్, ఎడల్‌వీస్ జనరల్, సిగ్నా మణిపాల్, బజాజ్ అలియాంజ్ వంటి ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రకటించాయి. కరోనా ట్రీట్‌మెంట్ ఖర్చులను భరిస్తామని, క్వారంటైన్ ట్రీట్‌మెంట్ ఖర్చులనూ క్లెయిమ్ చేసుకోవచ్చని తెలిపాయి. అయితే కరోనాను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్యాండెమిక్‌గా (ప్రపంచవ్యాప్త వ్యాధి) ప్రకటించడంతో ఎన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు దీనికి కవరేజ్ ఇస్తాయనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతానికి మెజారిటీ కంపెనీలు కరోనా ట్రీట్‌మెంట్ ఖర్చులను భరిస్తామని చెబుతున్నా, కేసులు పెరిగి, పరిస్థితి విషమిస్తే మాత్రం వెనకడుగు వేసే అవకాశాలు ఉంటాయి. కేసులు పెరిగే కొద్దీ ట్రీట్‌మెంట్, టెస్టుల ఖర్చు ఎక్కువ అవుతుంది. ఎక్కువ మంది క్లెయిమ్ చేసుకుంటే కంపెనీలకు నష్టాలు పెరుగుతాయి.




**డిజిట్ నుంచి ప్రత్యేక పాలసీ**

అయితే కొత్తగా ఏర్పడ్డ డిజిట్ ఇన్సూరెన్స్ వంటి కంపెనీలు మాత్రం కరోనాకు పాలసీలు ఇస్తున్నాయి. డిజిట్ అనే ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ సర్వీస్ ప్రొవైడర్ తొలిసారిగా 'హెల్త్ కేర్ ప్లస్ పాలసీ' పేరుతో కరోనా ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. 75 ఏళ్లలోపు వయసున్న వారు ఎవరైనా ఈ పాలసీని తీసుకోవచ్చు. ప్రీమియాన్ని బట్టి బీమా కవరేజీ రూ.25 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది. రూ.రెండు లక్షల కవరేజీ కావాలనుకుంటే రూ.2,392+జీఎస్టీ కట్టాలి. ట్రీట్‌మెంట్‌కు పూర్తి ఖర్చులు చెల్లిస్తారు. క్వారంటైన్ చికిత్సకు మాత్రం సగం భరిస్తారు. అయితే బాధితుడు కనీసం 14 రోజుల్లో క్వారంటైన్‌లో ఉండి, ప్రభుత్వ లేదా మిలిటరీ ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలి. ఈ పాలసీలో ఒకటి కంటే ఎక్కువ మంది పేర్లను చేర్చవచ్చు. వారి సంఖ్యను బట్టి బీమా ప్రీమియం పెరుగుతుంది. ఇంతకు ముందు ఉన్న వ్యాధులకు ఈ పాలసీ వర్తించదు. పాలసీ కొన్నాక 15 రోజుల తరువాత వచ్చే వ్యాధులకే బీమా ఉంటుంది. గత నాలుగు వారాల నుంచి తీవ్రమైన దగ్గు, శ్వాస సమస్యలు ఉన్నవారు పాలసీ కొనడానికి అర్హులు కారు. పాలసీ వ్యాలిడిటీ ఏడాది ఉంటుంది. దీనిని పొడగించుకోవడం కుదరదు.

**తెలుసుకోవాల్సినవి..**

- కరోనాకు కవరేజీ ఉన్నదీ లేనిదీ మీ ఇన్సూరెన్స్ కంపెనీని అడిగి తెలుసుకోవాలి.
- కొన్ని కంపెనీలు కరోనా కోసం ప్రత్యేకంగా పాలసీలు ఇస్తున్నాయి.
- చాలా కంపెనీలు కరోనాకు కవరేజీ ఇస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఎక్కువ షరతులు పెడుతున్నాయి.



నోట్లు లెక్కెట్టినా..
# చేతులు కడుక్కోండి

**ముంబై:** డబ్బుల నోట్లను తాకిన లేదా లెక్కపెట్టిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఇండియన్ బ్యాంక్స్ అసోషియేషన్(ఐబీఏ) ప్రజలను కోరుతోంది. దీంతోపాటు బ్యాంక్ బ్రాంచులను విజిట్ చేయడం కంటే ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ సేవలను వాడాలని సలహాయిచ్చింది. నోట్లను ఫిజికల్‌గా తాకితే కనీసం 20 సెకండ్ల పాటు చేతులను కడుక్కోవాలని ఐబీఏ ప్రజలను కోరింది. కాగా ఈ అసోషియేషన్ 'కరోనా సే డరో న, డిజిటల్ కరో న' అనే క్యాంపెయిన్ ప్రారంభించింది. కస్టమర్లకు అంతరాయం లేని ఆన్‌లైన్ బ్యాంకింగ్ సర్వీసులను బ్యాంకులు అందిస్తాయని తెలిపింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ వంటి బ్యాంకింగ్ సర్వీసులన్ని అందుబాటులో ఉంటాయని పేర్కొంది.



నలభయ్యేళ్ల క్రితం.. సరిగ్గా ఇదే రోజు..
ఒక తెలుగు సినిమా విడుదలయ్యింది.
అది మామూలు సినిమా కాదు. సరదాగా తీసిన చిత్రం అంతకన్నా కాదు.
అది నాటి తెలంగాణ పరిస్థితుల్ని కళ్లకు కట్టింది.
సాయుధ రైతాంగ పోరాటానికి ప్రతిబింబమై నిలిచింది.
తెలుగు సినీ చరిత్రలో తనకంటూ ఓ పేజీని లిఖించుకుంది.
అదే.. మా భూమి.

# మన కథ మన నేల కథ

# మా భూమి

మా భూమి.. ఇది మన సినిమా అని ప్రతి తెలుగువాడూ గొప్పగా చెప్పుకునే చిత్రం. 1930 – 1948 ప్రాంతంలో.. హైదరాబాద్ నిజాంకి వ్యతిరేకంగా జరిగిన సాయుధ రైతాంగ పోరాట చరిత్రతో పాటు.. నాటి తెలంగాణ పల్లె జీవితాన్ని ప్రతిబించించిన సినిమా ఇది. కిషన్ చందర్ రాసిన 'జబ్ ఖేత్ జాగే' అనే నవల ఆధారంగా తెరకెక్కినా.. తెలంగాణ నేటివిటీకి తగ్గట్టుగా మార్పులు సంతరించుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాటి భాష, యాస, జీవన విధానం అన్నింటినీ ఎంతో అందంగా చూపించింది. అందుకే ఇప్పటికీ ఈ సినిమా గుర్తుండిపోయింది. గొప్ప సినిమా అంటూ కీర్తిని అందుకుంటోంది.

## ఏమిటా కథ?

నల్గొండ జిల్లాలో సిరిపురం అనే ఊరు. అక్కడ ఓ బీద రైతు కూలీ వీరయ్య (కాకరాల). అతని కొడుకు రామయ్య (సాయిచంద్). ఇతడే హీరో. పదో యేటే జగన్నాథరెడ్డి అనే భూస్వామి దగ్గర పశువులు మేపే పనిలో చేరతాడు రామయ్య. పెద్దయ్యాక చంద్రిని ప్రేమిస్తాడు. కానీ ఆమె జమిందారు వాంఛకి బలైపోతుంది. దాంతో మనసు చెదిరిన రామయ్య పట్నం వెళ్లిపోతాడు. అక్కడ పని చేసుకుంటూ యూనియన్ నాయకుల దగ్గర చాలా విషయాలు తెలుసుకుంటాడు. తిరిగి ఊరికెళ్లి జమిందారుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి నాయకుడవుతాడు. దాంతో భూస్వామ్య వ్యవస్థ పునాదులు కదులుతాయి. అందరూ ఆ ప్రాంతం వదిలి పారిపోతారు. నిజాం లొంగిపోతాడు. కానీ భూమి మీద హక్కు మాత్రం ఊరి ప్రజలకు దక్కదు. దాంతో పోరాటం ఇంకా కొనసాగుతుంది. పోరాడి పోరాడి చివరికి పోలీసు కాల్పుల్లో రామయ్య కన్నుమూస్తాడు. సింపుల్‌గా చెప్పుకుంటే ఇంతే కథ. కానీ ఈ కథ కొందరి కల. దాన్ని తెరకెక్కించడానికి వాళ్లు చేసిన కృషి ఒక చరిత్ర.

### అలా మొదలైంది..

'మా భూమి' 1980లో విడుదలైంది. కానీ దాని నిర్మాణ ప్రయత్నాలు 1977లోనే మొదలయ్యాయి. మృణాల్‌సేన్‌తో 'ఒక ఊరి కథ' నిర్మించిన రవీంద్రనాథ్.. ప్రముఖ ఆర్టిస్టు, ఎన్నో నాటకాలకు సూత్రధారి అయిన బి.నర్సింగరావు కలిసి ఒక సినిమా తీయాలనుకున్నారు. అదీ మృణాల్ దర్శకత్వంలోనే. కానీ వీరు చెప్పిన బడ్జెట్‌లో సినిమా తీయలేనన్నారాయన. అంతగా కావాలంటే మరో బెంగాలీ దర్శకుడు గౌతమ్ ఘోష్‌ని అడగమని సూచించారు. దాంతో ఇద్దరూ ఆయన్ని కలిశారు. ఆయన ఒప్పుకున్నారు. కథేమిటా అని ఆలోచిస్తున్నప్పుడు 'జైత్రయాత్ర' పేరుతో తెలుగులోకి అనువాదమైన 'జబ్ ఖేత్ జాగే' నవల స్ఫురించింది. దాని ఆధారంగా స్క్రీన్ ప్లే రాసుకుని హైదరాబాద్ వచ్చారు గౌతమ్. కానీ అది నిర్మాతలకు అంతగా నచ్చలేదు. కొన్ని విషయాలు అశాస్త్రీయంగా అనిపించడంతో దాన్ని పక్కనపెట్టి సాయుధ పోరాటం గురించి రీసెర్చ్ మొదలెట్టారు. తెలంగాణలో సాయుధ పోరాటం జరిగిన కొన్ని ప్రాంతాలు తిరిగారు. పోరాటంలో పాల్గొన్నవారితో మాట్లాడారు. లైబ్రరీల్లో ప్రముఖ పత్రికలన్నీ తిరగేశారు. ఫొటోలు కలెక్ట్ చేశారు. సమాచార సేకరణ పూర్తయ్యాక ఫైనల్ స్క్రిప్టును సిద్ధం చేసుకున్నారు. కథ రెడీ.. ఇక నటీనటులు కావాలి.



### ఏంటి గొప్ప!

ఒక సినిమా గొప్పదని ఎలా చెబుతాం? నటీనటుల నటన చూశా? టెక్నికల్ అంశాలు చూశా? కంటెంట్ వేల్యూ చూశా? ఏ ఒక్కటో కాదు.. ఇవన్నీ పర్‌ఫెక్ట్‌గా కుదరడం వల్లే 'మా భూమి' మరపురాని సినిమా అయ్యిందని నిస్సందేహంగా చెప్పొచ్చు. నర్సింగరావు తీసిన సినిమాలు చూస్తే ఒక విషయం అర్థమవుతుంది. ఆయన నేల విడిచి సాము చేయడు. ఒక మనిషి ఎలా ప్రవర్తిస్తాడు, పరిస్థితులకి ఎలా స్పందిస్తాడు, అసలు అతడు నివసిస్తున్న కాలమాన పరిస్థితులేమిటి, అవి ఎలా ఉంటాయి అనేది అత్యంత సహజసిద్ధంగా కళ్లకు కట్టడం ఆయన నైజం. ఆయన అభిరుచి.. మరో నిర్మాత రవీంద్ర, దర్శకుడు గౌతమ్‌ల అభిరుచి కూడా ఒకటే కావడంతో ఈ సినిమా అనుకున్న విధంగా వచ్చింది. నాటి సమకాలీన చరిత్రకు సెల్యులాయిడ్ రూపం ఇవ్వడంలో ఈ టీమ్ పూర్తిగా సక్సెస్ అయ్యింది. ప్రజల కట్టు, బొట్టు, అలవాట్లు, ఆహార్యం, మాట తీరుతో పాటు పీర్ల పండుగ, పోచమ్మ పండుగ వంటి వాటిని కూడా చూపించి అప్పటి తెలంగాణను కళ్లకు కట్టారు. అందుకే ప్రతి తెలంగాణ పౌరుడూ ఇది మా సినిమా అని గొప్పగా చెప్పుకుంటున్నారు.

ఒక సినిమా ఏం చేస్తుంది? ఎంటర్టైన్ చేస్తుంది. లేదా ఎడ్యుకేట్ చేస్తుంది. 'మా భూమి' రెండూ చేసింది. సినిమాగా చూస్తే అందరినీ అలరించింది. చరిత్రకు దృశ్యరూపంగా చూస్తే ఎన్నో విషయాలు అవగతమయ్యేలా చేసింది. అందుకే అది గొప్ప సినిమా అయ్యింది. 'మా భూమి విజయం ప్రతి తెలంగాణ పౌరుడి విజయం' అని చిత్ర దర్శకుడు గౌతమ్ గర్వంగా చెప్పుకోడానికి కారణమయ్యింది. అది ముమ్మాటికీ నిజమని నేడు మనమూ ఒప్పుకునేలా చేసింది. అందుకే.. నాడు గుప్పుమన్న తెలంగాణ మట్టి వాసన.. నేటికీ గుబాళిస్తోంది.

## అంత ఈజీ కాదు

కథ రాయడం ఒకెత్తు, దాన్ని తెరకెక్కించడం ఒకెత్తు. ఈ సినిమా డెబ్భైల కాలంలో తీస్తున్నారు. కానీ కథ ముప్పై, నలభైల కాలం నాటిది. అప్పటి స్థితిగతుల్ని సహజసిద్ధంగా చూపించగలగాలి. అందుకే నర్సింగరావు అత్తగారి ఊరైన మెదక్ జిల్లాలోని మంగళపర్తిని ఎంచుకున్నారు. కథానుసారం కరెంటు ఉండకూడదు. అప్పటికి ఆ ఊరిలో కూడా ఎలక్ట్రిసిటీ లేదు కనుక వారికి కలిసొచ్చింది. అయితే షూటింగ్ అంత ఈజీగా జరగలేదు. మంగళపర్తిలో కరెంటు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడ్డారు. ఒక బడిలో బస చేసి రాత్రంతా దోమలతో కుస్తీ పట్టేవారు. వర్షం పడినప్పుడైతే ఇక మామూలు అవస్థ కాదు. దర్శకుడు గౌతమ్ గోతిలో పడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇంకా దొంతి, దౌలతాబాద్, నర్సాపూర్ ఫారెస్ట్ వంటి వాటితో పాటు హైదరాబాద్‌లోని ప్రాంతాల్లోనూ షూట్ చేశారు. ఐదున్నర లక్షలు పెట్టి యాభై రోజుల పాటు చిత్రీకరణ సాగించారు. ఎంత కష్టపడితేనేం.. ఫలితం అద్భుతంగా వచ్చింది. పడిన కష్టాన్ని మరిపించింది. అయితే విడుదల సమయంలో ఇబ్బందులు తప్పలేదు. దొరతనాన్ని ప్రశ్నించిన ఈ చిత్రాన్ని కొన్నిచోట్ల ఆపేశారు. కానీ సినిమా ఆడింది. డబ్బులు తెచ్చింది. అంతకంటే ఎక్కువగా ప్రశంసలు మూటగట్టుకుంది. తెలుగు సినిమాకి మంచి రోజులు వచ్చాయంటూ పత్రికలు రాసేంత పేరు తెచ్చింది. ఇండియన్ పనోరమాకి ఎంపికైంది. నంది అవార్డులు అందుకుంది. ఎన్నో ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమైంది. దేశంలోని అత్యుత్తమ వంద చిత్రాల్లో చోటు దక్కించుకుంది.



## అందరూ కొత్తవారే..

ఈ సినిమాని గమనిస్తే ఒక్క కాకరాల తప్ప మిగతా వారంతా కొత్తవారే కనిపిస్తారు. హీరోగా త్రిపురనేని గోపీచంద్ కుమారుడు సాయిచంద్‌ని తీసుకున్నారు. జమీందారుగా ఎంబీవీ ప్రసాదరావు, పట్వారీగా లక్ష్మణ్‌రావు, చంద్రిగా హంస, కొన్ని కీలక పాత్రల్లో నర్సింగరావు, గద్దర్, భూపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్, యాదగిరి, రాజేశ్వరి తదితరులు నటించారు. తెలంగాణ శకుంతల ఈ సినిమాతోనే వెండితెరకు పరిచయమయ్యారు. కొన్ని ముఖ్యమైన సన్నివేశాల్లో అప్పటికప్పుడు స్థానికులే నటులుగా మారారు. గొల్ల కొమరయ్య, ఏడ్పుల పోచమ్మ వీళ్లెవరూ నటులు కారు. అవసరాన్ని బట్టి అప్పటికప్పుడు యాక్టర్లుగా మారిన స్థానికులు. అలా అన్నీ కొత్త ముఖాలే కనిపించాయి తెరమీద. కానీ ప్రతి ఒక్కరూ పాత్రల్లో లీనమవడం వల్ల ఎక్కడా వెలితి కనిపించదు.

## అన్నీ బెస్టే!

చక్కని నటీనటులే కాదు, మంచి టెక్నీషియన్స్ కూడా తోడవ్వడమే ఈ సినిమా సక్సెస్‌కి కారణం. టి.రాజగోపాల్ ఎడిటింగ్, చిత్రకారుడు తోట వైకుంఠం కళా దర్శకత్వం సినిమాకి కొత్త సొబగులు అద్దాయి. దర్శకుడు గౌతమ్ భార్య నీలాంజన కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేశారు. స్వయంగా గౌతమే నేపథ్య సంగీతం సమకూర్చుకున్నారు. అయితే ముఖ్యంగా చెప్పుకోవాల్సింది పాటల గురించి. వింజమూరి సీతాదేవి స్వరాలు నేటికీ పెదాలపై ఆడుతున్నాయంటే వాటి గొప్పదనం అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా గద్దర్ పాడిన 'బండెనక బండి కట్టి' పాటను నేటికీ తెలంగాణ జనజీవన గీతంగా చెప్పుకుంటారు. 'బండెనక బండి కట్టి, పదహారు బండ్లు గట్టి.. యే పల్లె బోతవ్ కొడుకో నైజాము సర్కరోడా' అంటూ బండి యాదగిరి రాసిన పదాలు తెలంగాణ ప్రజలను ఊపేశాయి. హనుమంతు రాసిన 'పల్లెటూరి పిల్లగాడ పసులగాసె మొనగాడ' కూడా మర్చిపోలేని పాట. 'పొడలా పొడలా గట్లా నడుమ' మరో మంచి పాట. ఇక నర్సింగరావు, ప్రాణ్‌రావు రాసిన సంభాషణలు కూడా సినిమాకి ప్రాణం పోశాయి. ఇంత గొప్ప ప్రతిభావంతులందరూ కలిసిన తర్వాత అంత గొప్ప సినిమా రూపొందకుండా ఎలా ఉంటుంది!



## నేటికీ అదే స్పిరిట్

మా భూమి సినిమా విడుదలై నలభయ్యేళ్లు అయ్యింది. కానీ నాకింకా ఈ సినిమా నిన్ననే తీసినట్టుంది. ఈ సినిమా గురించిన జ్ఞాపకాలు నా మనసులో ఎప్పుడూ తిరుగుతూనే ఉంటాయి. నా కెరీర్లో ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నా మనసు నాకు చెబుతూ ఉంటుంది.. కంగారు పడకు, నీలో మా భూమి స్పిరిట్ ఉంది, నువ్వు ఓడిపోవు అని. ఒక గొప్ప టీమ్తో కలిసి ఎంతో కష్టించి ఆ సినిమా తీసిన అనుభవం తలచుకుంటే ఇప్పటికీ ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంటుంది. ఆ జర్నీలో నాతో కలిసి నడిచిన వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

- గౌతమ్ ఘోష్, దర్శకుడు



## అద్భుత ఆవిష్కరణ

ప్రజల ఆలోచనలను ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో, ఒక గొప్ప ఆశయంతో తీసిన సినిమా ఇది. నాటి జ్ఞాపకాలన్నీ ఇప్పటికీ తాజాగానే ఉన్నాయి. సినిమా స్క్రిప్టును తయారు చేసేటప్పుడు చేసిన రీసెర్చ్.. మూవీ అద్భుతంగా రావడానికి దోహదపడింది. షూటింగ్ దశలో అనుభవాలు కూడా మర్చిపోలేనివి. నటీనటులు, టెక్నీషియన్లు అందరం కొత్తవాళ్లమే. షూటింగ్లో రోజూ ఎన్నో దెబ్బలు తగిలేవి. అయినా అలాగే పట్టుదలతో పని చేసేవాళ్లం. ఆ కష్టానికి ఫలితం దక్కింది. సినిమా విడుదలై విజయ ఢంకా మోగించింది. ఒక గొప్ప పొలిటికల్ ఓరియెంటెడ్ హిస్టారికల్ చిత్రంగా నిలిచిపోయింది. ప్రజల పోరాటానికి, ఆ చరిత్రకి, సంస్కృతికి పరిభాష మా 'మా భూమి'. అదొక అద్భుత ఆవిష్కరణ. ప్రజల సినిమా కనుక ప్రజలు గొప్పగా ఆదరించారు. ఒకాయనైతే ఆ సినిమా ఇరవై రెండు సార్లు చూశానని చెప్పాడు. ఇంకొకాయన నలభైసార్లు చూశానన్నాడు. అభినందనల్లో తడిసి ముద్దైపోయాను.

- బి.నర్సింగరావు, నిర్మాత



## అదొక అద్భుతం

అనుకోకుండా ఒకరోజు నర్సింగరావుగారు నన్ను తన ఆఫీసుకొచ్చి కలవమన్నారు. అప్పుడే గౌతమ్ ఘోష్‌ని కూడా మొదటిసారి కలిశాను. నేను నర్సింగరావు గారితో మాట్లాడుతుంటే గౌతమ్ నన్ను రకరకాల యాంగిల్స్‌లో పరిశీలిస్తున్నారు. కాసేపటి తర్వాత నా షర్ట్ తీయమన్నారు. నేను షాకైపోయి నర్సింగరావు గారి వైపు చూశాను. కారణం తర్వాత చెప్తాను చేయమన్నారు. తీసి చూపిస్తే కాసేపటి తర్వాత గౌతమ్ అన్నారు.. నువ్వే నా హీరోవి అని. అప్పటికి గానీ నాకు విషయం అర్థం కాలేదు. అంత బరువైన పాత్రను నేను పోషించగలనా అని భయపడ్డాను కానీ నర్సింగరావు ధైర్యం చెప్పారు. ఆయన అన్నట్టుగానే అద్భుతం జరిగింది. సినిమా చాలా బాగా వచ్చింది. హైదరాబాద్‌లో ఫ్యాక్టరీ సీన్ తీసిన తర్వాత 'నువ్వు ఈ సినిమా తర్వాత మీ తాతగారు త్రిపురనేని రామస్వామి, మీ నాన్నగారు త్రిపురనేని గోపీచంద్‌గా తరహాలోనే గొప్ప పేరు తెచ్చుకుంటావు' అని ఆయన అన్న మాటలు నేనిప్పటికీ మర్చిపోలేదు.

- సాయిచంద్, హీరో



## ఆ మానియాలోనే ఉన్నా

అప్పటి మా యువతరానికి ఒక శక్తిని, చైతన్యాన్ని నింపిన సినిమా 'మా భూమి'. అందుకే నలభయ్యేళ్లు గడిచినా నేను ఆ మానియాలోనే ఉన్నాను. స్టోరీ రాసి దాన్ని సినిమాగా మలచడం సులభం కాదు. గౌతమ్, నర్సింగరావు అద్భుతమైన స్క్రీన్‌ప్లే రాయడం వల్లే అది సాధ్యపడింది. సామాన్యులు తెరపై తమను తాము చూసుకున్నారు. క్యారెక్టర్లను కాన్సెప్ట్‌లో మమేకం చేసిన సినిమా ఇది. తెలుగులో రియలిజంతో చేసిన ఏకైక సినిమా.

- రవీంద్రనాథ్, నిర్మాత


















## ఎవరో మిస్సయినట్టున్నారే?

- ఐసీసీ ‘పుల్ షాట్ల’ పోల్‌పై రోహిత్ వ్యంగ్యాస్త్రం

**న్యూఢిల్లీ:** ఐసీసీ నిర్వహించిన బెస్ట్ పుల్‌షాట్ పోల్‌లో తన పేరు లేకపోవడంపై టీమిండియా డాషింగ్ ఓపెనర్ రోహిత్ శర్మ వ్యంగ్యంగా స్పందించాడు. ఆదివారం ట్విటర్‌లో నలుగురు బ్యాట్స్‌మెన్ ఫొటో పెట్టి.. వీరిలో ఎవరిది బెస్ట్ పుల్‌షాటో చెప్పాలని ఐసీసీ ట్వీట్ చేసింది. ఇందులో విండీస్ దిగ్గజం వివ్ రిచర్డ్స్, ఆసీస్ గ్రేట్ రికీ పాంటింగ్, సౌతాఫ్రికా మాజీ బ్యాట్స్‌మన్ హెర్షల్ గిబ్స్‌తోపాటు ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా ఉన్నాడు. అయితే పుల్‌షాట్ స్పెషలిస్టుగా పేరు తెచ్చుకున్న రోహిత్ ను మాత్రం ఐసీసీ ఈ లిస్ట్‌లో చేర్చలేదు. దీంతో రోహిత్ స్పందిస్తూ.. ‘ఈ ఫొటోలో ఎవరో మిస్సయినట్టున్నారు? నాకు తెలిసి ఇంటి నుంచి పని చేయడం అంత సులువు కాదు’ అని వ్యంగ్యంగా ట్వీట్ చేశాడు.

## కరోనాతో రియల్ మాడ్రిడ్ మాజీ ప్రెసిడెంట్ మృతి

మాడ్రిడ్: స్పెయిన్‌కు చెందిన ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ రియల్ మాడ్రిడ్ మాజీ ప్రెసిడెంట్ లోరెన్ శాంజ్(76) కరోనా వైరస్ బారిన పడి మరణించారు. లోరెన్ కరోనా వైరస్ వల్ల మరణించాడని ఆయన కొడుకు ప్రకటించాడు. 1995–2000 మధ్యలో లోరెన్.. రియల్ మాడ్రిడ్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. ఆ సమయంలో రియల్ మాడ్రిడ్ రెండు చాంపియన్ లీగ్ టైటిల్స్ సాధించింది.

## క్వారంటైన్ కేంద్రాలుగా సాయ్ సెంటర్లు

**న్యూఢిల్లీ:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సెంటర్లు క్వారంటైన్ కేంద్రాలుగా మారబోతున్నాయి. కరోనా ప్రభావంతో తాత్కాలికంగా మూతపడిన సాయ్ పరిధిలోని రీజనల్ సెంటర్లు, స్టేడియాలు, హాస్టళ్లను క్వారంటైన్ కేంద్రాలుగా వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని స్పోర్ట్స్ మినిస్ట్రీ ఆదివారం తెలిపింది. ఆరోగ్య శాఖ అభ్యర్థన మేరకు ఇందుకు ఒప్పుకున్నట్టు స్పోర్ట్స్ సెక్రటరీ రాధే శ్యామ్ జులానియా తెలిపారు. ‘ఈ సంక్షోభ సమయంలో ప్రభుత్వానికి కావలసిన సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నాం. సాయ్ పరిధిలో ఉన్న రీజనల్ సెంటర్లు, స్టేడియాలు, హాస్టళ్లను క్వారంటైన్ కేంద్రాలుగా వినియోగించుకుంటామని ఆరోగ్య శాఖ కోరింది. దీనికి అంగీకరించాం’ అని రాధే శ్యామ్ అన్నారు. అయితే, వాటిని ఎప్పటినుంచి వినియోగించుకుంటారనే దానిపై స్పష్టత లేదు.



## ఆత్మపరిశీలన చేసుకోండి

**కరోనా బ్రేక్‌ను వినియోగించుకోండి: పొలార్డ్**

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దొరికిన ఖాళీ సమయాన్ని ఆత్మ పరిశీలన చేసుకునేందుకు వాడుకోవాలని వెస్టిండీస్ లిమిటెడ్ ఓవర్ల కెప్టెన్ కీరన్ పొలార్డ్ సూచించాడు. తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనగానే ప్లేయర్లు టూర్లకు వెళ్లిపోవాల్సి ఉంటుందని.. అందుకే ఈ సమయాన్ని ప్లేయర్లు తమ కెరీర్, సొంత గేమ్‌ను పరిశీలన చేసుకోవడంతోపాటు ఫిజికల్‌గా, మెంటల్‌గా ఫిట్‌గా ఉండటానికి వినియోగించుకోవాలన్నాడు. వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా ఏ దశలో ఉన్నామో తెలుసుకోవడానికి.. భవిష్యత్ లో సాధించాల్సిన లక్ష్యాల గురించి ఆలోచించడానికి ఇదే మంచి తరుణమన్నాడు.




# ఒలింపిక్స్ రద్దయితే మా కష్టం వృథానే

**న్యూఢిల్లీ:**

- టోక్యో గేమ్స్ షెడ్యూల్ ప్రకారం జరగాలి
- నా కోసం నేను మెడల్ నెగ్గాలనుకుంటున్నా
- విశ్వక్రీడలు జరగాలని రోజూ ప్రార్థిస్తున్నా
- స్టార్ లిఫ్టర్ మీరాబాయి చాను

ప్రపంచ వ్యాప్తంగా వేగంగా ప్రబలుతున్న కరోనా నేపథ్యంలో ఒలింపిక్స్‌ను రద్దు చేయాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. దేశాధినేతలు, క్రీడా సంఘాల అధికారుల నుంచి ఆటగాళ్ల వరకూ అందరూ టోక్యో విశ్వక్రీడలను వాయిదా వేయడమే ఉత్తమం అంటున్నారు. కానీ, ఇండియా స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను మాత్రం నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ఒలింపిక్స్ జరగాలని అంటోంది. ఒకవేళ ఈ మెగా ఈవెంట్ రద్దయితే ఒలింపిక్ పతకం నెగ్గాలన్న తన కల నెరవేరదని అంటోంది. విశ్వ క్రీడల పతకం కోసం ఇన్నాళ్లుగా తాము పడ్డ కష్టం వృథా అవుతుందని వాపోతోంది. టోక్యోపై దృష్టి పెట్టిన మీరాబాయి నాలుగేళ్ల నుంచి తీవ్రంగా కృషి చేస్తోంది. అయితే, ఇప్పుడు ఒలింపిక్స్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారడంతో మీరాకు ఎటూ పాలుపోవడం లేదు. ‘ఒకవేళ ఒలింపిక్స్ జరగకపోతే నాలుగేళ్ల మా కష్టం వృథా అవుతుంది. నేనైతే విశ్వక్రీడలు రద్దవ్వాలని అనుకోవడం లేదు. పోటీలు జరగాలని రోజూ ఆ దేవుడిని ప్రార్థిస్తున్నా. కేవలం నా కోసమైనా ఓ ఒలింపిక్ మెడల్ నెగ్గాలని అనుకుంటున్నా’ అని మీరాబాయి తెలిపింది. రియో ఒలింపిక్స్‌లో పోటీ పడిన మీరా తీవ్రంగా నిరాశ పరిచింది. క్లీన్ అండ్ జర్క్‌లో మూడు ప్రయత్నాల్లో ఒక్క వెయిట్ కూడా ఎత్తలేకపోయింది. అయితే, టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చాను.. మెగా ఈవెంట్ ముందుకెళ్లాలని కోరుకుంటోంది. ‘మెడల్ సాధించాలని నాపై ఒత్తిడి పెరుగుతోంది. అందుకే నేను ఒలింపిక్స్ రద్దవకూడదని కోరుకుంటున్నా. ట్రెయినింగ్ సహా ఇతర విషయాల గురించి ఎలాంటి ఆందోళన లేదు. ఒకవేళ మెగా ఈవెంట్ పోస్ట్‌పోన్ అయినా కూడా చాలా సమస్యలు ఎదురవుతాయి. తక్కువ సమయంలోనే ప్లేయర్లకు సంబంధించి ఎన్నో మార్పులు జరుగుతాయ’ని మీరా చెప్పుకొచ్చింది. కరోనా నేపథ్యంలో ఒలింపిక్ వెయిట్‌లిఫ్టింగ్ క్వాలిఫయింగ్ షెడ్యూల్ కూడా దెబ్బతిన్నది. ఆసియా సహా ఐదు కాంటినెంటల్ చాంపియన్‌షిప్స్‌ను ఇంటర్నేషనల్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ రద్దు చేసింది. ఇక, గతేడాది కజకిస్థాన్‌లో జరగాల్సిన ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌ను తష్కెంట్‌లో నిర్వహించారు. ఒలింపిక్స్‌కు ముందు మీరాబాయి పోటీ పడ్డ చివరి ఈవెంట్ ఇది. కానీ, ఇందులో మీరా త్రుటిలో కాంస్యం చేజార్చుకుంది. ఈ టోర్నీ కోసం తాను మెరుగ్గా సన్నద్ధమై బరిలోకి దిగానని చాను చెప్పింది. అయితే, టోర్నీ జరుగుతుందా? లేదా? అనే విషయంలో అనిశ్చితి నెలకొందని తెలిపింది. అప్పటికే తాను ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయ్యానన్న మీరా.. ఒకవేళ ఆసియా చాంపియన్‌షిప్స్ జరిగితే బెర్తులపై స్పష్టత వచ్చేదని అభిప్రాయపడింది. ‘నా పెర్ఫామెన్స్‌ను మెరుగు పరుచుకొని మరింత ఆత్మవిశ్వాసంతో ఒలింపిక్స్‌కు వెళ్లాలనుకున్నా. ఆసియా టోర్నీ జరిగితే అందుకు నాకు మంచి వేదిక దొరికేది’ అని తెలిపింది.

### జాగ్రత్తలు పాటిస్తున్నాం

సెంట్రల్ స్పోర్ట్స్ మినిస్టర్ కిరణ్ రిజిజు ఆదేశాల మేరకు టోక్యో ఒలింపిక్స్ అథ్లెట్లు ప్రిపేరయ్యే క్యాంప్స్ మినహా అన్ని నేషనల్ క్యాంప్స్‌ను వాయిదా వేశారు. అలాగే, నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్లను కూడా మూసేశారు. ఈ నేపథ్యంలో వెయిట్‌లిఫ్టర్లు ట్రెయినింగ్ తీసుకుంటున్న పటియాలాలోని ఎన్ఐఎస్‌ను కూడా ఖాళీ చేయించారు. కేవలం ఒలింపిక్స్ కోసం శిక్షణ తీసుకుంటున్న కొద్ది మంది వెయిట్‌లిఫ్టర్లే ఎన్ఐఎస్‌లో ఉన్నారని మీరా చెప్పింది. లిఫ్టర్ల కోర్ గ్రూప్ మాత్రమే ట్రెయినింగ్‌లో పాల్గొంటోందని, తాము కూడా బయటికి వెళ్లాలంటే భయపడుతున్నామని తెలిపింది. ‘దేశంలో కరోనా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్ఐఎస్‌లో శిక్షణ తీసుకుంటున్న మేం కూడా తగిన జాగ్రత్తలు పాటిస్తున్నాం. ప్రాక్టీస్ సమయంలో తరచూ చేతులు శుభ్రం చేసుకుంటున్నాం. మమ్మల్ని మేం ఎలా కాపాడుకోవాలో తెలుసుకుంటున్నాం’ అని మీరా చెప్పుకొచ్చింది.

## ఒలింపిక్ జ్యోతి చూసేందుకు వేల మంది

- కరోనా భయంలోనూ తరలివస్తున్న జపాన్ ప్రజలు



**సెండై (జపాన్):** ఒకవైపు కరోనా వైరస్ కలవరపెడుతున్నప్పటికీ.. ఒలింపిక్ జ్యోతిని చూసేందుకు జపాన్ ప్రజలు క్యూ కడుతున్నారు. ఈశాన్య జపాన్‌లో ఉన్న జ్యోతిని కళ్లారా చూసేందుకు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. ఒలింపిక్ టార్చ్ గ్రీసు నుంచి శుక్రవారమే జపాన్‌కు వచ్చింది. కరోనా నేపథ్యంలో స్వాగత కార్యక్రమాలన్నీ రద్దు చేసిన నిర్వాహకులు సాదాసీదాగా టార్చ్‌ను ఆహ్వానించారు. భూకంపం, సునామీ, అణు యుద్ధం తర్వాత జపాన్ కోలుకున్న తీరును స్మరించుకునేలా మియాగిలోని సెండై స్టేషన్‌లో ఒలింపిక్ జ్యోతిని ఉంచారు. శనివారం ఒక్క రోజే దాదాపు యాభై వేల మంది ఈ జ్యోతిని చూసేందుకు వచ్చారు. దాదాపు అర కిలోమీటరు క్యూలో గంటల పాటు నిరీక్షించి మరీ ‘ఒలింపిక్ ఫ్లేమ్’ను చూసి వెళ్లారు. దాని ముందు నిల్చొని ఫొటోలు దిగారు. అందులో చాలా మంది మాస్కులు ధరించి కనిపించారు. అయితే, తాము ఊహించినదానికంటే ఎక్కువ మంది జనాలు రావడంతో నిర్వాహకులు కంగారు పడుతున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగితే ఈవెంట్‌ను రద్దు చేసే ఆలోచనలో ఉన్నారని స్థానిక మీడియా చెబుతోంది. ఇక, జపాన్ దేశ వ్యాప్తంగా జరిగే ఒలింపిక్ టార్చ్ ర్యాలీ ఈ నెల 26 నుంచి ఫుకుషిమ నుంచి మొదలవ్వాల్సి ఉంది.



## కనికా దిగిన హోటల్లోనే సఫారీలు కూడా..

### సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

**లక్నో:** కరోనా పాజిటివ్‌గా తేలిన బాలీవుడ్ సింగర్ కనికా కపూర్ ఉన్న హోటల్లోనే ఇండియా టూర్‌కు వచ్చిన సౌతాఫ్రికా టీమ్ కూడా బస చేసిందన్న విషయం సంచలనం రేపుతోంది. మూడు వన్డేల సిరీస్ కోసం ప్రోటీస్ టీమ్ ఇటీవల ఇండియాకు వచ్చింది. అందులో భాగంగా ధర్మశాలలో జరగాల్సిన తొలి వన్డే వర్షం కారణంగా రద్దవగా.. రెండో వన్డే కోసం సౌతాఫ్రికా జట్టు లక్నో చేరుకుంది. సరిగ్గా ఆ సమయంలోనే ఓ న్యూస్ చానల్ నిర్వహించిన వార్షిక కాన్‌క్లేవ్ మీటింగ్‌లో పాల్గొనడానికి కనికా అదే హోటల్లో దిగింది. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఆ హోటల్‌లో ఉన్న కనికా.. అక్కడ భోజనం చేయడంతోపాటు పలువురు గెస్ట్‌లను కూడా కలిసిందని సమాచారం. దీంతో ఆ టైమ్‌లో ఆమె ఎవరెవరిని కలిసిందనే దానికి సంబంధించి.. హోటల్ సీసీటీవీ ఫుటేజీలను ఓ ఎక్స్‌పర్ట్ బృందం పరిశీలిస్తోంది.

## మా ప్రిపరేషన్స్‌ను కరోనా అడ్డుకోలేదు

- హాకీ నేషనల్ టీమ్ కోచ్ గ్రహమ్ రీడ్
- ఒలింపిక్స్ కోసం ట్రెయినింగ్ కొనసాగిస్తున్న టీమిండియా

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి దెబ్బకు మిగతా అన్ని జట్ల ఒలింపిక్స్ సన్నాహాలు దెబ్బతిన్నా.. తాము మాత్రం ట్రెయినింగ్ కొనసాగిస్తున్నామని నేషనల్ హాకీ టీమ్ చీఫ్ కోచ్ గ్రహమ్ రీడ్ చెప్పాడు. కరోనా ప్రభావాన్ని తగ్గించడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్), హాకీ ఇండియా (హెచ్ఐ) తీసుకుంటున్న చర్యలను రీడ్ మెచ్చుకున్నాడు. రోజురోజుకూ పరిస్థితులు మారిపోతున్నాయని, అయినా వేరే దేశాలతో పోలిస్తే మనం ట్రెయినింగ్ ను కొనసాగిస్తున్నామని పేర్కొన్నాడు. ‘టీమిండియా ప్లేయర్లు ఐసోలేషన్‌లో ఉన్నప్పటికీ షెడ్యూల్ ప్రకారం సన్నాహకాలు చేస్తున్నారు. ఆస్ట్రేలియా ఆటగాళ్లు తమ కుటుంబాలతో ఉంటూనే పెర్త్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. అర్జెంటీనా ప్లేయర్లు సెంట్రలైజ్డ్ ప్రోగ్రామ్‌ను ప్లాన్ చేసినప్పటికీ.. ఈ పరిస్థితుల్లో వారు ట్రెయినింగ్ చేయడం కష్టమే. మన జట్టు మాత్రం ఒకే దగ్గర ఉంటూ సన్నాహకాలు చేస్తోంది. క్యాంపులో మొత్తం 32 మంది ప్లేయర్లు ఉన్నారు. వారితో కాంపిటీటివ్ హాకీ ఆడిస్తున్నాం. ఇంటర్నేషనల్ లెవెల్ ట్రెయినింగ్ సాగుతోంది. ప్రతి రోజు వైవిధ్యమైన స్టైల్స్ లో హాకీ ఆడుతున్నారు. ఒక రోజు జర్మన్స్‌లా, మరో రోజు ఆస్ట్రేలియాలా.. విభిన్న రీతిల్లో ప్రాక్టీస్ కొనసాగుతోంది. హాకీ ఇండియాతో పాటు గవర్నమెంట్ నుంచి తదుపరి సూచనల కోసం ఎదురుచూస్తున్నాం. దాని ప్రకారం అవసరమైతే మా ఒలింపిక్ ప్రిపరేషన్ ను రీ షెడ్యూల్ చేస్తాం. ఒలింపిక్స్ వాయిదాపై ఇంటర్నేషనల్ ఒలింపిక్ అసోసియేషన్, టోక్యో గేమ్స్ ఆర్గనైజర్లు నిర్ణయం తీసుకుంటారు. ప్రపంచ క్రీడల్లో భాగం కావాలనేది ప్రతి ఒక్క అథ్లెట్ చిరకాల కోరిక. ఇలాంటి సమయంలో ప్లేయర్లు పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉండాలి. ఒలింపిక్స్‌లో ఆడతామనేదే వారికి అతిపెద్ద స్ఫూర్తి. ఇటీవల టాప్-3 టీమ్స్‌తో మూడు ప్రో లీగ్‌మ్యాచ్‌ల్లో తలపడ్డాక.. శక్తిమేర ఆడితే ఏదైనా చేయగలమనే నమ్మకానికి వచ్చాం’ అని వివరించాడు.



## మీ దేశాల్లో పరిస్థితి ఎట్లుంది?

- అథ్లెట్ల ప్రిపరేషన్లపై కరోనా ప్రభావం ఉందా?
- నేషనల్ ఒలింపిక్ కమిటీలను ప్రశ్నించిన ఐఓసీ

**పారిస్:** ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలన్న డిమాండ్లు ఎక్కువవుతున్న నేపథ్యంలో తమ దేశాల్లో అథ్లెట్ల ప్రిపరేషన్స్‌పై కరోనా వైరస్ ప్రభావం ఎంతమేరకు ఉందో చెప్పాలని నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఎన్ఓసీ)లను ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) కోరింది. ఈ మేరకు ‘కొవిడ్-19 అండ్ ప్రిపరేషన్ ఫర్ ద టోక్యో 2020 ఒలింపిక్స్ గేమ్స్’ పేరిట ఎన్ఓసీలకు ప్రశ్నాపత్రం పంపించింది. కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో వివిధ దేశాల్లో ఎమర్జెన్సీ పరిస్థితుల వల్ల అథ్లెట్ల ట్రెయినింగ్, ఒలింపిక్ ప్రిపరేషన్లకు ఎలాంటి అంతరాయం కలుగుతుందో చెప్పాలని కోరింది. ట్రెయినింగ్ క్యాంప్‌లను రద్దు చేయాల్సి వస్తోందా? వాటిని వేరే చోటుకు తరలించాల్సిన పరిస్థితి ఉందా? అని ప్రశ్నించింది. అయితే, ఎన్ఓసీలు ఇచ్చే సమాధానాలతో ఏం చేస్తుందో మాత్రం ఐఓసీ చెప్పలేదు. విశ్వక్రీడలను వాయిదా వేయాలని ‘యూఎస్ఏ స్విమ్మింగ్’ డిమాండ్ చేసిన తర్వాత ఐఓసీపై ఒత్తిడి పెరిగింది. ఒలింపిక్స్ కోసం తమ స్విమ్మర్లు సాధారణంగా ప్రాక్టీస్ చేసే పరిస్థితి లేదని, వాళ్లకు వైరస్ సోకే ప్రమాదం ఉందని యూఎస్ఏ స్విమ్మింగ్ హెచ్చరించింది. ఒలింపిక్స్ వాయిదాకు డిమాండ్ చేయాలని యూఎస్ఏ ట్రాక్ అండ్ ఫీల్డ్ హెడ్ సెయిగెల్.. తమ దేశ ఒలింపిక్ కమిటీని విజ్ఞప్తి చేశారు.

# వాట్ ఈజ్ ప్లాన్-బి?

**టోక్యో:**

‘ఒలింపిక్స్‌కు ఉన్న శాపం వల్లే ప్రతీ 40 ఏళ్లకు ఓసారి ఇలాంటి పరిస్థితి వస్తోంది’ జపాన్ ఆర్థిక మంత్రి టారో ఏసో చేసిన వ్యాఖ్యలివి. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో ఈ మాటల్లో నిజం ఉందనే అనిపిస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం వల్ల 1940 ఒలింపిక్స్ రద్దు అవ్వగా.. 1980 మాస్కో ఒలింపిక్స్‌ను బాయ్‌కాట్ చేశారు. కరోనా దెబ్బకు ఇప్పుడు టోక్యో ఒలింపిక్స్ పరిస్థితి కూడా అగమ్యగోచరంగానే మారింది. ప్రపంచమంతా లాక్‌డౌన్ దిశగా అడుగులు వేస్తున్న వేళ టోక్యో ఒలింపిక్ గేమ్స్ నిర్వాహకులు మెట్టు దిగినట్లు సమాచారం. అథ్లెట్లు, స్పోర్ట్స్ అసోసియేషన్ల నుంచి వస్తున్న ఒత్తిడికి తలొగ్గిన ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ(ఐఓసీ) తదుపరి చర్యలపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం గేమ్స్ నిర్వహించలేకపోతే తర్వాత ప్లాన్ ఏంటనే దానిపై కసరత్తులు మొదలుపెట్టినట్టు తెలిసింది. కానీ ఆతిథ్య దేశం జపాన్ మాత్రం ఒలింపిక్స్ నిర్వహణ విషయంలో పట్టు విడవడం లేదు. ఒలింపిక్స్ షెడ్యూల్ ప్రకారమే జరిగి తీరుతాయని జపాన్ ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికీ కచ్చితంగా చెబుతున్నారు. గేమ్స్ షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు జరిగినా జపాన్ భారీ నష్టాన్ని ఎదుర్కోవాల్సి రావడమే వారి పట్టుదలకు కారణం. అలాగని ఆతిథ్య దేశాన్ని కాదని గేమ్స్‌ను ఎక్కువ కాలం వేయిదా వేస్తే అథ్లెట్లకు, స్పాన్సర్లకు సమస్యలు తప్పవు. ఈ క్లిష్ట పరిస్థితిని ఐఓసీ ఎలా అధిగమిస్తుందో చూడాల్సి ఉంది.



- ప్రత్యామ్నాయాలపై ఐఓసీ దృష్టి
- త్వరలో అధికారిక ప్రకటన?

**ఏం చేస్తే బెటర్?**

టోక్యో ఒలింపిక్స్‌పై అధికారిక ప్రకటనలు లేకపోయినా.. బయటికొస్తున్న లీకుల ప్రకారం గేమ్స్ వాయిదా పడడం ఖాయంగా కనిపిస్తోంది. గేమ్స్‌ను ఒకవేళ వాయిదా వెయ్యాల్సి వస్తే.. ఆ తర్వాత ఏం చేద్దాం, ఎలా చేద్దాం అనే దానిపై ఐఓసీ ప్లాన్స్ సిద్ధం చేస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీకి చెందిన ఓ అధికారి తెలిపారు. అంతేకాక ఉన్నతాధికారుల ఆదేశానుసారం తాము నాలుగైదు ప్లాన్స్ సిద్ధం చేస్తున్నామని కూడా చెప్పారు. ప్రేక్షకులు లేకుండా ఖాళీ స్టేడియాల్లో గేమ్స్ పూర్తి చేయడానికే కమిటీలో ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. గేమ్స్‌ను ఒకట్రెండు ఏళ్లు వాయిదా వేయడం మరో ప్లాన్ అయితే, ఓ నెల లేదంటే 45 రోజులు ఆలస్యంగా గేమ్స్‌ను ప్రారంభించాలని మరికొందరు సూచిస్తున్నారు. ఈ నెలాఖరులో జరిగే ఆర్గనైజింగ్ కమిటీ మీటింగ్‌లో ఆయా ప్రత్యామ్నాయాలపై చర్చ జరుగుతుందని చెబుతున్నారు. తుది నిర్ణయం తీసుకోవాల్సింది ఐఓసీనే అయినా జపాన్ ప్రభుత్వం మద్దతు లేకుండా ముందుకెళ్లడం అసాధ్యం.

### లేట్ చేస్తే లాస్ పెరుగుతది..

నిజానికి కరోనా దెబ్బకు గేమ్స్ వాయిదా పడినా, రద్దు చేసినా నిర్వాహకులతోపాటు స్పాన్సర్లు, అథ్లెట్లు అందరూ నష్టపోవాల్సి వస్తుంది. అయితే ఐఓసీ నాన్చుడు విధానం వల్ల ఈ నష్టం మరింత ఎక్కువ అయ్యే ముప్పు ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపక్క ఒలింపిక్స్ జరగడంపై గందరగోళం కొనసాగుతున్నా.. ఒలింపిక్ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాట్లు చేయడం కొనసాగిస్తోంది. గేమ్స్ నిర్వహణపై ఓ స్పష్టమైన నిర్ణయం వెలువడే దాకా ఈ పనులు జరుగుతూనే ఉంటాయి. ఆ లోపు చాలా పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అందువల్ల ఐఓసీ కాలయాపన చేయకుండా నిర్ణయం తెలపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఐఓసీ నిర్ణయం ‘వాయిదా’.. అయితే అది త్వరగా చెప్పాలని లేదంటే నష్టం భరించలేమని ఆర్గనైజింగ్ కమిటీకి చెందిన ఓ సభ్యుడు కూడా వాపోయారు.

Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.

epaper.v6velugu.com